thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 3 కరీంనగర్ శనివారం, 15 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సరిహద్దుల్లో పాక్ కాల్పులు

జమ్మూ : జమ్మూకశ్మీర్ పూంఛ్ జిల్లా కృష్ణ ఘాటీ సెక్టర్‌లో అర్ధరాత్రి తీవ్ర అలజడి నెలకొంది. పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత సైన్యంపైకి ఒక్కసారిగా కాల్పులు జరిపింది. వెంటనే తేరుకున్న భారత సైన్యం ప్రతిగా ఎదురు కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో పాకిస్థాన్ వైపు భారీగా ప్రాణ నష్టం జరిగిందని భారత సైనికాధికారులు వెల్లడించారు. అయితే మృతుల సంఖ్యను మాత్రం స్పష్టంగా చెప్పలేదు. వారి వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ మృతి చెందిన కొంతమంది సైనికులకు ఓ పాక్ అధికారి నివాళులర్పిస్తున్న తేదీలేని వీడియో ఫేస్ బుక్‌లో దర్శనమిచ్చింది. మరోవైపుకృష్ణ ఘాటీ సెక్టర్‌లో ఓ భారత జవాను ప్రమాదవశాత్తు ల్యాండ్‌మైన్‌పై కాలు పెట్టి గాయపడగా అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

# క్లైమాక్స్‌లో ఈటెల–అరుణ..




## తెలంగాణ బిజెపి రథసారధి ఎవరు!?

హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక క్లయిమాక్స్‌కు చేరిందా? రేసులో ఇద్దరు నేతలు మిగిలారా? ఎవరి వైపు అధిష్టానం మొగ్గు చూపుతుంది? తొలుత ఈటెల వైపు మొగ్గు చూపినా, అరుణ అయితే బెటరని ఓ అంచనాకు వచ్చిందా?

ఈటెలకు మరో పదవి ఇవ్వాలనే ఆలోచన చేస్తోందా? దీనిపై ఆ పార్టీలో ఎలాంటి చర్చ జరుగుతోంది?

**చివరి దశలో అధ్యక్ష పదవి...** తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక ఆలస్యమవుతోంది. తొలుత జనవరి సెకండ్ వీక్‌లో ప్రకటన వస్తుందని జోరుగా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఫిబ్రవరి చివరలో అని అంటున్నారు. ప్రస్తుతం అధ్యక్షుడు కిషన్ రెడ్డి మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త అధ్యక్షుడు రాబోతున్నారని వరంగల్ పర్యటనలో వెల్లడించారు. దీంతో పార్టీలో ఏం జరుగుతోందన్న చర్చ నేతలు, కార్యకర్తల్లో మొదలైంది. తెలంగాణలో రాజకీయాలు ప్రస్తుతం బీసీల చుట్టూనే తిరుగుతోంది. రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నట్లు కులగణన నివేదిక తేల్చింది. ఈవిషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. సంస్థల ఎన్నికల్లో మా పార్టీ 42 సీట్లను బీసీలకు ఇస్తామన్నారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గినా, పార్టీ పరంగా తాము సీట్లు కేటాయిస్తామని స్వయంగా వెల్లడించారు. ఈ క్రమంలో బీజేపీ ఆలోచనలో పడింది. తొలుత ఈటెలను నియమించాలనే దాదాపు ఓ అంచనాకు వచ్చారు.

కాంగ్రెస్ పార్టీని అనుసరిస్తే ఆ ట్రాప్‌లో పడ్డామనే అపవాదు వస్తుందని కమలనాథులు భావిస్తున్నారట. ఎలాంటి సమస్య లేకుండా మహిళకు అప్పగిస్తే బాగుంటుందని మెజార్టీ నేతలు చెబుతున్నారు. అలాగైతే రేసులో ఉన్న ఏకైన మహిళ డీకె అరుణ. మహిళా కోటాలో ఆమెని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే ఈటెలకు బిగ్ షాక్ తప్పదని అంటున్నారు.

**అరుణకే ఎక్కువ ఛాన్స్?...** బీజేపీ ఆలోచన వెనుక కారణాలు చాలానే ఉన్నాయట. స్థానిక సంస్థల ఎన్నికల ముందు అధ్యక్షురాలిగా డీకే అరుణను నియమిస్తే పార్టీ మంచి ఫలితాలు వస్తాయని లెక్కలు వేస్తోందట ఆ పార్టీ. దీనిద్వారా దక్షిణ తెలంగాణ లో పార్టీ పట్టు సాధించేందుకు అవకాశాలు ఉంటాయని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రధాన పార్టీలు మహిళలకు అధ్యక్ష పదవి ఇచ్చిన సందర్భం లేదు. ఇది పార్టీకి కలిసి వస్తుందని భావిస్తోంది. డీకే అరుణ విషయానికొస్తే.. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన అనుభవం ఆమె సొంతం. ప్రస్తుతం మహబూబ్‌నగర్ ఎంపీగా కొనసాగుతున్నారు. అరుణకు పగ్గాలు అప్పగిస్తే పార్టీ బలోపేతం అంచనా వేస్తున్నారు. గతంలో కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా పని చేశారామె. కేంద్రం మైనార్టీ, వక్ఫ్ బోర్డు ఆస్తుల కమిటీలో సభ్యురాలిగా కొనసాగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన తర్వాత తెలంగాణ నుంచి కేంద్రమంత్రిగా డీకే అరుణకు అవకాశం కల్పిస్తారని ఆమె వర్గీయులు భావించారు.

అయితే ఆ పదవి బండి సంజయ్‌కు దక్కింది. మరో పదవి వస్తుందని ఆమె చాలా ఆశలు పెట్టారు. ఇటీవల జరిగిన రాష్ట్రాల్లో ఎన్నికల్లో వరుసగా బీజేపీ విజయం సాధించింది. ఈ క్రమంలో ఢిల్లీ స్థాయిలో పైరవీలు మొదలైనట్టు తెలుస్తోంది. మొత్తానికి తెలంగాణ బీజేపీ నేతల ఉత్కంఠకు ఎప్పుడు తెరపడుతుందో చూడాలి.




## తెలంగాణ గ్రూప్ -3 ఫలితాలు విడుదల..

### జనరల్ ర్యాంక్‌ల జాబితా ఇదే..

తెలంగాణలో గ్రూప్ -3 ఫలితాలు విడుదలయ్యాయి. గతేడాది నవంబర్‌లో జరిగిన ఈ పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కులతో పాటు జనరల్ ర్యాంకుల జాబితాను టీజీపీఎస్సీ శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించింది. అలాగే, గ్రూప్–3 పరీక్ష తుది కీ, మాస్టర్ క్వశ్చన్ పేపర్లతో పాటు ఓఎంఆర్ షీట్లను డౌన్‌లోడ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

**తెలంగాణ గ్రూప్–2 ఫలితాల్లో టాప్ 10 ర్యాంకర్లు వీరే..** రాష్ట్రంలో 1,365 గ్రూప్–3 ఉద్యోగాలకు 5,36,400 మంది దరఖాస్తు చేసుకోగా.. గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో మూడు పేపర్లుగా జరిగిన ఈ పరీక్షలకు కేవలం 50.24శాతం మంది మాత్రమే హాజరయ్యారు. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్– 1, గ్రూప్ –2 ఫలితాలను టీజీపీఎస్సీ తాజాగా గ్రూప్–3 ఫలితాలను విడుదల చేసింది.

అలాగే, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను మార్చి 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల తుది ఫలితాలను మార్చి 19న ప్రకటించనున్నారు.

## ఎన్నాళ్లు ఇలా? ప్రజలపై అలక.. ఆసక్తి లేక?




అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తానని పార్టీ వర్గాలతో చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ అసెంబ్లీకి డుమ్మాకొట్టారు%ొ% రెండు సార్లు పవర్‌లో ఉన్నప్పుడు అసెంబ్లీలో విపక్షాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిన గులాబీ బాస్.. ఇప్పుడు ప్రతిపక్షనేత పాత్ర పోషించడానికి వెనకాడుతున్నారు .. గత బడ్జెట్ సమావేశాల్లో వ్యహరించినట్లు ఈ సారి కూడా గవర్నర్ ప్రసంగం రోజు హాజరు వేయించుకుని వెళ్లిపోయారు.. అంటే ఆయనకు అసెంబ్లీకి హాజరై చర్చల్లో పాల్గొనే ఉద్దేశం లేదా? ఈ బడ్జెట్ సమావేశాల్లో ఆయన మళ్లీ కనిపించరా? తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి.. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత హెూదాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారా? లేదా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూశారు. ఇటీవల బీఆర్ఎస్ వర్గాల ముందు ఈ సారి అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతానని కేసీఆర్ ప్రకటించినట్లు ప్రచారం జరిగింది.. దానికి తగ్గట్లేఅసెంబ్లీ సమావేశాల ముందు రోజు కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చారు..సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ భవన్‌కు వచ్చిన కేసీఆర్....అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై తనపార్టీ సభ్యులకు కేసీఆర్ దిశా నిర్దేశం చేశారంట. దాంతో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు స్టార్ట్ అయినప్పటి నుంచి కేసీఆర్‌పైనే అందరి దృష్టి పడింది. అనుకున్నట్లే సభకు హాజరైన గులాబీబాస్ గవర్నర్ ప్రసంగం రోజున సభలో కనిపించారు. ఆరు నెలల తర్వాత సభకు వచ్చిన కేసీఆర్.... ప్రతిపక్ష నేత హెూదాలో బీఏసీ సమావేశానికి హాజరుకాలేదు..రెండవరోజు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం జరిగినా కేసీఆర్ డుమ్మా కొట్టడం చర్చినీయంశంగా మారింది.

ఆ క్రమంలో సభా ప్రాంగణంలో ఎవరిని కదిపినా కేసీఆర్ అసెంబ్లీ హాజరుపైనే చర్చ నడుస్తుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగేటప్పుడు.. బీఆర్ఎస్ తరఫున కేసీఆర్ మాట్లాడతారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆయన అసలు అసెంబ్లీకే హాజరుకాలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక తొలి శాసనసభ సమావేశాలు జరిగినప్పుడు తుంటికి గాయం కారణంగా ఆస్పత్రిలో చేరిన కేసీఆర్ సభకు హాజరుకాలేదు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారానికి అసెంబ్లీకి వచ్చి వెళ్లిన ఆయన గత ఏడాది బడ్జెట్ సమావేశాల్లో కూడా ఒక్క రోజు హాజరు వేయించుకుని వెళ్లిపోయారు.

ఈ నేపథ్యంలో ఆయన ఈ సారి బడ్జెట్ సమావేశాలకు హాజరుకానున్నారని పెద్దఎత్తున బీఆర్ఎస్ వర్గాలు ప్రచారం చేశాయి. కానీ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు గవర్నర్ ప్రసంగానికి హాజరై.. రెండోరోజు సభకు రాకుండా ఆయన ముఖం చాటేశారు. అయితే ఈనెల 19న బడ్జెట్ ప్రవేశ పెట్టే సందర్భంగా కేసీఆర్ సభకు వచ్చే అవకాశాలున్నాయని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తమకు ఈ సారి అధికారం కట్టబట్టలేదనే కోపంతో కేసీఆర్ జనాలపై అలుగుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గెలుపు ఓటములు సహజమని.. ఇప్పటి నుంచే ఆయన ప్రజా సమస్యలపై గళం విప్పితే.. జనం హర్షిస్తారని సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఎమ్మెల్యేలందరూ కేసీఆర్ ను అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని... డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కేవలం అసెంబ్లీకి రాకుంటే స్పీకర్ చర్యలు తీసుకుంటారన్న భయంతో ఆరు నెలలకు ఒక సారి వచ్చి వెళ్లడం తప్ప .. ఆయనకు సభలో ప్రతిపక్ష నేత పాత్ర పోషించే ఉద్దేశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆ క్రమంలో కేసీఆర్ ప్రతిపక్ష నేతగా జీతభత్యాలు పొందుతూ అసెంబ్లీకి రావడం లేదంటూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ , అసెంబ్లీ సెక్రటరీకి హస్తం పార్టీ నేతలు ఫిర్యాదు చేసే వరకు వచ్చింది పరిస్థితి. ఆయినా ఆయన తిరిగి అసెంబ్లీకి డుమ్మా కొట్టడం అటు పొలిటికల్ సర్కిల్స్‌తో పాటు పబ్లిక్‌లోనూ విమర్శలపాలవుతోంది.

# హెూలీ వేళ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..





## ఆ రంగుల్లో రేషన్ కార్డులు

హైదరాబాద్ : కొత్త రేషన్ కార్డులపై తెలంగాణ సర్కారు కీలక ప్రకటన చేసింది. ఏప్రిల్ నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఉండొచ్చని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారితో పాటు ఎగువన ఉన్నవారికి కూడా రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్లుగా మంత్రి తెలిపారు. అయితే ఏపీఎల్ వారికి ఇచ్చే రేషన్ కార్డులపై సబ్సిడీతో కూడిన ఎలాంటి రేషన్ సరుకుల సరఫరా ఉండదు. ఏపీఎల్ వారికి సన్నబియ్యాన్ని ఇవ్వాలని భావిస్తున్నా.. బియ్యం సేకరణ ధర, నిర్వహణ ఛార్జీలను కలిపి రేషన్ షాపుల్లో విక్రయించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో ఎవరికీ ఎలాంటి అపోహలు అవసరం లేదని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. ఇప్పటికే పింక్ కార్డులు ఉన్న వారికి గ్రీన్ కలర్ కార్డులు, తెల్ల కార్డులు ఉన్న వారికి ట్రై కలర్ కార్డులు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటన చేశారు.

అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డులను మూడు రంగుల్లో జారీ చేయాలని, గులాబీ కార్డులను గ్రీన్ కార్డులుగా మార్చాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారికి ఇచ్చే కార్డులు ప్రస్తుతానికి గుర్తింపు కార్డులుగా మాత్రమే ఉపయోగపడతాయన్నారు. ఉచితంగా సన్నబియ్యం ఇచ్చే కార్డులపై ఎవరెవరి ఫోటోలు ఉండాలన్నది ప్రస్తుతానికి బయటపెట్టలేమన్నారు.

**ఆ రంగుల్లో కొత్త రేషన్ కార్డులు..!** మరో వైపు చిప్ తో కూడి స్మార్ట్ రేషన్ కార్డుల కోసం టెండర్లు ఆహ్వానించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కార్డుల డిజైన్ పూర్తయిందని.. వచ్చే నెలలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. సన్న బియ్యం పంపిణీకి ఇంకా పూర్తి స్థాయిలో సమాయత్తం కాలేదని చెప్పిన మంత్రి ఉత్తమ్.. మే నుంచి బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

చురకలు

శనివారం 15 మార్చి 2025



## తెలంగాణలో మండుతోన్న ఎండలు.. మార్చిలోనే 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతల నమోదు

హైదరాబాద్: తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెలలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని.. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు. రానున్న రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఎండ తీవ్రతతోపాటు వడగాలుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఈ జిల్లాల్లో ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నందున మరో 7 జిల్లాల్లోనూ శనివారం నుంచి ఎల్లో హెచ్చరికలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారి తెలిపారు.




తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనాలు కల్పిస్తామని ఏపీ ప్రభుత్వం, తితిదే పాలక మండలి చేసిన ప్రకటనను అమలు చేయాలని భాజపా ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వేసవి సెలవుల్లో తమ సిఫార్సు లేఖలపై వచ్చే భక్తులకు దర్శనాలు కల్పించకపోతే తెలంగాణ ప్రజాప్రతినిధులందరూ తిరుమలకు వచ్చి తితిదేతో తేల్చుకుంటామని అన్నారు. ఈ విషయంపై తితిదే వెంటనే స్పందించాలన్నారు.




శాసనసభలో స్పీకర్ స్థాయిని తగ్గించేట్లు భారాస ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి వ్యవహరించారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ధర్నాలు చేయడం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వాళ్లే నిరసన తెలపడం హాస్యాస్పదమన్నారు. సభలో ఏవిధంగా ప్రవర్తించాలో తెలిసి కూడా భారాస నేతలు ఉద్దేశపూర్వకంగా నిరసనలు చేస్తున్నారని పొన్నం విమర్శించారు.

## స్పీకర్ అలా వ్యవహరించకపోతే అవిశ్వాసం పెడతాం: హరీశ్ రావు

హైదరాబాద్ : స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించకపోతే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు హెచ్చరించారు. 'సభ మీ ఒక్కరిది కాదు అందరిదీ అని జగదీశ్ రెడ్డి అన్నారు. 'నీ' అన్న మాట ఆయన అనలేదు. 'మీ' అనే పదం సభ నిబంధనలకు విరుద్ధమేమీ కాదు. మరి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసనలు చేశారో, సభను ఎందుకు వాయిదా వేశారో తెలీదు' అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ అసెంబ్లీలో, బయటా అసత్యాలే మాట్లాడుతున్నారని, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని హరీశ్ రావు విమర్శించారు. TVVP డాక్టర్లు, నర్సులు, హెూం గార్డులు సహా ఇతర సిబ్బందికి వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. '13 రోజులు గడుస్తున్నా వైద్యారోగ్య శాఖలోని TVVP సిబ్బందికి జీతాలు చెల్లించలేదు. పోలీసు శాఖలోనూ ఇదే దుస్థితి. దుష్ప్రచారంతో ఇంకెంత కాలం వెళ్లదీస్తారు?' అని ప్రశ్నించారు. స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించకపోతే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు హెచ్చరించారు. 'సభ మీ ఒక్కరిది కాదు అందరిదీ అని జగదీశ్ రెడ్డి అన్నారు. 'నీ' అన్న మాట ఆయన అనలేదు. 'మీ' అనే పదం సభ నిబంధనలకు విరుద్ధమేమీ కాదు. మరి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసనలు చేశారో, సభను ఎందుకు వాయిదా వేశారో



తెలీదు' అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ అసెంబ్లీలో, బయటా అసత్యాలే మాట్లాడుతున్నారని, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని హరీశ్ రావు విమర్శించారు. TVVP డాక్టర్లు, నర్సులు, హెూం గార్డులు సహా ఇతర సిబ్బందికి వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. '13 రోజులు గడుస్తున్నా వైద్యారోగ్య శాఖలోని TVVP సిబ్బందికి జీతాలు చెల్లించలేదు. పోలీసు శాఖలోనూ ఇదే దుస్థితి. దుష్ప్రచారంతో ఇంకెంత కాలం వెళ్లదీస్తారు?' అని ప్రశ్నించారు.



## మల్లారెడ్డిని చెడుగుడు ఆడిన రేవంత్, కోమటిరెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో మరోసారి ఆసక్తికర రాజకీయ వ్యాఖ్యలు చోటు చేసుకున్నాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రంగా స్పందించారు.


**– మేడ్చల్ గ్రామాల అంశంపై మల్లారెడ్డి అభ్యంతరం...** మేడ్చల్ సమీపంలోని కొన్ని గ్రామాలను జీహెచ్ఎంసీ పరిధిలోకి చేర్చకూడదని మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనివల్ల గ్రామీణ పేద ప్రజలపై భారీగా పన్నుల భారం పడుతుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలంటూ మల్లారెడ్డి కోరారు.

**– హైదరాబాద్ బ్రాండ్.. మల్లారెడ్డి విమర్శలు...** హైదరాబాద్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దిన కేసీఆర్, కేటీఆర్‌ను పొగడ్తలతో మల్లారెడ్డి అభివర్ణించారు. అయితే, ప్రస్తుతం హైదరాబాద్ 'హైడ్రా' పేరుతో దిగజారిపోయిందని.. దీనికి కారణం సీఎం రేవంత్ రెడ్డేనని ఆయన ఆరోపించారు.

**– రేవంత్ రెడ్డి కౌంటర్....** మల్లారెడ్డికి చెడుగుడు ఆడిన రేవంత్ రెడ్డి "అదానీని తీసుకొచ్చి 100 కోట్లతో స్కిల్ యూనివర్సిటీ స్థాపించేందుకు ప్రయత్నించామంటే హరీష్ రావు, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు రచ్చ చేశారు. అభివృద్ధి ప్రాజెక్టులు తెచ్చేందుకు మేం ప్రయత్నిస్తే, మీ నాయకులు అడ్డుకోవడం తప్ప ఇంకేం చేయలేదు" అని విమర్శించారు.

**– కోమటిరెడ్డి సెటైర్లు...** మల్లారెడ్డి వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఘాటుగా స్పందించారు. "సభలో కామెడీ చేయకుండా, సమస్యలను సీరియస్‌గా తీసుకురావాలి. ఇలాంటి చిల్లర మల్లర చేష్టలు వద్దు" అంటూ మల్లారెడ్డిని ఎద్దేవా చేశారు. తెలంగాణ అసెంబ్లీలో జరిగిన ఈ ఘటన మరోసారి అధికార – ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికయింది.

## 53 కేజీల గోల్డ్ తుప్పు పట్టేస్తుంది.. గాలి జనార్దన్ రెడ్డికి హైకోర్టు షాక్!



కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి ఓబుళాపురం మైనింగ్ కేసుల విచారణలో సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుల విచారణను 4 నెలల్లోగా పూర్తి చేయాలని సీబీఐకి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. ఆ సంగతి అలా ఉంటే... తాజాగా తెలంగాణ హైకోర్టులో గాలి కుటుంబ సభ్యులకు షాక్ తగిలింది! అవును... గాలి జనార్దన్ రెడ్డి, ఆయన కుమారుడు కిరీట్ రెడ్డి, కుమార్తె బ్రాహ్మణి తెలంగాణ హైకోర్టులో మూడు పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో భాగంగా... ఓఎంసీ కేసులో భాగంగా తమ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న 53 కిలోల బంగారు నగలు తుప్పుపట్టిపోతాయంటూ గాలి జనార్దన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో... ఆ నగలతో పాటు తమ వద్ద సీజ్ చేసిన నగదు, రూ.5 కోట్ల విలువైన బాండ్లను విడుదల చేయాలని పిటిషన్లలో కోరారు. అయితే... అందుకు హైకోర్టు అంగీకరించలేదు. బంగారు నగలు తుప్పుపట్టిపోతాయని, విలువ తగ్గుతుందన్న గాలి జనార్దన్ రెడ్డి అభ్యర్థనను తెలంగాణ ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. అదేవిధంగా... ఓఎంసీ కేసు విచారణ పూర్తైన తర్వాతే వాటిపై హక్కులు తేల్చుకోవాలని స్పష్టం చేసింది. అక్రమ మైనింగ్ ద్వారా రూ.884.13 కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారని సీబీఐ కేసు నమోదుచేసి, నేరపూరిత సొమ్ముతో కొన్న నగలపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హక్కులు కోరుతోందని.. అందువల్ల ఈ దశలో వాటిని అప్పగించాలనే ఉత్తర్వులు ఇవ్వలేమని తెలిపింది. కాగా... 2011 సెప్టెంబర్ 5న ఓబుళాపురం మైనింగ్ కేసులో గాలి జనార్దన్ రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన సోదాల్లో 53 కిలోలున్న సుమారు 105 బంగారు ఆభరణాలు, నగదు, బాండ్లను సీబీఐ సీజ్ చేసింది. బాండ్లను విడుదల చేయొద్దంటూ స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ కు లేఖ రాసింది.





హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తున్న నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వలు ఆందోళనకర రీతిలో తగ్గుతున్నాయి. రోజుకు దాదాపు 2 టీఎంసీల నీటిని సాగర్ నుంచి వివిధ అవసరాలకు ఇరిగేషన్ అధికారులు వినియోగిస్తున్నారు. సాగర్‌లో నీటి నిల్వలు తగ్గితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తీవ్ర ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి ఉందని, సిటీ తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలను మెయిన్ టెయిన్ చేయాలని వాటర్ బోర్డు అధికారులు ఇరిగేషన్ శాఖకు లెటర్ రాశారు. డెడ్ స్టోరేజీ(510 అడుగులకు)కి చేరితే ఎమర్జెన్సీ పంపింగ్‌చేయాల్సి వస్తుందని వాటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. గ్రేటర్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని గ్రామాలు, మున్సిపాలిటీలకు మెట్రో వాటర్‌బోర్డు నీరు అందిస్తోంది. ప్రస్తుతం నగరానికి ఆరు ప్రధాన వనరుల నుంచి రోజుకు 581.35 ఎంజీడీల(మిలియన్ గ్యాలన్స్ పర్ డే) నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక్క నాగార్జున సాగర్ నుంచే కృష్ణా ప్రాజెక్టు ఫేజ్1, 2, 3 ద్వారానే రోజుకు 275 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. మొదటి దశ ప్రాజెక్టు ద్వారా ఎల్లంపల్లి నుంచి 163 ఎంజీడీలు, సింగరూరు నుంచి 69.07 ఎంజీడీలు, మంజీరా నుంచి 40.62 ఎంజీడీలు, హిమాయత్ సాగర్ నుంచి 10.58 ఎంజీడీలు, ఉస్మాన్‌సాగర్ నుంచి 22.50 ఎంజీడీల నీటిని సప్లయ్ చేస్తున్నారు.

కాగా నాగార్జున సాగర్‌లో ప్రస్తుతం ఉన్న నీటి నుంచే 6 నెలల పాటు అంటే ఫిబ్రవరి నుంచి జులై వరకు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుందని మెట్రో వాటర్‌బోర్డు అధికారులు ఫిబ్రవరి 13న ఇరిగేషన్? అధికారులకు లెటర్ రాశారు. కచ్చితంగా నీటి నిల్వలు మెయింటెయిన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

**ముందుస్తుగా ఏర్పాట్లు...** ఎండలు ముదరడంతో సిటీలో రోజురోజుకూ నీటి డిమాండ్ పెరుగుతోంది. గ్రేటర్, ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాలకు, మున్సిపాలిటీలకు కలిపి ప్రస్తుతం 550 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. నాగార్జున సాగర్‌లో నిల్వలు పడిపోతే ఆ ప్రభావం గ్రేటర్ సిటీపై పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ఫిబ్రవరి 13 నాటికి 542 అడుగుల మేర నీరు ఉంది. నెల రోజుల్లోనే 522 అడుగులకు పడిపోయింది. ప్రస్తుతం సాగర్ నుంచి భారీ మొత్తంలో నీరు తరలిపోతున్న నేపథ్యంలో ఏప్రిల్ నాటికే డెడ్ స్టోరేజీకి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.




వరంగల్: వరంగల్‌లో ఓ కిలేడీ అరాచకాలు ఒళ్లు గగుర్పొడిచేలా చేస్తున్నాయి. అమాయక ఆడపిల్లలే లక్ష్యంగా ఆమె చేసిన ఘోరాలు సినీ స్టోరీని తలపిస్తున్నాయి. మత్తుమందులకు అలవాటు పడి ముఠాగా ఏర్పడిన వారంతా చేసిన అకృత్యాలు పోలీసులనే అవాక్కయ్యేలా చేస్తున్నాయి. వారు చేసిన దారుణాలు తెలుసుకుంటే ఆడపిల్లలను పాఠశాలలకు పంపాలంటేనే భయం వేస్తుంది. హనుమకొండ జిల్లా దామెర మండలానికి చెందిన ఓ కిలాడీ లేడీ కొంతకాలంగా వరంగల్ మిల్స్ కాలనీలో నివాసం ఉంటోంది. డ్రగ్స్‌కు బానిసైన సదరు మహిళ తనతోపాటు డ్రగ్స్‌కు అలవాటు పడిన ఓ అమ్మాయి, నలుగురు యువకులతో కలిసి ముఠా ఏర్పడింది. ఈజీ మనీ కోసం అలవాటు పడిన వారంతా పాఠశాల బాలికలే లక్ష్యంగా దారుణాలకు పాల్పడ్డారు. వరంగల్‌లోని సంపన్నుల కాలనీలు, కార్పొరేట్ పాఠశాలల వద్ద రెక్కీ నిర్వహించే కిలేడీ స్కూళ్లకు వెళ్లే బాలికలతో పరిచయం పెంచుకునేది. అలా ఎంపిక చేసుకున్న బాలికలకు రోజూ మాటలు కలిపి తాను మంచిదాన్నని నమ్మించేది. బాగా పరిచయం ఏర్పడిన తర్వాత బయటకు వెళ్దామని చెప్పి కిడ్నాప్ చేసేది.అనంతరం బాలికలకు మత్తు పదార్థాలు ఇచ్చి అప్పటికే తన గ్యాంగ్?కు టచ్లో ఉన్న మానవ మృగాలకు వారిని అప్పగించేది. వారంతా డ్రగ్స్ మత్తులో ఉన్న బాలికపై అత్యాచారం చేసి కామవాంఛలు తీర్చుకునే వారు. అనంతరం బాలికను తిరిగి ఆ మహిళకు అప్పగించేవారు. ఈ విధంగా బాలికలను వివిధ జిల్లాలకు సైతం కిలేడీ తిప్పేదని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే రెండ్రోజుల క్రితం మిల్స్ కాలనీలో ఓ బాలిక కిడ్నాప్ అయ్యింది. చిన్నారి తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రెండ్రోజుల తర్వాత బాలిక తనంతట తానే ఇంటికి వచ్చేసింది. ఈ విషయం పోలీసులకు తెలపగా బాలికను ఆరా తీశారు. నిన్ను ఎవరు తీసుకెళ్లారు, ఎక్కడికి తీసుకెళ్లారంటూ పలు ప్రశ్నలు సంధించారు. ఓ మహిళ తనకు కొన్ని రోజుల క్రితం పరిచయం అయ్యిందని, బయటకు వెళ్దామని చెప్పి తీసుకెళ్లిందని వెల్లడించింది. అనంతరం మత్తుమందు ఇచ్చిందని ఆ తర్వాత ఏం జరిగింతో తెలియదంటూ చెప్పుకొచ్చింది. ఈ మేరకు సదరు బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లిన ఖాకీలు వైద్య పరీక్షలు చేయించారు. దీంతో డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కిలేడీ గ్యాంగ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీరి ఆకృత్యాలు తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు భయంతో వణికిపోతున్నారు. ఒంటరిగా పిల్లలను పాఠశాలలకు పంపించాలంటేనే బెంబేలెత్తుతున్నారు. ఒక్క వరంగల్ నగరమే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఇలాంటి గ్యాంగ్?లు ఇంకేమైనా ఉన్నాయా? అనే ఆలోచనలో పడ్డారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి గ్యాంగ్‌లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




# జర్నలిస్టుల అరెస్ట్ పై కపిల్ సిబల్ అసహనం.. పూనమ్ కౌర్ కౌంటర్!

సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కేసులో ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్ట్ చేయడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ అరెస్టులను సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ తీవ్రంగా ఖండించారు.


**– కపిల్ సిబల్ విమర్శలు...** కపిల్ సిబల్ ఈ ఘటనపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, "జర్నలిస్టులను అరెస్ట్ చేయడం పరిష్కారం కాదు. ఇది ప్రమాదకరమైన ధోరణి. ఈ రకమైన చర్యలు సమాజంలో స్వేచ్ఛను ఖూనీ చేస్తున్నాయి" అని విమర్శించారు. అలాగే "ఇది అంటువ్యాధిలా మారితే, ప్రెస్ ఫ్రీడం ముప్పులో పడుతుంది" అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

**–పూనమ్ కౌర్ కౌంటర్!...** కపిల్ సిబల్ వ్యాఖ్యలపై ప్రముఖ నటి పూనమ్ కౌర్ స్పందించారు. అరెస్ట్ అయిన జర్నలిస్టుల్లో ఒకరు మహిళల పరువు నష్టం కలిగించేలా వ్యవహరించారంటూ ఆమె ఆరోపించారు. "ఆమె ఇతర మహిళలను అవమానించడమే తన లక్ష్యంగా చేసుకుంది. నేనూ ఆమె బాధితురాలినే" అంటూ పూనమ్ ట్వీట్ చేశారు.

**–సోషల్ మీడియాలో తీవ్ర చర్చ...** ఈ వ్యవహారంపై సోషల్ మీడియాలో భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని వర్గాలు మీడియా స్వేచ్ఛను పరిరక్షించాలంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుండగా, మరికొంత మంది బాధ్యతారహితంగా ప్రవర్తించే జర్నలిస్టులపై చర్యలు తీసుకోవడం సమంజసమేనంటున్నారు. మహిళా జర్నలిస్టుల అరెస్ట్ పై రాజకీయ, సినీ, మీడియా రంగాల్లోని వ్యక్తుల నుంచి మిశ్రమ స్పందనలు కొనసాగనున్నాయి.

# ఇండియాలో ఉన్నా అమెరికాలో ఉన్నట్లే ఉంది : యూఎస్ మహిళ వీడియో వైరల్






ట్రంప్ వచ్చాక.. ఇమిగ్రేషన్ ను టైట్ చేశాక అందరి అమెరికా కలలు కల్లలవుతున్నాయి. దాంతోపాటు అమెరికాలో భారతీయుల వరుస మరణాలు, కాల్పుల దురగతాలు కూడా అమెరికా కంటే మన బిడ్డలకు ఇండియానే బెస్ట్ అని అందరినీ ఆలోచింపచేస్తోంది. అగ్రరాజ్యం అయినా కూడా అన్ని అవస్థల మధ్య అక్కడ బతుకీడ్చడం కంటే ఇండియాలో దర్జాగా బతకడం బెటర్ అన్న ఆలోచన ప్రవాస భారతీయుల్లో నెలకొంది.

అందుకే ఇప్పుడు అందరూ ఇండియాకు తిరిగి వచ్చేయాలా? అన్న ఆలోచనలో పడిపోయారు. ఇండియా వాళ్లే కాదు.. అమెరికన్స్ కూడా వారి దేశం కంటే భారత్ నే బెటర్ అంటూ కితాబిస్తుండడం విశేషం. భారత్ ఆధునికతలో అమెరికా కంటే ముందుంది అంటూ ఓ అమెరికన్ మహిళ చేసిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఎంతో మంది యూఎస్‌లో జీవించాలని కలలు కంటారు, కానీ భారత్ పలు అంశాల్లో అమెరికా కంటే మెరుగైనదని ఆమె తన అనుభవాలను పంచుకున్నారు. క్రిస్టెన్ ఫిషర్ అనే అమెరికన్ మహిళ ఈ విషయాలను సోషల్ మీడియాలో వీడియో రూపంలో షేర్ చేయగా, ఇది పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది.

**–యూపీఐ నుంచి రిక్షాల వరకు.. భారతీయ రవాణా, చెల్లింపుల సౌకర్యం..** క్రిస్టెన్ ఫిషర్ మాట్లాడుతూ భారతదేశంలోని డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ఆచరణలోకి రావాలనిపించిందని తెలిపారు. ఇక్కడ యూపీఐ చెల్లింపులు అత్యంత వేగంగా సులభంగా ఉంటాయని, తాను ఎక్కడికైనా ఫోన్ మాత్రమే తీసుకెళ్లి అన్ని చెల్లింపులూ చేయగలుగుతున్నానని పేర్కొన్నారు. అలాగే భారతదేశంలోని ఆటోలు, రిక్షాలు ఆమెకు ఎంతో ఇష్టమని, ఇవి చవకైన రవాణా ఎంపికలని, అమెరికాలో ఇలాంటి సౌకర్యాలు లేవని అన్నారు. భారత్‌లో వీటి వినియోగం వల్ల ప్రజలకు తక్కువ ఖర్చుతో వేగవంతమైన ప్రయాణ అవకాశం ఉంటుందని వివరించారు.

**–భారత వైద్య సేవలు.. అమెరికా కంటే మెరుగైనవే?...** భారతదేశంలో మరో గొప్ప విషయం వైద్య సేవలు అని క్రిస్టెన్ అభిప్రాయపడ్డారు. ఇక్కడ డాక్టర్లు సులభంగా అందుబాటులో ఉంటారని, కొన్నిసార్లు అపాయింట్‌మెంట్ లేకుండానే వైద్యం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. అమెరికాతో పోల్చుకుంటే, ఇక్కడ చికిత్స పొందడం తేలికని అభిప్రాయపడ్డారు.

**–డెలివరీ సర్వీసులు, ధర నియంత్రణ %ఢ% చెత్త నిర్వహణ...** భారతదేశంలోని ఆన్‌లైన్ డెలివరీ సర్వీసులు ఎంతో వేగంగా, అందుబాటులో ఉంటాయని, అమెరికాలో అలాంటి సౌకర్యాలు లేవని క్రిస్టెన్ అన్నారు. అలాగే భారత్‌లో %వీ౯ా% (గరిష్ట రిటైల్ ధర) వ్యవస్థ ఉండటం వల్ల, వినియోగదారులకు మోసం జరగకుండా రక్షణ కలుగుతుందని తెలిపారు. భారతదేశంలో ప్రభుత్వ చెత్త తొలగింపు సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయి, అయితే అమెరికాలో దీని కోసం ప్రజలు భారీగా చెల్లించాల్సి వస్తుందని వివరించారు.

**–సోషల్ మీడియాలో వైరల్ %–% మిశ్రమ స్పందనలు..** క్రిస్టెన్ ఫిషర్ పెట్టిన ఈ వీడియోపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ నడుస్తోంది. కొంత మంది ఆమె అభిప్రాయాలకు మద్దతు తెలుపుతుంటే, మరికొందరు భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లను, పెద్ద సమస్యలను గుర్తుచేస్తున్నారు.

# పాక్ కు దిమ్మ తిరిగే ప్రకటన చేసిన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ

కుట్రలు.. కుతంత్రాలు తప్పించి.. నేరుగా ఎదుర్కొనే దమ్ములేని దాయాది పాకిస్థాన్ కు తొలిసారి దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయ్యే సమస్య విరుచుకుపడింది. నిత్యం భారత్ మీద ఏడుపు.. ఏదో ఒక పాడుపనితో భారతీయుల్ని ఇబ్బందులకు గురి చేయాలన్న దుర్మార్గం ఇప్పుడా దేశానికి గుదిబండలా మారింది. ఉడుకుమోతుతనంతో తనను తాను నాశనం చేసుకున్న పాకిస్థాన్ కు తాజాగా బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ కారణంగా ఎదురైన సవాలు ఒక ఎత్తు అయితే.. ఆ ఇష్యూను కవర్ చేసేందుకు చేసిన ప్రయత్నం మిస్ ఫైర్ కావటమే కాదు మొదటికే మోసం తెచ్చిన వైనం ఇప్పుడు షాకింగ్ గా మారిందని చెప్పాలి. జాఫర్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ ను బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ హైజాక్ చేయటం.. అందులోని ప్రయాణికుల్ని బందీలుగా తమ వద్ద ఉంచినట్లుగా వారు ప్రకటించటం తెలిసిందే. అయితే.. ఈ హైజాక్ విషయంలో సైన్యం రంగంలోకి దిగిందని.. వారిని మట్టుబెట్టి.. ఆపరేషన్ ను పూర్తి చేసినట్లుగా పాక్ సైన్యం చేసిన ప్రకటనకు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ. పాక్ సైన్యం పేర్కొన్నట్లుగా ఆపరేషన్ పూర్తి కాలేదని.. సైన్యంపై కాల్పులు కొనసాగుతున్నట్లుగా తాజాగా ప్రకటన చేసింది. దీంతో.. పాక్ సైన్యం ఇప్పటివరకు చెప్పిన మాటలన్ని గాలి మాటలన్న విషయం ప్రపంచానికి అర్థమైంది. తమ తాజా ప్రకటనతో పాక్ పరువును నిలువునా తీసేసిన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ.. మరో కీలక వ్యాఖ్య చేసింది. తాము చేసిన దాడిలో పాక్ భద్రతా బలగాలకు భారీ నష్టం వాటిల్లినట్లుగా పేర్కొంది. ఇప్పటికే పాక్ సైనికులు చాలామంది మరణించారని.. శత్రువులపై యుద్ధం ఆపే ప్రసక్తే లేదంటూ.. తమ అధీనంలో చాలామంది ప్రయాణికులు ఉన్నట్లుగా స్పష్టం చేసింది. దీనికి సంబంధించి బీఎల్ఏ ఒక ప్రకటన చేసింది. మంగళవారం 440 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్కు వెళుతున్న జాఫర్ ఎక్స్ ప్రెస్ ను బలూచిస్తాన్ మిలిటెంట్లు హైజాక్ చేయటం.. బంధీలుగా ప్రయాణికుల్ని తమ వద్ద ఉంచుకోవటం తెలిసిందే. ట్రైన్ ను హైజాక్ చేసినంతనే.. వారిని వేర్వేరు గ్రూపులుగా చేసి.. వేర్వేరు ప్రాంతాలకు తరలించిన వైనం పాక్ సైన్యానికి తలనొప్పిగా మారింది. ఇదిలా ఉంటే 33 మంది మిలిటెంట్లను హతమార్చామని.. 21 మంది ప్రయాణికులు.. నలుగురుభద్రతా సిబ్బంది మరణించారని.. మిగిలిన ప్రయాణికుల్నిక్షేమంగా విడిపించినట్లుగా పాక్ సైన్యం వెల్లడించింది. అయితే.. పాక్ సైన్యం తప్పుడు ప్రకటనలు చేస్తూ ప్రజల్నిమభ్య పెట్టాలని చూస్తున్నట్లుగా లిబరేషన్ ఆర్మీ వెల్లడించింది. యుద్ధ నియమాలు.. అంతర్జాతీయ నిబంధనల్నిపరిగణలోకి తీసుకొని రైల్లో ఉన్న కొందరు సైనికుల్ని తామే వదిలేశామని స్పష్టం చేసింది. పాక్ సైన్యం తమ మీద పోరాటం చేయలేక..సామాన్య బలూచ్ పౌరుల్ని వేధిస్తున్నట్లుగా విమర్శించింది. జైళ్లలో ఉన్న తమ మిలిటెంట్లను వదిలి పెడితే రైల్లో ఉన్న మిగిలిన సైనికులు.. ప్రయాణికుల్ని విడిచి పెడతామని పేర్కొంది. తమ మాట వినకపోతే.. పాక్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. బలూచిస్తాన్ లో యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రాంతాల్ని చూసేందుకు వచ్చే జర్నలిస్టులకు అనుమతి ఇవ్వాలని పాక్ ప్రభుత్వానికి సూచన చేసింది. అప్పుడు అసలు పరిస్థితులు ఏమిటో ప్రపంచానికి తెలిసే వీలుందని చెప్పింది. ఈ ప్రకటన పాక్ పరువు పోయేలా చేసిందని చెప్పక తప్పదు.

# మార్చి 22 నుంచి ఐపీఎల్ మొదలు... నెట్టింట ఓ హ్యాష్ ట్యాగ్ హల్ చల్!




ప్రధానంగా భారతీయ క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ %–% 2025) షెడ్యూల్ దాదాపు నెల క్రితమే వచ్చేసిన సంగతి తెలిసిందే. ఈ 18వ ఎడిషన్ పూర్తిస్థాయి షెడ్యూల్ మార్చి 22 నుంచి మే 25 వరకూ జరగనుంది. ఈ సీజన్ 65 రోజులపాటు జరగనుండగా.. మొత్తం 74 మ్యాచ్ లు జరుగుతాయి. మార్చి 22 నుంచి ప్రారంభమయ్యే ఈ క్రికెట్ పండుగలో భాగంగా... తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్ %–% రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు ఈడెన్ గార్డెన్ వేదికగా తలపడనున్నాయి. 2008 తర్వాత ఈ రెండు జట్లు తొలి మ్యాచ్ లో ఎదురుపడటం ఇదే తొలిసారి. ఈ సీజన్ లో రెండో మ్యాచ్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు మొదటి మ్యాచ్.. రాజస్థాన్ రాయల్స్ జట్టుతో మార్చి 23న ఉప్పల్ వేదికగా జరగనుంది. ఈ క్రమంలో మార్చి 22 నుంచి మే 18 వరకూ 70 లీగ్ మ్యాచ్ లు జరగనుండగా.. మే 20 నుంచి 25 వరకూ 4 ప్లే ఆఫ్ మ్యాచ్ లు జరగనున్నాయి. మే 25న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

మరోపక్క ఇటీవల జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ జట్టు మినహా దాదాపు మిగిలిన అన్ని జట్లలోనూ టాప్ ప్లేయర్స్ అంతా మంచి ఫామ్ లోనే ఉన్నారనే విశ్లేషణలు తెరపైకి వచ్చాయి. ఇక అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ విభాగాల్లో టీమిండియా ఫుల్ ఫామ్ లో ఉంది. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు మునుపటి ఫామ్ ను కొనసాగించే అవకాశం ఉందని అంటున్నారు. అవును... దాదాపు మరో వారం రోజుల్లో ఐపీఎల్ 18వ ఎడిషన్ ప్రారంభం కాబోతోన్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఆటగాళ్లతో పాటు బెట్టింగ్ రాయుళ్లు ఫుల్ ఫామ్ లో ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రతీ ఐపీఎల్ సీజన్ లోనూ వేల కోట్ల రూపాయలు బెట్టింగ్ జరుగుతుండగా.. బెట్టింగులు కాసిన వాళ్లలో బాగుపడినవాళ్లు ఒక్కరు కూడా లేరని అంటుంటారు. ఆ స్థాయిలో గాంబ్లింగ్ జరుగుతుందని చెబుతుంటారు. అయినప్పటికీ చాలా మంది ఈసారి మంచి జరుగుతుంది, ఈసారి వర్కవుట్ అవుతుంది అని నమ్మి నమ్మి లక్షలు నష్టపోయి, బ్రతుకులను రోడ్లపాలు చేసుకుంటుంటారు. ఈ క్రమంలో ఈసారి బెట్టింగ్ విషయంలో అధికారుల నుంచి పలు అలర్ట్స్ జారీ అవుతున్నాయి. ఈసారి ఈ విషయాన్ని ఓ క్యాంపెయిన్ లా రన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా... తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెరపైకి వచ్చారు. ఈ సందర్భంగా... ఎక్స్ వేదికగా ఆయన ఈ విషయంలో జనాలను అలర్ట్ చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా... ఏ ఒక్కరూ బెట్టింగులను ప్రోత్సహించొద్దని తెలిపారు. ఈ సమయంలోనే చ%ఝుఎచీశీశీదీ౬ఆఅస్త్రూజూజూం% నెట్టింట హల్ చల్ చేస్తోంది.

# రూ.800, రూ.900 నాణేలు... ఎక్కడ దొరుకుతాయో తెలుసా?

దేశంలో తొలిసారిగా విడుదలైన రూ.800, రూ.900 నాణేల గురించి చాలా తక్కువ మందికి తెలిసి ఉంటుంది! ఈ క్రమంలో ఈ నాణేలు ప్రస్తుతం ఏపీకి చెందిన ఓ వ్యక్తి దగ్గర ఉన్నాయి. ఇందులో భాగంగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అనుమసముద్రం గ్రామానికి చెందిన మహ్మద్ వాయిస్ ఈ నాణేలను తెప్పించుకున్నారు. వీటి వివరాలు ఇప్పుడు చూద్దాం..! అవును... శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన మహ్మద్ వాయిస్ కు నాణేలను సేకరించడం హాబీ అట. ఈ నేపథ్యంలో... ఈ ఏడాది ముంబై మింట్.. జైన్ తీర్థంకరుడు పార్శ్వనాథుడి జయంతిని పురస్కరించుకొని ఈ నాణేలను ముద్రించి విడుదల చేసిందట. దీంతో... ఈ నాణేలను మహ్మద్






వాయిస్ తెప్పించుకున్నారు. ఈ రెండు రకాల నాణేల బరువు 40 గ్రాములు కాగా... వీటిని వెండితో తయారుచేశారు. ఈ రెండు నాణేలను ఫిబ్రవరి 20న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచారు. దీంతో... మార్చి 10న తనకు ఈ రెండు నాణేలు అందాయని.. ఈ క్రమంలో ఇప్పటికే తన వద్ద 170 దేశాలకు చెందిన కరెన్సీ, నాణేలు ఉన్నాయని మహ్మద్ చెబుతున్నారు.

ఇదే సమయంలో... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త కామేశ్వర్ కూడా ఈ రూ.800, రూ.900 నాణేలను సేకరించినట్లు చెబుతున్నారు. వీటిని ప్రత్యేక ఆర్డర్ పై సేకరించారని.. ఆయనకు నాణేలను సేకరించడం అలవాటని అంటున్నారు.

# అమెరికా వర్సెస్ కెనడా... జీ-7 గ్రూప్ మీటింగ్ లో ఇంట్రస్టింగ్ సీన్!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలవడంతో ప్రపంచంలో మిగిలిన చాలా దేశాలకంటే ఎక్కువగా కెనడా ఇబ్బంది పడుతున్నట్లుందనే కామెంట్లు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. కెనడాకు ట్రంప్ మాటలు, చేతలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా జీ-7 గ్రూపు విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆసక్తికర అంశం చర్చకు వచ్చింది. అవును... ట్రంప్ ప్రెసిడెంట్ అయినప్పటి నుంచీ కెనడాకు కొత్త కొత్త టెన్షన్స్ మొదలవుతున్న సంగతి తెలిసిందే. తొలుత అమెరికాకు 51వ రాష్ట్రంగా కెనడా నిలవాలంటూ ట్రంప్ పలుమార్లు ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఇక.. ఇటీవల సుంకాలతోనూ ట్రంప్ కెనడాకు వరుస షాకులిస్తున్న పరిస్థితి! ఈ సమయంలో జీ-7 గ్రూపు విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కెనడా మంత్రి



మెలానియో జోలీ.. అమెరికా మంత్రి మార్కో రూబియో మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. ఈ క్రమంలో తొలుత మాట్లాడిన కెనడా మంత్రి మెలానియో.. అమెరికాతో ముదురుతున్న ట్రేడ్ వార్ పై ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రరాజ్యం చర్యలతో ఎదురయ్యే పరిణామాలపై మిగిలిన దేశాలను హెచ్చరించారు. అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రదేశమైన తమ పరిస్థితే ఇలా ఉంటే.. ఇక ఎవరూ సురక్షితం కాదని ఆమె వ్యాఖ్యానించారు. దీంతో... అమెరికా చర్యలకు వ్యతిరేకంగా మిగిలిన మిత్రదేశాల మద్దతును కూడగట్టి ఎదుర్కొనేందుకు వీలుగా ఆమె ఈ చర్యలు చేపట్టినట్లు భావిస్తున్నారు. ఇదే సమయంలో.. అమెరికా 51వ రాష్ట్రం అంటూ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలపైనా జోలీ స్పందించారు. కెనడా అటువంటి బెదిరింపులకు ఏమాత్రం వెనక్కి తగ్గదని.. యూరోపియన్ యూనియన్ తో కలిసి యుద్ధవిన్యాసాలు చేయడం, ఆయుధ తయారీ వంటివి తమ సార్వభౌమత్వ రక్షణకు అవసరమని వ్యాఖ్యానించారు. ఈ సమయంలో... అమెరికా మంత్రి మార్కో స్పందించారు. ఆర్థిక కోణంలో మాత్రమే కెనడాను 51వ రాష్ట్రం కావాలనేది ట్రంప్ ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో... కెనడా 51వ రాష్ట్రం అయితే అప్పుడు సరిహద్దుల గురించి, ఫెంటెనిల్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నది ట్రంప్ భావన అని సర్దిచెప్పారు. జీ-7 సమావేశానికి ఉద్దేశించిన అంశాలపై దృష్టి పెట్టాలని.. అంతేకానీ, ఇది తాము కెనడాను ఆక్రమిస్తామని అన్నందుకు ఏర్పాటు చేసిన సమావేశం కాదని అన్నారు.

చురకలు

# సంపాదకీయం

## స్టాలిన్...మరో మమత గానా ?

తమిళనాడు సీఎం స్టాలిన్ ఏడు పదుల పైబడిన వారు ఆయన జీవిత చరమాంకంలో సీఎం పదవి దక్కవచ్చు కానీ ఆయన రాజకీయ అనుభవాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయలేరు. తండ్రి కరుణానిధి నుంచి ఆయన రాజకీయాలను ఔపాసన పట్టేశారు. ఇదిలా ఉంటే ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తో ఢీ కొడుతున్నారు. దానికి కారణాలు ఏమిటి ఆయన చెప్పే రీజనింగ్స్ కరెక్టేనా అన్న చర్చ ఒక వైపు సాగుతూండగానే లేటెస్ట్ గా తమిళనాడులో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో రూపాయి చిహ్నాన్ని మార్చేసి సంచలనం క్రియేట్ చేశారు. హిందీలో ఉన్న రూపాయి చిహ్నాన్ని ఆయన ఏకంగా తమిళంలోకి మార్చేసి హిందీ భాష పట్ల తన వ్యతిరేకత చాటుకున్నారు. కేంద్రం జాతీయ విద్యా విధానం పేరుతో అమలు చేస్తున్న త్రిభాషా సూత్రాన్ని అన్ని రాష్ట్రాలూ అమలు చేయాలని కోరుతోంది. ఇంగ్లీష్ హిందీతో పాటు ఒక స్థానిక భాషను కూడా విద్యార్థులు నేర్వాలని కోరుతోంది. అయితే దానిని స్టాలిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. హిందీని మా మీద బలవంతంగా రుద్దవద్దు అని ఆయన కేంద్రాన్ని కోరుతున్నారు. ఈ విషయంలో తాను ఎంతకైనా అన్నట్లుగా ఉద్యమిస్తున్నారు. మరో వైపు చూస్తే తమిళనాడులో బడ్జెట్ ప్రవేశ పెట్టారు. అక్కడ రూపాయి సింబల్ గా హిందీలోనే ఉంటుంది. దీనిని అన్ని రాష్ట్రాలు అలాగే ఉంచుతాయి. కానీ హిందీ వద్దు అంటున్న స్టాలిన్ మాత్రం బడ్జెట్ లో రూపాయి సింబల్ ని తమిళంలో పెట్టి హిందీని అక్కడ కూడా మాయం చేశారు. ఈ విధంగా చేయడం ద్వారా తాను ఎంతగా హిందీని వ్యతిరేకిస్తున్నాను అన్నది ఆయన సింబాలిక్ గా చాటి చెప్పారని అంటున్నారు. మరో వైపు చూస్తే కనుక ఎందుకు ఇదంతా స్టాలిన్ చేస్తున్నారు అన్న చర్చ సాగుతోంది. తమిళనాడులో స్టాలిన్ హిందీ వ్యతిరేకతకు మద్దతు ఎంత అంటే అక్కడ రాజకీయ పార్టీలలో ఏకాభిప్రాయం లేదని అంటున్నారు. మరో వైపు చూస్తే 2026 మేలో జరగబోయే తమిళనాడు శాసనసభ ఎన్నికల కోసమే స్టాలిన్ ఈ విధంగా రాజకీయ రాద్ధాంతం చేస్తున్నారని సాటి తమిళ విపక్షాలు అనుమానిస్తున్నాయి. అందుకే ఆయన వాదనతో ఏకీభవిస్తున్నా ఆయనతో కలసి ఉద్యమించడానికి మాత్రం ఆలోచిస్తున్నాయి. ఈసారి తమిళనాడు అస్తిత్వం ఆత్మాభిమానం అన్న దానిని ఆసరాగా చేసుకుని రెండోసారి సీఎం కావాలని స్టాలిన్ ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఇక్కడ ఆయన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్ట్రాటజీని వాడుతున్నారు అని అంటున్నారు. కేంద్రంతో ఢీ కొడుతూ తమ రాష్ట్రాన్ని వెనకేసుకుని రావడం ద్వారా మమతా హ్యాట్రిక్ సీఎం గా ఉన్నారు. ఆమె బీజేపీని బూచిగా చూపించి ఆ పార్టీని గట్టిగా ఎదురొడ్డి నిలిచిన మహా నాయకురాలిగా తమ రాష్ట్రంలో ఇమేజ్ ని తెచ్చుకున్నారు. బహుశా అదే విధంగా స్టాలిన్ కూడా చేస్తున్నారు అని అంటున్నారు. అయిదేళ్ళ పాటు సీఎం గా పనిచేసిన తరువాత సహజంగానే యాంటీ ఇంకెంబెన్సీ ఆయన ప్రభుత్వం మీద వస్తుంది. దాంతో దానిని ఎదుర్కోవడానికి ఆయన ఈ విధంగా కేంద్రం మీద రాజకీయ దాడిని మొదలెట్టారు అని అంటున్నారు. అయితే తమిళనాడులో బీజేపీకి ఆంత బలం లేదు. అక్కడ ఆ పార్టీ పెద్దగా పుంజుకోవడంలేదు. మరి తనకు నేరుగా ప్రత్యర్థిగా లేని బీజేపీని గట్టిగా ఢీ కొనడం వల్ల ఆయనకు ఉపయోగం ఏమైనా ఉందా అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. ఏపీలో 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఏపీలో ఉనికిలో లేని బీజేపీ మీద రాజకీయ యుద్ధం చేస్తూ వెళ్ళారు. చివరికి ఆయనకు వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. గాలిలో లేని శత్రువుని ఊహించుకుని యుద్ధం చేయడం వల్ల వచ్చిన ఫలితం ఇదని కూడా అంతా అన్నారు. ఇక చూస్తే మమతా బెనర్జీ కానీ ఢిల్లీలో కేజ్రీవాల్ కానీ తమకు అసలైన ప్రత్యర్థిగా బీజేపీ ఉంది కాబట్టే పోరాడారు. అలా కేజ్రీ గతంలో గెలిచారు. తాజా ఎన్నికల్లో ఓడారు. మమత మూడు సార్లు గెలిచారు. ఈసారి ఎలా ఉంటుందో తెలియదు. అయితే అదే సమయంలో వీరంతా బీజేపీని బూచిగా చూపించి పరోక్షంగా ఆ పార్టీ తమ రాష్ట్రాల్లో ఎదుగుదలకు కారణం అయ్యారు అని అంటున్నారు. తమిళనాడులో కూడా బీజేపీని విమర్శిస్తూ ఆ పార్టీకి ఊపిరులూదే కార్యక్రమం ఏదైనా చేస్తున్నారా అన్న చర్చ సాగుతోంది. ఏది ఏమైనా స్టాలిన్ హిందీ వ్యతిరేకతకు మిశ్రమ స్పందన లభిస్తోంది. అదే సమయంలో దీనిని ఎన్నికల స్టంట్ గా కూడా సాటి పక్షాలు అనుమానించడం కూడా జరుగుతోంది. అయితే స్టాలిన్ ఈ విషయంలో మరింతగా పోరాడి జనంలోకి వెళ్ళి మొత్తం తమిళుల మద్దతు కూడగడితేనే ఫలితం వేరేలా ఉంటుంది అని అంటున్నారు.

## అవధానంలో అసమాన ప్రతిభుడు రాళ్ళబండి - మే 15...రాళ్ళబండి కవితాప్రసాద్ వర్ధంతి




తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన ప్రసిద్ధ సాహితీవేత్త, అవధాన చక్రవర్తి రాళ్ళబండి కవితా ప్రసాద్. ఒకవైపు ఉద్యోగ రంగంలో సమర్థ అధికారిగా పేరు తెచ్చుకుంటూనే, మరో వైపు కవితా క్షేత్రంలో అందెవేసిన చేయిగా, అవధాన ప్రక్రియలో అసమాన ప్రతిభునిగా, నిర్విరామ సాధనలో సాటిలేని మేటిగా వినుతికెక్కిన నిరంతర కృషీవలుడు రాళ్ళబండి. అవధాన విద్యలో పరిపూర్ణత్వం కోసం అంకిత భావంతో చిత్తశుద్ధితో ధృఢ సంకల్పంతో శ్రమించి సిద్ధి పొందిన తాపసి ఆయన. కవిత్వం పట్ల మోజుతో తన పేరును తల్లిదండ్రులు పెట్టిన వేంకటేశ్వర ప్రసాద్ పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్న కవితాభిమాని కవితా ప్రసాద్. సాంప్రదాయ అవధానానికి ఆధునిక పోకడలను నేర్పిన రాళ్ళబండి కవితా ప్రసాద్ కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం నెమలిలో 1961 మే 21న జన్మించారు. కవితా ప్రసాద్ నెమలిలో పదవ తరగతి వరకు చదివారు. తండ్రి కోటేశ్వరరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తరచూ బదిలీ అయ్యేవారు. ఆ క్రమంలో సత్తుపల్లిలో కవితా ప్రసాద్ డిగ్రీ చేశారు. అవధాన విద్య ఆరంభ వికాసాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. అనంతర కాలంలో ఇదే యునివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. కవితాప్రసాద్ చిన్నప్పటి నుంచే సాంస్కృతిక రంగం పట్ల ఆసక్తి కనబరిచారు. అవధాన విద్య పట్ల మక్కువ పెంచుకొని జీవితకాలం ఆ ప్రక్రియలో రాణించారు. దాదాపు 500కి పైగా అవధాన సభలను ఆయన నిర్వహించారు. అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, నవరసావధానం, తదితర విశిష్టమైన, అతి క్లిష్టమైన దశలను సమర్థంగా పరిచయం తెలుగు సాహితీ లోకానికి చేశారు. తెలుగు నేలపై గుబాళించిన ఈ ప్రాచీన సాహితీ ప్రక్రియలను ఎల్లలు దాటించారు. అమెరికాలోని తెలుగు భాషా, సాహితీ ప్రియులు ఆయన కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. ఈ కృషిలో కొంత ఆయన జీవితకాలం లోనే గ్రంథస్థం అయింది. అలా ఒంటరి పూలబుట్ట, పద్మ మంటపం, అగ్నిహింస, ఇది కవి సమయం తదితర సంపుటులను వెలువరించారు. ఆధునిక నృత్య రూపక ప్రక్రియలో పంచకన్య, పంచకావ్యాలను రచించారు. ఈ రూపకాలను 24 గంటల్లోనే సిద్ధం చేసి ప్రముఖ నృత్య కారిణి మంజు భార్గవితో ప్రదర్శింప జేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కవితాప్రసాద్ కృష్ణా జిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామంలో 1961, మే 21వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు వేంకటేశ్వర ప్రసాదరాజు. కవిత్వం పట్ల మోజుతో తన పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్నారు. తండ్రి కోటేశ్వర రాజు తెలుగు పండితులు. తల్లి పేరు రత్నవర్ధనమ్మ. సత్తుపల్లిలో గణితశాస్త్రం ఐచ్ఛిక అంశంగా పట్టభద్రులయ్యారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అవధాన విద్యపై మసన చెన్నప్ప పర్యవేక్షణలో పి.హెచ్.డి. చేశారు. కవితా ప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చాలా తక్కువ మంది చేసే అవధాన విద్య మీద పి.హెచ్.డి పూర్తిచేశారు. ఒక పక్క గ్రూప్ 1 ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం చేస్తూనే... మరోపక్క తనకెంతో ఇష్టమైన తెలుగు సాహిత్యంలో శిఖరాలను అందుకున్నారు. ఆశించిన గమ్యాన్ని చేరుకున్నారు. ఆయన 500కు పైగా అవధానాలను నిర్వహించారు. వాటిలో అష్టావధానాలతో పాటుగా శతావధానాలు, ద్విశతావధానాలు ఉన్నాయి. సంప్రదాయ అవధానంతో పాటు కథ, వచన కవిత, గణితం వంటి అనేక ప్రక్రియలను అవధానంలో చొప్పించారు. ఒక సందర్భంలో 25 నిమిషాలలో విచిత్ర అష్టావధానం చేసి అసమాన ప్రతిభను ప్రదర్శించారు. పండితుల మెప్పు పొందారు. వరంగల్ లోని భద్రకాళి దేవాలయంలో ఏకదిన శతకరచన ధార అనే కార్యక్రమాన్ని చేపట్టి ఒకే రోజులో ఆశువుగా శతకాన్ని చెప్పారు. ఆశుకవితా ఝురి పేరుతో గంటకు 500 పద్యాలు ఆశువుగా చెప్పి ఔరా అనిపించు కున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1 అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖలో వివిధ రకాల సేవలను అందించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖలో సుదీర్ఘ కాలం సాంస్కృతిక విభాగంలో అనేక హోదాల్లో సేవలు అందించారు. రెండు పర్యాయాలు సంచాలకులుగా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా ఆయన పనిచేశారు. ఆ కాలంలో 'సప్తగీతధామ', 'కవిసార్వభౌమ' పేరిట వేంకటేశ్వర సంకీర్తనలను రచించి సీడీ రూపంలో అందించారు. దాదాపు పాతికేళ్ల తరువాత ప్రతిష్టాత్మకంగా జరిగిన మహాసభలకు సమన్వయ కర్తగా వ్యవహరించారు. నాటి రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి వద్ద పీయస్ గా బాధ్యతలు నిర్వర్తించారు. కవితా ప్రసాద్ 2015 మార్చి 15న హైదరా బాదులో హృద్రోగంతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## హాస్య రచయితలలో అగ్రగణ్యులు మునిమాణిక్యం

### - దాంపత్య జీవిత రహస్యాలు... మునిమాణిక్యం సజీవ పాత్రలు - మార్చి 15... మునిమాణిక్యం నరసింహారావు జయంతి





తమ రచనల ద్వారా మధ్య తరగతి సంసారంలోని సరిగమల్ని ఎన్నింటినో వినిపించిన రచయిత మునిమాణిక్యం నరసింహారావు . తెలుగు హాస్య రచయితలలో ముని మాణిక్యంకు ఒక విశిష్ట స్థానం ఉంది. ఆయన కేవలం హాస్యరచయిత మాత్రమే కాదు. హాస్యోపాసకులు కూడా. విభిన్న వ్యక్తుల మనసులను అలరించే హాస్యోక్తులు,హాస్య సన్నివేశాలు ఎక్కడ ఆయన దృష్టికి తెచ్చినా వాటిమీద మక్కువతో అనువదించి గాని, అనుసరించిగాని, భాషను కొంచెం హాస్య యుక్తంగా మార్చి తెలుగు పాఠకులకు అందజేసే వారు. హాస్య రచయితలలో అగ్రస్థానం మునిమాణిక్యందే. ఆయన వ్రాసిన 'దాంపత్యోపనిషత్' కథలను మనసు పెట్టి చదువుకుంటే నేటి యువతీ యువకులు విడాకుల మాటే ఎత్తరని చాలా మంది అభిప్రాయం. సంసారాన్ని ఎలా రసభరితంగా చేసుకోవాలో చెప్పిన గొప్ప విశ్లేషకులు ఆయన. గృహస్థ జీవితాన్ని గురించి ఆయన చెప్పినట్లు మరెవరూ చెప్పలేదేమో. మునిమాణిక్యం నరసింహారావు ఇరవైయ్యవ శతాబ్దం మొదటి పాదంలో ఒక కథకుడిగా రూపు దిద్దుకున్నారు. ముఖ్యంగా దంపతుల నడుమ జరిగే సున్నితమైన హాస్య శృంగార ఘట్టాలను అందించడంలో ఆయన అందె వేసిన చేయి. కుటుంబ జీవితం లోని కష్టసుఖాలు, దాంపత్య జీవితం లోని సౌందర్యం ఆయన కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన సృష్టించిన కాంతం తెలుగు సాహిత్యంలోనే గొప్ప స్థానం పొందింది. కాంతం" పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేది మునిమాణిక్యం నరసింహారావు. కాంతం కథల ద్వారా అయన తెలుగు పాఠకులకు సుపరిచితులు. తెలుగు సాహిత్యంలో ఒక "కాంతం" అన్న పాత్రను సృష్టించి ఆ పేరున ఎన్నో రచనలు చేశారు. కాంతం కథలతో తెలుగువాళ్ల మనసుల్లో చిరునవ్వులు పూయించి, మధ్య తరగతి జీవితాల్లో భార్యాభర్తల అనుబంధాన్ని కళ్లకు కట్టిన రచయిత ముని మాణిక్యం నరసింహారావు. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో విద్యా ప్రసారాలు అసిస్టెంట్ ప్రొడ్యూసర్ గా పని చేశారు. అంధ్ర సార స్వత పరిషత్, తెలుగు పండిత శిక్షణ పాఠశాల హెడ్మాష్టర్ గా హైదరాబాదులో 5 ఏళ్ళు పని చేశారు. ముని మాణిక్యం నరసింహారావు తెనాలి తాలూకా, సంగం జాగర్లమూడిలో మార్చి 15, 1898 న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు వెంకాయమ్మ, సూర్యనారాయణ. ఆయన తెనాలిలో ఇంటర్మీడియెట్ చదివారు. డిగ్రీ చదవడానికి తాహతు లేకపోతే కొండా వెంకటప్పయ్య సహాయం వల్ల బి.ఎ చదివారు. తర్వాత గుంటూరు, భీమవరం, బందరు, కళాశాల్లో 30 ఏళ్ళు పని చేశారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకొన్నారు. ఆయన భార్య కాంతం. ఆయనకు ఇద్దరు మగపిల్లలు. ముగ్గురు ఆడపిల్లలు. ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఉపాధ్యాయుడిగా, ఆకాశవాణిలో పనిచేశారు. ఆయన రాసిన మొదటి నవల 'టీకప్పులో తుఫాను'. ఇందులోనే మొట్ట మొదటిగా కాంతం పాత్ర కనపడుతుంది. కాంతం కుటుంబం పేద కుటుంబం. కాంతం కథలలో ఒకటి ఆయన రేడియో నాటకంగా రాస్తే ఆయన కుమార్తె కాంతంగా వేసి అందరినీ మెప్పించింది. ఆయన "కాంతం కథల" కి ఆయన భార్యే ప్రేరణ, స్ఫూర్తి.

నిజ జీవితంలోనే దాంపత్య సన్నివేశాలను, చిన్న సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసినవి కాబట్టే ఇప్పటికీ కాంతం కథలు నిత్య నూతన మనిపిస్తాయి. మన హాస్యం పేరుతో ఆయన చక్కని గ్రంథం వెలువరించారు. వక్రరేఖ తిరుమాళిగ, దీక్షితులు కాంతం, నేను-మా కాంతం (1933), కాంతం కైఫీయత్, కాంతం కాపురం, మునిమాణిక్యం కథలు, రుక్కుతల్లి - శరద్రాత్రులు, అన్నయ మంత్రి, మరపు, స్తుతి - ఆత్మస్తుతి, ఇల్లు - ఇల్లాలు, మంచివాళ్ళ మాట తీరులు, గాజుల పెట్టి, తల్లి ప్రేమ అయన రచనలలో ప్రసిద్ధం. తిరుమాళిగ, దక్కుతల్లి , దీక్షితులు నవలికలు - కరుణ రస భరితాలు. పిల్లలకు, విద్యార్థులకు సరిపడేలా అన్నయ మంత్రి, వక్రరేఖ నవలలను రచించారు. తిరుగు బాటు అనే నాటకం వ్రాశారు. ఇంటావిడతో పోట్లాట, ప్రణయ కలహం, భార్యను లొంగదీసు కోవడం ఎలా - వంటి రచనలు హాస్యస్ఫోరకాలు, మధ్యతరగతి సంసారాల దాంపత్య జీవిత రహస్యాలను ఆయన సజీవ పాత్రలుగా సృష్టించారు. తెలుగు సాహిత్యాన్ని తమ సునిశిత హాస్యంతో సుసంపన్నం చేసిన మునిమాణిక్యం ఫిబ్రవరి 4, 1973న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## మార్చి 15...ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం. 1962, మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారు హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులు ప్రకటించాడు. 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ మార్చి15 తేదీని ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 సంఘాలు, సంస్థలు 1973 మార్చి 15 ని వినియోగ దారుల హక్కుల దినంగా పాటించాయి. భారత దేశంలో 1986లో వినియోగ దారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చట్టం ప్రకారం వినియోగ దారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగ దారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాద కారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు... అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి. సమాచారం పొందే హక్కు...అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగ దారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియ జేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు...వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసు కోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు...వినియోగ దారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగ దారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం. వినియోగ దారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగ దారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగ దారుల విద్య హక్కు... వినియోగ దారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచు కోవడం, నైపుణ్యాలను పెంపొందించు కోవడం ఎంతో అవసరం. గ్రామీణ




ప్రాంతాలలో వినియోగ దారులు హక్కుల పట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు. భారత ప్రభుత్వం 1989లో మార్చి 15వ తేదీని వినియోగ దారుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మనం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని మార్చి 15 న జరుపుకుంటున్నాం. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈ-కామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీని వల్ల చోటుచేసు కుంటున్నాయి. వినియోగ దారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగి పోతున్నది. దీంతో వినియోగ దారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది. 1986నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించి నప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచం లోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారత దేశంలో తొలిసారి 1986లో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు. వినియోగ దారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారు వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. (ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. (బి). కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. (సి). రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారు వివాదాల పరిష్కార వేదిక. ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్ గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ- జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాలవ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగ దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి. ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 ఏండ్లుగా నిర్ణయించారు. రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగ దారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియ జేయాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# భగీరథ.. ఇదేం వ్యథ

నిర్మల్ : ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ సమయంలో ప్రధాన రహదారులతోపాటు కాలనీలకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున పైప్‌లైన్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఇందుకోసం రహదారుల పక్కన, మధ్యలో నుంచి తవ్వకాలు జరిపారు. తవ్విన ప్రాంతాల్లో సిమెంటుతో మరమ్మతులు చేయాల్సిన గుత్తేదారులు అధిక శాతం ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఏళ్ల కాలం ఉండాల్సిన రోడ్లు ప్రస్తుతం అధ్వానంగా మారాయి.

**ఇష్టారీతిన..**మున్సిపాలిటీల పరిధిలో పనులు చేపట్టే సమయంలో కనీస ప్రమాణాలు పాటించకపోవడం, భవిష్యత్తులో ఎదురయ్యే ఇక్కట్లను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. అడుగడుగునా గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు చెడిపోవడంతోపాటు వెన్నెముక సంబంధిత వ్యాధుల బారినపడే పరిస్థితులు ఎదురయ్యాయి. కొన్ని చోట్ల కొత్తగా వేసిన సీసీ రోడ్లను సైతం తవ్వి వదిలేశారు. మురుగుకాలువలు కూడా దెబ్బతిని పరిసరాలు పాములు, తేళ్ల వంటి విషపురుగులకు ఆవాసంగా మారి స్థానికులు భయాందోళనల మధ్య జీవనం సాగించాల్సి వస్తోంది.



అధికారులు చొరవ తీసుకుని కనీస మరమ్మతులు చేయించి సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మల్‌లోని బేస్తవార్‌పేట్, బంగల్‌పేట్, బ్రహ్మపురి వెళ్లే మార్గం దుస్థితి ఇది. పైప్‌లైన్ కోసం తవ్వి వదిలేయడంతో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. రోడ్డు మధ్య, పక్క భాగంలో తవ్వకాలు జరిపి కొన్ని చోట్ల సిమెంటు వేసినా వాటితోపాటు చుట్టుపక్కల దెబ్బతిని ప్రయాణానికి సమస్యలు తెచ్చిపెడుతోంది. ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అడుగుకు ఒకటి చొప్పున ఉన్న గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఎదుర్కొనే ఇక్కట్లు వర్ణనాతీతం. ఈ ఒక్క చోటే కాకుండా పలు ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. నిర్మల్ పట్టణం మంజులాపూర్ 19వ వార్డు అంబేద్కర్ కాలనీలో పలు చోట్ల సీసీ రోడ్లు స్పీడ్ బ్రేకర్లుగా మారాయి. పైప్‌లైన్ కోసం తవ్విన వాటిని పూడ్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పంచాయతీగా ఉన్న సమయంలో సుమారు రూ.5 లక్షలకు పైగా వ్యయంతో ఓ ప్రాంతంలో సీసీ రోడ్డు, మురుగుకాలువ నిర్మించారు. దానిని సైతం పగులగొట్టి పైపులు వేశారు. వాటికి మరమ్మతులు ఇప్పటి వరకు చేపట్టలేదు. గత్యంతరం లేని చోట స్థానికులే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. మురుగుకాలువలు దెబ్బతినడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి చెప్పలేని ఇబ్బందులు పడుతున్నారు.

# ఎండుతున్న పంటలు.. అన్నదాతకు తంటాలు


నిర్మల్ : స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు సాగుచేస్తున్న వరి పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. నిన్నమొన్నటి వరకు పంట చేతికొస్తుందని సంబరపడ్డారు కానీ నిరంతర విద్యుత్తు సరఫరాతో పాటు ఇసుక అక్రమ రవాణాలో భూగర్భజలాలు పడిపోయి బోర్లలో నీరు రాక పంటలు ఎండిపోతున్నాయి. స్వర్ణ వాగు నీటిని నమ్ముకొని చించోలి(ఎం), వంజర్, బోరిగాం, అలూరు, వెంగ్వాపేట్, తల్వేద, చిట్యాల్, జాఫ్రాపూర్, మాదాపూర్ గ్రామాల రైతులు వరి సాగుచేశారు. ప్రస్తుతం ఒక తడి నీరందితే పంట చేతికొచ్చే అవకాశం ఉంది.

**అడుగంటుతున్న జలం**

నిరంతర విద్యుత్తు సరఫరా.. వాగులు, ఒర్రెల, నదుల నుంచి నిరంతరంగా ఇసుక తవ్వకాలతో భూగర్భజలం కిందకు దిగజారిపోతో ంది. ఇసుక తవ్వకాలపై అధికారులు 'మామూలు'గా చూడటంతో పంటలపై ప్రభావం చూపుతోంది. బోర్లలోనూ నీరు రావడం ఆగిపోతోంది. ఈ సీజన్‌లో జిల్లాలో సాగవుతున్న 2.72 లక్షల ఎకరాల్లో 75 వేల ఎకరాలకు బోర్లు, బావులే ఆధారం. నిరంతర విద్యుత్తు సరఫరాతో చాలాచోట్ల అవసరమున్నా లేకున్నా పంపుసెట్లను నడిపిస్తున్నారు. మోటారు నిలిపివేస్తే బావిలో ఊటలు తరలిపోతాయనే భావనే ఇందుకు కారణం. ఫలితంగా భూగర్భజలాలు పడిపోతున్నాయి.

**పట్టింపు లేకపోవడమే..**

వాగులు, వంకలు, ఒర్రెల నుంచి అనుమతుల్లేకుండా ఇసుక తీయడం నేరం. కానీ జిల్లాలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. పెంబి, రాజురా ప్రాంతాల్లో ఉన్న వాగులు, ఒర్రెలు, నిర్మల్, సారంగాపూర్ మండలాల్లోని స్వర్ణవాగు, భైంసా, కుంటాల, లోకేశ్వరం, నర్సాపూర్(జి) మండలాల్లోని సుద్దవాగు నుంచి, సోన్, లక్ష్మణచాద, మామడ, ఖానాపూర్



మండలాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తూనే ఉన్నారు. వీటితోపాటు అనుమతుల్లేకుండా ఇష్టారీతిన బోర్లు తవ్వించడం భూగర్భజలాలు తగ్గిపోవడానికి మరో కారణంగా చెప్పొచ్చు. ఎక్కడైనా ఒక బోరు వేయించాలంటే భూగర్భజల, రెవెన్యూశాఖల అనుమతి తప్పనిసరి. అయితే ఇదెక్కడ అమలు కావడం లేదు. ఇసుక అక్రమ రవాణాతో పాటు అనుమతి లేని బోర్ల తవ్వకాలపై సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటే కొంతవరకైనా భూగర్భజలాలు కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఎండుతున్న ఈ వరి చిట్యాల్–తల్వేద గ్రామాల మధ్యలోనిది. భూగర్భజలాలు అడుగంటి బోర్లు వట్టిపోయాయి. సమీపంలోని స్వర్ణవాగులోనూ నీరు లేకపోవడంతో భూగర్భజలాలు పడిపోయి బోర్ల ద్వారా నీరు రావడం లేదని రైతు గడ్డం నర్సారెడ్డి తెలిపారు. స్వర్ణ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తే కొంతవరకైనా భూగర్భజలాలు పెరిగి బోర్ల ద్వారా నీరొచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. కుభీరు మండలం పార్డి(కె) గ్రామానికి చెందిన సుంకరి రఘు రెండెకరాల్లో జొన్న, ఎకరంలో మొక్కజొన్న సాగు చేశారు. వారం క్రితం వరకు రెండు బోర్లు ద్వారా నీరందిస్తూ వస్తున్నారు. ఒక్కసారిగా భూగర్భజలాలు పడిపోయి ఒక బోరు వట్టిపోయింది. మరో బోరులో సన్నని ధారగా నీరొస్తుంది. చేతికొచ్చిన జొన్న పంటకు నీరందక ఎండిపోతోంది.

# పెరగాలి వేగం.. చేరాలి లక్ష్యం



పెద్దపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో రవాణా కష్టాలు తీర్చేందుకు జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన సిమెంటు రహదారుల నిర్మాణానికి ఓ వైపు గడువు సమీపిస్తుండగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రతి సంవత్సరం మార్చిలో నిధులు విడుదలయ్యేవి. ఈ ఏడాది ముందస్తుగా జనవరిలో కేటాయించినా ఆశించిన మేర ప్రగతి లేదు. గతేడాది చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యంతో గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 20 రోజుల సమయమే ఉండటంతో గడువులోగా పనులు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ పెంచారు.

**అదనపు కేటాయింపులతో ఆలస్యం**

జిల్లాలో తొలి విడతలో 104 రోడ్లకు రూ.6.17 కోట్లు మంజూరయ్యాయి. అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలకు రూ.11.30 కోట్లు కేటాయించారు. అయితే గడువులోగా భవనాల నిర్మాణం సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం ఆ నిధులను సిమెంటు రహదారులకు మళ్లించింది. మరో రెండు విడతల్లో 113 పనులకు అనుమతి లభించింది. ఈ సారి ముందస్తుగా నిధులు రావడంతో సంపూర్ణ ప్రగతే లక్ష్యంగా నిర్మాణాల్లో వేగం పెంచారు. భవనాలకు కేటాయించిన నిధులను సీసీ రోడ్లకు మళ్లించడంతో అదనపు పనులు ఆలస్యమవుతున్నాయి.

**త్వరగా బిల్లులు చెల్లిస్తేనే ఫలితం**

గత తప్పిదాలు పునరావృతం కాకుండా అధికారులు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

ఒకే గుత్తేదారు పలు చోట్ల పనులు చేపట్టడంతో కూలీలు, సామగ్రి కొరత ఏర్పడింది.

పనుల ప్రగతి ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తే త్వరితగతిన పూర్తి కానున్నాయి.

పనులు పూర్తయిన చోట కూడా ఇప్పటివరకు పైసా చెల్లించకపోవడంతో మిగతా చోట్ల ఆలస్యమవుతోంది.

ప్రగతిపై నిరంతర సమీక్ష

పల్లెల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రగతిపై నిరంతరం సమీక్షిస్తున్నారు. జిల్లాలో మొత్తం 217 రోడ్లకు 152 చోట్ల పనులు ప్రారంభించారు. వీటిలో 62 మాత్రమే పూర్తయ్యాయి. మరో 65 పనులు ప్రారంభించాల్సి ఉంది. ధర్మారంలో 24 పనులకు 11, పెద్దపల్లిలో 25కు 10 రోడ్లు పూర్తయ్యాయి. లోపాలను గుర్తించి అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన ఇరవై రోజుల్లో 155 పనులు పూర్తి కావాల్సి ఉంది. హడావుడిగా పనులు చేస్తుండటంతో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. గడువు సమీపించిన నేపథ్యంలో పనులు మన్నికగా జరిగేలా పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

**గడువులోగా పూర్తి చేస్తాం**

జిల్లాలో సిమెంట్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాం. అదనంగా మంజూరైన నిధులకు సంబంధించి త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రారంభిస్తున్నాం. లోపాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పూర్తయిన పనులకు వెంటది వెంట బిల్లులు చెల్లించేందుకు ఆన్‌లైన్ చేస్తున్నాం. గిరీశ్‌బాబు, పంచాయతీరాజ్ ఈఈ

# మరణ ధ్రువీకరణ.. ఆలస్యంగా విచారణ



కరీంనగర్ : జిల్లాలోని పురపాలికలు, నగరపాలికలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతోంది. ఆసుపత్రుల నుంచి వచ్చే నివేదికల ఆధారంగా ఆన్‌లైన్‌లో రికార్డులు ఉంటే ఎలాంటి సమస్యలు ఉండటం లేదు. రికార్డుల్లో లేకుండా ఆన్‌లైన్ లేని వాటికి అన్ని రకాల పత్రాలు తీసుకొని దరఖాస్తు చేసే వరకు దరఖాస్తుదారులు ముప్పు తిప్పలు పడుతున్నారు. ముఖ్యంగా మరణ ధ్రువీకరణ పత్రం పొందాలంటే రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

ఇంటి వద్ద అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన వారు మార్గమధ్యలో చనిపోతే ఆసుపత్రి రికార్డులో ఉండదు. వీటికి నేరుగా నగర, పురపాలికల్లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దీనికోసం ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల వాంగ్మూలం, నోటరీ, చనిపోయిన వారి ఆధార్‌కార్డు, దరఖాస్తుదారుడి ఆధార్‌కార్డులపై గెజిటెడ్ సంతకం చేసి, దరఖాస్తు పూరించి నగర పాలికల్లో అయితే ఇన్‌వార్డులో ఇవ్వాలి. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాత రికార్డులో నమోదు చేస్తారు.

**ఆన్‌లైన్ నమోదులో జాప్యం..**

నగర పాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లకు 60 మంది వార్డు అధికారులు ఉన్నారు. ఆయా డివిజన్లకు సంబంధించిన అన్ని పనులు వీరే చూడాల్సి ఉంటుంది. నెల రోజుల నుంచి మరణ ధ్రువీకరణల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతోపాటు విలీన గ్రామాలకు సంబంధించినవి కూడా ఆయా ఇన్‌ఛార్జి వార్డు అధికారులే పరిశీలించాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలకు సుమారు 300 దరఖాస్తులు మరణ ధ్రువీకరణలకు దరఖాస్తులు వస్తుండగా, ఇందులో డివిజన్‌కు అయిదారు ఉంటాయని చెబుతున్నా రు. కొందరు వార్డు అధికారులు ఇన్‌వార్డులో వచ్చిన దరఖాస్తులు తీసుకెళ్లి విచారణ చేయడంలేదు. ఒకవేళ చేసినా అందులో కావాల్సిన పత్రాలను నామమాత్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఒక్కో దరఖాస్తు రోజుల తరబడి పెండింగ్ ఉంటుండగా, ఆన్‌లైన్‌లోకి నమోదు చేయడానికి పది రోజుల సమయం పడుతుందని తెలిసింది.

**ఎన్నాళ్లో అవస్థలు**వార్డు అధికారులకు మరణ ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు కొందరికి అవగాహన లేకపోవడంతో దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో నగరవ్యాప్తంగా మొత్తం ఏడుగురు జవాన్లు ఉండగా ఏ రోజుకారోజు విచారణ చేసి జనన, మరణ ధ్రువీకరణ విభాగంలో అప్పగించే వారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోనే వారం రోజుల్లోనే మీసేవ ద్వారా మరణ ధ్రువీకరణ తీసుకోవడానికి వీలు ఉండేది. ప్రస్తుతం అలా లేకపోవడం, వార్డు అధికారి ఎవరో డివిజన్ ప్రజలకు తెలియకపోవడం, విచారణలో జాప్యం చేస్తున్నారు.

**వార్డు అధికారులను ఆదేశించాం**

వార్డు అధికారులు ఆయా డివిజన్లలో మరణ ధ్రువీకరణ దరఖాస్తులు వెంటనే తీసుకెళ్లి విచారణ చేయాలని ఆదేశించాం. వారం రోజుల్లోనే జారీ చేయాల్సి ఉంటుందనే విషయాన్ని వారికి వివరించాం. ఎమ్మెల్సీ ఎన్నికల విధులు ఉండటంతో జాప్యం జరిగింది. మల్లీశ్వరి, ఏఎస్‌వో, కరీంనగర్ నగరపాలిక

# వినియోగం పెరిగి.. నియంత్రికలు కాలి

భానుపురి : వేసవికి ముందే జిల్లాలో నియంత్రిక కాలిపోతున్నాయి. ఫిబ్రవరి నెలలో ఎండలు పెరిగిన నేపథ్యంలో జిల్లావాసులు విద్యుత్తును అధికంగా వినియోగించారు. ఈ కారణంగా నియంత్రికలపై భారంపడి కాలిపోయాయి. అధికారులు వాటిస్థానంలో ఎప్పటికప్పుడు కొత్తవి ఏర్పాటు చేశారు. సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

**వెంటనే మరమ్మతులు**జిల్లాలో వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు అధికారులు నియంత్రికల ను సిద్ధంగా ఉంచారు. గ్రామాలు, పట్టణాలు, వ్యవసాయ బావుల వద్ద కాలిపోయిన చోట వెంటనే ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు కావాల్సిన ఉంటే వారికి వెంటనే సిద్ధం చేస్తున్నారు. వేసవి ముగిసే వరకు విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. కాలిపోయిన నియంత్రికలను శాంతినగర్‌లోని మరమ్మతు కేంద్రంలో వెంటనే చేయిస్తున్నారు. జిల్లాలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా ఎప్పటిప్పుడు చర్యలు తీసుకుంటామని ఎస్ఈ బి.ఫ్రాంక్లిన్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**ఇదీ పరిస్థితి..**

జిల్లాలో 4,51,501 గృహ, 1,40,584 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. గత నెలలో భానుడు ప్రతాపం చూపటడంతో జిల్లాలో



విద్యుత్తు వినియోగం పెరిగింది. ఫిబ్రవరి చివరి నాటికి రోజువారీగా కలుపుకొని మొత్తం 327 మిలియన్ యూనిట్లు వినియోగించారు. ఈ కారణంగా 296 నియంత్రికలు కాలిపోయాయి. వీటిలో 3పీహెచ్ 208, 1పీహెచ్ 88 నియంత్రికలు కాలిపోయాయి. వ్యవసాయానికి కాల్వ నీరు రాకపోవడంతో చాలామంది రైతులు బోర్లపై ఆధారపడ్డారు. పడావు పడిన బోర్లను కూడా మరమ్మతు చేయించి వ్యసాయానికి వినియోగించారు. ఈ కారణంగా విద్యుత్తు నియంత్రికలపై భారం పడి కాలిపోయాయి. విద్యుత్తు అధికారులు ఎక్కడా సరఫరాలో అంతరాయం లేకుండా కాలిపోయిన నియంత్రికల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు.

# వన్యప్రాణులకు ప్రత్యేక వంతెనలు

ఆదిలాబాద్ : మనుషుల అవసరాల కోసం అడవుల మధ్య నుంచి రోడ్లు వేసుకుంటే.. జంతువులకు ఇబ్బంది కదా! అందుకే వాటి తోవలను వాటికి వదిలేస్తూ.. రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో రోడ్లు దాటుతున్న సమయంలో వాహనాలు తగిలి వన్యప్రాణులు చనిపోతున్నాయని గుర్తించిన ప్రభుత్వం జంతువులు ఎక్కువగా దాటే జాతీయ రహదారులపై ఓవర్‌పాస్, అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతోంది. ఇలాంటి వంతెనలు తెలంగాణలో తొలిసారిగా మంచిర్యాల–చంద్రాపూర్(63), జగిత్యాల – భీవండి(61) జాతీయ రహదారులపై జంతువుల కోసం ప్రత్యేకంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

**జంతువుల సంరక్షణే ధ్యేయంగా..**

మహారాష్ట్ర నుంచి తెలంగాణ అటవీ ప్రాంతానికి జంతువుల రాకపోకలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి మీదుగా జంతువులు వెళుతుంటాయి. ఇందులో భాగంగా వన్యప్రాణుల రాకపోకలతో పాటు వాటికి ప్రమాదం జరగకుండా ఉండేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా మంచిర్యాల – చంద్రాపూర్ జాతీయ రహదారిపై వాంకిడి సమీపంలో రూ.30 కోట్ల వ్యయంతో పర్యావరణ వంతెన(ఓవర్‌పాస్ ఎకో బ్రిడ్జి) నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కింది నుంచి వాహనాలు వెళ్తుంటే పైనుంచి జంతువులు వెళ్లేలా దీన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మహారాష్ట్రలోని భీవాండి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిపై జంతువుల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని ఖానాపూర్ పరిధిలో అండర్‌పాస్ వంతెనల నిర్మాణం జరుగుతోంది.

ఏటా 3 వేల జంతువుల మరణం

రోడ్డు దాటే సమయంలో చనిపోతున్న జంతువులపై మహారాష్ట్రకు చెందిన అశ్వమేధ ప్రతిష్ఠాన్ అనే సంస్థ సర్వే నిర్వహించింది. జాతీయ



రహదారి పొడవునా మహారాష్ట్రలోనే మూడు వేల జంతువులు చనిపోతున్నాయని గుర్తించినట్లు సంస్థ అధ్యక్షుడు అవినాష్ తెలిపారు. మృతి చెందిన వాటిలో చిరుత, ఎలుగుబంట్లు, జింకలు 20కిపైగా ఉండగా, మిగిలినవి చిన్న చిన్న జంతువులని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో నిర్మాణమయ్యే జాతీయ రహదారులపై ఏయే ప్రాంతాల్లో అండర్‌పాస్ వంతెనలు అవసరమనేది నివేదించినట్లు ఆయన తెలిపారు.

**నాలుగు చోట్ల..**

మహారాష్ట్ర భీవండి నుంచి నిర్మల్ మీదుగా జగిత్యాల వరకు 758 కి.మీ దూరం జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తెలంగాణలో 57 కి.మీ దూరం పొడవునా, నిర్మల్, ఖానాపూర్, మల్లపురం, రాయికల్, జగిత్యాల వరకు జరిగే జాతీయ రహదారి పనుల్లో ఖానాపూర్ సమీపంలో అటవీ ప్రాంతం నుంచి వెళుతుంది. గతంలో ఉన్న రోడ్డు దాటే సమయంలో వన్యప్రాణులకు హాని కలగడం, రోడ్డు దాటే జంతువుల కారణంగా కొద్ది దూరంలో ఆగి వేచిచూడటం, కొన్ని సార్లు జంతువుల దాడికి గురైన సందర్భాలు ఉన్నాయి. జంతువుల సంరక్షణను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం అటవీశాఖ అధికారుల ప్రతిపాదనల మేరకు వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా, పైనుంచి వాహనాలు, కింది నుంచి జంతువులు వెళ్లేందుకు వీలుగా రూ.42 కోట్ల వ్యయంతో నాలుగు ప్రాంతాల్లో అండర్ పాస్ వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు చోట్ల కి.మీ పొడవునా, మరో రెండు చోట్ల తక్కువ దూరంతో బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోంది.

# అడవుల జిల్లా ఆకాంక్ష.. విశ్వవిద్యాలయం

నిర్మల్ : అభివృద్ధిలో అట్టడుగున ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇతర ప్రాంతాలతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉంది. ముఖ్యంగా చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన ఈ ప్రాంతంలో ఉన్నత విద్యావకాశాలు లేకుండా పోతున్నాయి. ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయ ఏర్పాటు ఇప్పటికీ తీరని కలగా మారింది. ఎప్పటికప్పుడు పాలకులు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని ప్రకటిస్తున్నా ఆచరణలో విఫలమవుతున్నారు.

**నీరుగారుతున్న లక్ష్యం**

ప్రతీ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని 2007లో నేషనల్ నాలెడ్జ కమిషన్ సూచించింది. ఈ మేరకు శ్రీ జ్ఞానసరస్వతి విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ నిర్ణయం తీసుకున్నారు. కానీ రాజకీయ పరిణామాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి యూనివర్సిటీ ఏర్పాటుకోసం ఉద్యమాలు సాగుతూనే ఉన్నాయి. విశ్వవిద్యాలయ సాధనసమితి ఆధ్వర్యంలో కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ, పలువురు ముఖ్యమంత్రులతో పాటు ఉన్నత విద్యామండలికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండాపోయింది.

**ప్రణాళిక దశలో నిలిచిన సీఎం హామీ**

గత ప్రభుత్వం జిల్లాలో విశ్వవిద్యాలయ ఏర్పాటును విస్మరించింది. కాంగ్రెస్ కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు జిల్లా పర్యటనకు వచ్చినపుడు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. తర్వాత ఉన్నత విద్యాశాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో కొత్తగూడెంలో మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చేందుకు నివేదిక రూపొందించాలని ప్రభుత్వం తాజాగా ఉన్నత విద్యామండలికి ఆదేశాలు జారీచేసింది. అదే సమయంలో ఆదిలాబాద్ విషయం మాత్రం పక్కన పెట్టేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్రంగా కలత చెందుతున్నారు.

**ఈ సమావేశాలే కీలకం**1991లో నిర్మల్ పట్టణంలో ప్రారంభమైన కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలను ఉన్నతీకరించేందుకు గతంలోనే ప్రతిపాదించి, అనుమతించి, నిధులు మంజూరు చేసినా స్థానిక నేతల వైఫల్యంతో కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో సానుకూల ప్రకటనలు చేసిన తరుణంలో నిర్మల్ కళాశాలను ఉన్నతీకరణకు అవకాశాలు సుగమమయ్యాయి. దీనికోసం ప్రస్తుతం జరగబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో తగిన నిధులు కేటాయించడం కీలకంగా మారనుంది. ప్రభుత్వం చొరవచూపి బడ్జెట్ కేటాయిస్తే శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరణ జరుగుతుంది. ఇక్కడ సాధ్యం కాని పక్షంలో ఉమ్మడి జిల్లాలో ఇతర ప్రాంతంలోనైనా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు వచ్చే బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని, ఇది అత్యవసరమే కాదు జిల్లావాసులకు ఎంతో ఆవశ్యకమని శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితి అధ్యక్షుడు నంగె శ్రీనివాస్ పేర్కొన్నారు. **విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భాజపా శాసనసభాపక్షనేత, నిర్మల్**విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. ఉమ్మడి జిల్లాలో విద్యారంగ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు అంతంతే. యూనివర్సిటీ ఏర్పాటు అందరి కల. గత పాలకులు విస్మరించారు. ఉట్నూరు కేంద్రంగా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తామన్నా ఆచరణలోకి రాలేదు. నిర్మల్‌లోని యూనివర్సిటీ పీజీ కళాశాల ఉన్నతీకరణ నిలిచిపోయింది. ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క సొంత జిల్లాకే ప్రాధాన్యమిస్తు న్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సహకరించాలి. **నిధులు కేటాయించాలి అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన జిల్లాను నిర్లక్ష్యం చేయడం సరికాదు.

## ఓవర్‌లోడ్‌తో సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు

హైదరాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలో వేసవి విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఈ సర్కిల్ పరిధిలోని సైఫాబాద్, మెహిదీపట్నం, అజామాబాద్ డివిజన్లలో వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపట్టిన పనులను సీఎండీ మంగళవారం సమీక్షించారు. గతంలో వేసవిలో కొన్ని ప్రాంతాల్లో ఓవర్ లోడ్ సమస్య



లు తలెత్తాయన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ సర్కిల్ పరిధిలో 35వరకు 11 కేవీ ఫీడర్లను, ఉప కేంద్రాల్లో 7 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 149 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సమీక్ష అనంతరం గోల్కొండ 33/11కేవీ ఉప కేంద్రాల్లో ఏర్పాటు చేసిన రెండు 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను, డైమండ్‌హిల్స్ 11కేవీ ఫీడర్, సయ్యద్ అక్తర్ ఫీడర్లను ప్రారంభించారు. అధికారులు నర్సింహులు, చక్రపాణి, కరుణాకర్ బాబు పాల్గొన్నారు.

## తవ్వుకు పోతున్నా.. తలాడిస్తున్నారు!

తాండూరు : జిల్లాలో నాపరాయి గనుల్లో అక్రమ తవ్వకాలతో కొందరు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నా రు. జిలెటిన్‌స్టిక్స్‌తో పేలుళ్లకు సైతం పాల్పడుతున్నారు. అక్రమ కార్యకలాపాలపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు, చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కుల చర్యలకు తలాడిస్తున్నారు. జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న ఈ తంతుపై కథనం.

**అనుమతులు పొందకుండానే..**

తాండూరు మండలం ఓగీపూర్, కరణ్‌కోట, మల్కాపూర్, కోటబాస్పల్లి, సంగెంకలాన్ పరిధిలో 250కిపైగా నాపరాయి గనులున్నాయి. కొందరు గనులు భూగర్భ శాఖ, రెవెన్యూ, పర్యావరణ, నీటి పారుదల, అటవీ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు పొందకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రుసుం, సుంకం, డెడ్‌రెంట్ వంటివి చెల్లించకుండా ఎగనామం




పెడుతున్నారు. కరణ్‌కోటలోని ప్రభుత్వ భూమిలో ఇద్దరు బడా వ్యక్తులు రూ.కోటి విలువజేసే నాపరాయి నిక్షేపాలను తవ్వుకుపోయారు. ఫిర్యాదు అందడంతో గనులు, రెవెన్యూ శాఖల అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ తవ్వకాలను గుర్తించాయి. కానీ కారకులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

మల్కాపూర్‌లోని సీలింగ్ భూమిలో కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా జిలెటిన్‌స్టిక్స్‌తో పేలుళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయమై గ్రామానికి చెందిన యువకులు గనులు, రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం– సత్యనారాయణ, ఏడీ, గనుల భూగర్భ శాఖ. అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. కరణ్‌కోట పరిధి గనిలో తవ్వకాలను నిలిపివేయించాం. మల్కాపూర్ సీలింగ్ భూమిలో తవ్వకాలు దృష్టికి వచ్చింది. సర్వేయర్‌తో కొలతలు చేయిస్తాం. ఇతర చోట్ల కూడా అక్రమ తవ్వకాలపై ఆరా తీసి నిఘా పెడతాం. ప్రజలు అప్రమత్తమై సహకరించాలి.

## ఖానామెట్‌లో రూ.కోట్ల విలువైన భూమిపై వివాదం

మాదాపూర్: హైటెక్‌సిటీ ఖానామెట్‌లో రూ.కోట్ల స్థలంపై వివాదం రచ్చగా మారింది. స్థలంలోని ప్లాట్లు తమవేనంటూ కొందరు కంచె వేసేందుకు ప్రయత్నించడం, స్థలం తమదేనంటూ భారాస ఎమ్మెల్సీ నవీన్‌రావు అనుచరులు అడ్డుకోవడం వివాదానికి దారి తీసింది. పరస్పర ఫిర్యాదులతో మాదాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తన తండ్రి కొండల్‌రావు తరఫున ఎమ్మెల్సీ నవీన్‌రావు మాదాపూర్ డీసీపీకి ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్లు, సరిహద్దులు తేల్చాలంటూ మాదాపూర్ పోలీసులు శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామం



సర్వే ఆఫ్ ఇండియా లేఅవుట్‌లోని సర్వే నంబరు 11/19, 11/20, 11/21లోని 495–504 వరకూ ఉన్న ప్లాట్లను 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశామంటూ గంగిడి ఓం ప్రకాశ్‌రెడ్డితో పాటు మరికొందరు మంగళవారం ఉదయం సదరు స్థలం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు పనులు మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న భారాస ఎమ్మెల్సీ నవీన్‌రావు అనుచరులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు.

నెల క్రితమే ఫిర్యాదు.. ఇదే వ్యవహారంపై గంగిడి ఓం ప్రకాశ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో మరో కేసు నమోదైంది. ఆ ప్లాట్లను 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశామంటూ సూర్యనారాయణ, జగన్‌కుమార్, సుబ్బరాజు, శ్రీహరిరాజు తదితరులు ఆ స్థలాలను అక్రమించుకోవడానికి ప్రయత్నించారంటూ గంగిడి ఓం ప్రకాశ్‌రెడ్డి మాదాపూర్ పోలీసులకు గత నెలలో ఫిర్యాదు చేశారు.

## సరఫరా తడబడి.. ఆరంభంలోనే ఎద్దడి



మంథని: మిషన్ భగీరథ పథకం కింద మంథని పురపాలక సంఘం పరిధిలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో పలు కాలనీల్లో ఎద్దడి నెలకొంది. మార్చిలోనే ఇలా ఉంటే మే నెలలో ఇంకెంత గడ్డు పరిస్థితి ఎదురవుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి మున్సిపాలిటీకి అవసరానికి మించి సరఫరా జరుగుతున్నా పట్టణంలో పైపులైన్ల వ్యవస్థ సరిగ్గా లేక బోరుబావులకు మోటార్లు బిగించి తాగునీటి అవసరాలు తీరుస్తున్నారు.

**15 ట్యాంకుల ద్వారా..**

మంథని మున్సిపాలిటీలో మొత్తం 2800 నీటి కనెక్షన్లున్నాయి. వీటికి 15 ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. కాగా చాలా ప్రాంతాల్లో పైపులైన్లు సరిగ్గా లేకపోవడం, భగీరథ కుళాయిలకు బిరడాలు లేకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. దీంతో దిగువ ప్రాంతాలకు సరఫరా కావడం లేదు.

పలు ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్లున్నా మూడేళ్లుగా సరఫరా జరగడం లేదు. మిషన్ భగీరథ కింద కొత్తగా వేసిన పైపులైన్ల ద్వారా కాకుండా పాత వాటి ద్వారా సరఫరా చేస్తుండటంతో సక్రమంగా వెళ్లడం లేదని గ్రిడ్ అధికారులు పేర్కొంటున్నారు.

పట్టణంలో నీటి సమస్య నెలకొన్న వడ్లవాడలో–4, ఉస్మాన్‌పురాలో–2, బోయినిపేట, ముత్యాలమ్మగూడెం, అంబేద్కర్‌నగర్, ఎరుకలగూడెం, శ్రీపాదకాలనీలో–2 బోర్లకు మోటార్లు బిగించి స్థానికులకు నీటిని సరఫరా చేస్తున్నారు.

**అవసరానికి మించి..**

ఒక వ్యక్తికి 100 లీటర్ల నీటిని అందించేందుకు మిషన్ భగీరథ కింద మంథని పట్టణానికి గ్రిడ్ లెక్కల ప్రకారం 4506 నీటి కనెక్షన్లకు 18 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా 42 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామని డీఈఈ కిరణ్ తెలిపారు. అయినా సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. వాస్తవానికి 2800 కనెక్షన్లకు కేవలం 10 లక్షల లీటర్లు మాత్రమే సరఫరా చేయాలన్నారు. పట్టణంలో మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ కనెక్షన్ ఇచ్చిన ఇంట్రా డిపార్ట్‌మెంట్, కుళాయిలకు బిరడా బిగించకపోవడం, కనెక్షన్ ఇచ్చినా వినియోగించని చోట డమ్మీలు బిగించకపోవడంతో సమస్య నెలకొందని గ్రిడ్ అధికారులు పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా నీరు రావడం లేదుహనుమాన్‌నగర్‌లో రెండేళ్లుగా మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. న్యూ హనుమాన్ ఆలయం నుంచి అపార్టుమెంటు వరకు నీటి సరఫరా సరిగా లేక పబ్లిక్ కుళాయిల నుంచి తెచ్చుకుంటున్నాం. మిషన్ భగీరథ నీరు సన్నని ధారగా వస్తుండటంతో బయటకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. అంగోత్ రాజునాయక్, మంథని

**ఇంటింటికీ పరిశీలిస్తాం**

పట్టణంలోని 15 ట్యాంకుల ద్వారా సరఫరా జరిగినపుడు వార్డు అధికారులు, లైన్‌మెన్లతో ఇంటింటికి తిరిగి పరిశీలిస్తున్నాం. రాని చోట కారణాలు తెలుసుకుంటాం. కుళాయిలకు బిరడాలు బిగించి వృథాను అడ్డుకడతాం. వినియోగించని చోట పైపులకు డమ్మీలు ఏర్పాటు చేసి వేసవిలో సక్రమంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం. మౌనిక, మున్సిపల్ ఏఈ

## అడుగంటుతున్న ఆశలు!



జగిత్యాల : శ్రీరామసాగర్ జలాశయంలో నీటినిల్వలు రోజురోజుకు తగ్గుతున్న ప్రభావం జగిత్యాల జిల్లాపై అమితంగా పడనుంది. 112 టీఎంసీల సామర్థ్యంలో నిర్మించిన ప్రాజెక్టులో నిరుటి వరకు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలుండగా పూడికతో ప్రస్తుతం 80.500 టీఎంసీలుగానే నిర్ధారించారు. దీంతోపాటుగా కాలువల చివరి భూములకు నీరందక పైర్లు ఎండుతుండగా ఈ దుస్థితిని సరిదిద్దాల్సి ఉంది.

**మరమ్మతులతో నీటి తరలింపు సాధ్యం**

జూన్ 1 నుంచి ఇప్పటివరకు ఎస్సారెస్పీలోకి 285.157 టీఎంసీల వరదనీరు వచ్చిచేరింది. 264.563 టీఎంసీల నీటిని గోదావరిలోకి, వరదకాలువకు, ఆయకట్టుకు వదలగా పాత నిల్వతో కలుపుకొని ప్రస్తుతం 27.578 టీఎంసీల నీరు నిలువుంది. ఏప్రిల్ 2తో జోన్–2 ఆయకట్టుకు, ఏప్రిల్ 9తో జోన్–1 ఆయకట్టుకు నీటితడులు ముగియనున్నాయి. అయితే చాలాప్రాంతాల్లో ఫిబ్రవరి 15 తేదీవరకూ నాట్లు వేసినందున మరో రెండు నీటితడులు విడుదల చేయాలన్న డిమాండ్ ఉన్నా ప్రాజెక్టులో తగినంత నీరులేని దుస్థితి నెలకొంది.

ఎస్సారెస్పీ నుంచి కాకతీయ, సరస్వతి, లక్ష్మీ, వరదకాలువ, గుత్ప, ఆలీసాగర్, నిర్మల్ ఎత్తిపోతలు, మిషన్ భగీరథకు నీటిని వదులుతున్నారు. ఆవిరి వృథా 5 టీఎంసీలుపోను డెడ్‌స్టోరేజీ 5 టీఎంసీలు, తాగునీటికి నిరంతరం నీరు వదలాల్సి ఉంటుంది. డిసెంబరు 25వ తేదీన ఆయకట్టుకు నీటిని విడుదల చేసే సమయంలో నిండుగా నీరున్నా దిగువకు అధికంగా వదలటంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం అడుగంటేలా ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పాటుగా ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో చివరి ఆయకట్టులో పంటలు ఎండుతుండటం ఆందోళనకరంగా మారింది.

ప్రాజెక్టు నుంచి గతంలో మాదిరిగా చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించక భూగర్భ జలమట్టం వేగంగా అడుగంటి పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది. కాలువలకు అమర్చిన వేలాది మోటార్లతో నీరు ఆశించినట్లుగా దిగువకు పారటంలేదు. జనవరి నుంచి సాధారణంకన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వరి తదితర పంటలకు నీటి ఆవశ్యకత అధికంగా ఉండి పూర్తిస్థాయిలో కాలువనీరందక ఎండుతున్నాయి. గోదావరిలోనూ నీరు అడుగంటి ఎత్తిపోతలు పనిచేయక పంటలు ఎండుతున్నాయి.

కాకతీయ ప్రధాన కాలువతో పాటుగా డిస్ట్రిబ్యూటరీలు, ఇతర కాలువల లైనింగ్ చాలాచోట్ల దెబ్బతినగా చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితర కారణాలతో కాలువల్లో నీటి తరలింపు సామర్థ్యం తగ్గి చివరికి చేరటంలేదు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు దెబ్బతినటంతో ఏ కాలువనిండా నీటిని తరలించలేని పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో అన్ని నిర్మాణాలకు మరమ్మతులు చేస్తేనే మున్ముందు నీటి తరలింపు సాధ్యపడుతుంది. ఎస్సారెస్పీలో పూడిక తొలగించి నిర్మాణ సామర్థ్యం మేరకు 112 టీఎంసీల నీటిని నిల్వచేయాలి. అన్ని ప్రాంతాల్లోనూ పరాధీనమైన ప్రాజెక్టు భూములను స్వాధీనం చేసుకుని అన్నికాలువలకు లైనింగ్ చేయాలి. రూ. 136 కోట్లతో చేపట్టిన రోళ్లవాగు ఆధునికీకరణ పనులను పూర్తిచేయాలి. కాకతీయ కాలువతోపాటుగా వరదకాలువ నుంచి చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని, వాగులపై తలపెట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేస్తే దీర్ఘకాలికంగా ఆయకట్టుకు సాగునీటి భరోసా ఉంటుంది.

## పనులు నిలిచి.. ఆనవాళ్లు కోల్పోయి



కోదాడ : సాగర్ ఆధునికీకరణ ప్రాజెక్టు కంటే ముందు.. కాల్వలకు ఏటా అత్యవసర పనులు గుర్తించి, వానాకాలం సీజన్‌కు సాగునీరు విడుదల చేసే వరకు మరమ్మతులు చేపట్టేవారు. దీనివల్ల ప్రతి సీజన్‌లో నాలుగు నుంచి ఐదు నెలల వరకు కాల్వలకు మరమ్మతు పనులు చేపట్టే వెసులుబాటు ఉండేది. 2018 వరకు సాగర్ ఆధునీకరణలో ప్రతిపాదించిన పనులు మాత్రమే చేపట్టి వదిలేశారు. అప్పటి నుంచి ప్రతి వేసవిలో చేపట్టే పనులు నిలిచిపోయాయి. దీంతో పలుచోట్ల సాగర్ ఎడమ కాల్వకట్టలు కోతకు గురై ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

**పూర్తి స్థాయి లైనింగ్ అవసరం..**

గతేడాది కురిసిన భారీ వర్షాలకు తోడు కాల్వలో నీటి ప్రవాహానికి సాగర్ ఎడమ కాల్వకు సూర్యాపేట, ఖమ్మం జిల్లాల పరిధిలో మూడు చోట్ల గండ్లు పడ్డాయి. వరద నీటితో వందల ఎకరాల్లోని పంట భూముల్లో ఇసుక మేటలు వేయడంతో పాటు, నాట్లు వేసిన వరి సైతం కొట్టుకుపోయింది. గండ్లు పూడ్చడానికి కాల్వలో నెల రోజుల పాటు నీటి విడుదల నిలుపుదల నిలిపివేయడంతో ఆయకట్టు పరిధిలో సాగునీరందక రైతులు నష్టపోయారు. ఇలాంటివి జరగక ముందే కాల్వ కట్టలను పటిష్ఠం చేసే పనులు ఈ వేసవిలో చేపట్టాలని వారు కోరుతున్నారు.

సాగర్ ఎడమ కాల్వకు 131 కి.మీ. వద్ద పడిన గండిని ఇసుక బస్తాలతో పూడ్చివేశారు. గండి పడిన చోట కాల్వ లైనింగ్ పూర్తిగా దెబ్బతింది. అక్కడ ఫ్లోరింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులతో పాటు డీప్‌కట్‌ల వద్ద బలహీనంగా ఉన్న కాల్వకట్టల పనులు చేపట్టాలని కోరుతున్నారు.

**మరమ్మతులకు నోచుకోని మేజర్ కాల్వలు..**

ఆయకట్టు భూములకు సాగునీరు అందించడంలో కీలక భూమికను పోషించే మేజర్ కాల్వలు నిరాదరణకు గురవుతున్నాయి. దాదాపు దశాబ్ద కాలం నుంచి మేజర్ కాల్వలకు మరమ్మతులు చేపట్టడం లేదు. ఎడమ కాల్వ పరిధిలో 30కి పైగా మేజర్ కాల్వలు ఉన్నాయి. వీటి కింద మూడు లక్షల ఎకరాల వరకు ఆయకట్టు విస్తరించి ఉంది. ఏళ్ల తరబడి కాల్వలు పూడిక, నాచు, మొక్కలతో నిండి ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. పాలవరం మేజర్ కాల్వ పరిధిలో ఏటా రైతులే చందాలు వేసుకుని పూడిక తొలగింపు చేపడుతున్నారు. ఈ వేసవిలో అత్యవసర పనులు చేపట్టి కాల్వ చివరి భూముల వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పద్దుపై ఆశ.. మారాలి దశ

హైదరాబాద్ : నగరంలో రహదారుల రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ నిధుల సమీకరణకు నడుం బిగించింది. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో.. బల్దియాకు భారీగా కేటాయింపులు జరపాలని కోరుతూ కమిషనర్ ఇలంబర్తి తాజాగా సర్కారుకు లేఖ రాశారు. అందులో హెచ్–సిటీ ప్రాజెక్టును జీహెచ్‌ఎంసీ ప్రధానంగా ప్రస్తావించింది. పదుల కొద్దీ పైవంతెనలు, అండర్‌పాస్‌లు, స్టీలు బ్రిడ్జీల నిర్మాణమే లక్ష్యంగా రూపుదిద్దుకున్న ప్రాజెక్టు లక్ష్యాలను వివరిస్తూ.. పనులు సకాలంలో పూర్తయ్యేందుకు ఆర్థిక సాయం అవసరాన్ని కమిషనర్ లేఖలో వివరించారు. వాటితోపాటు రోడ్డు అభివృద్ధి పనులు, నాలాల విస్తరణ, కూడళ్ల సుందరీకరణ, ఇతరత్రా అభివృద్ధి పనులకు, భూసేకరణ, పన్ను బకాయిలు కలిపి మొత్తం రూ.7,200 కోట్లు కేటాయించాలని కోరారు.

**రూ.7 వేల కోట్లతో హెచ్-సిటి**

రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు, 2024లో రూ.7,032 కోట్ల విలువైన హెచ్–సిటి పనులకు శంకుస్థాపన చేసింది. దాదాపు ఆయా పనులన్నీ ప్రస్తుతం టెండరు దశలో ఉన్నాయి. మరోవైపు.. గత సర్కారు హయాం



లో మొదలైన ఎస్సార్డీపీ(వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం) పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ కొత్త ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.5వేల కోట్ల పనులను పూర్తి చేయాలని భావిస్తోంది. అప్పుడే ఎస్సార్డీపీ పెండింగు పనులు పూర్తవుతాయని, హెచ్–సిటి పనులు కొలిక్కి వస్తాయని కమిషనర్ సర్కారుకు తెలిపారు. అందుకుగాను రూ.4వేల కోట్ల నిధులు హెచ్–సిటి ప్రాజెక్టుకు ఇవ్వాలని కోరారు.

**భూసేకరణకు..**

గతంలో ఎస్సార్డీపీ ప్రాజెక్టు కోసం చేపట్టిన భూసేకరణ టీడీఆర్ సర్టిఫికెట్ల జారీ ద్వారా జరిగింది. దాని వల్ల జీహెచ్‌ఎంసీపై ఆర్థిక భారం తగ్గింది. ప్రస్తుతం టీడీఆర్‌ల జారీ నిలిచిపోయింది. అందుకు అధికారులు వేర్వేరు కారణాలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. భూసేకరణకు నగదు పరిహారమే ఏకైక మార్గంగా అధికారులు భావిస్తున్నారు. పురోగతిలో ఉన్న ఎస్సార్డీపీ పనులు, కొత్తగా చేపట్టబోయే హెచ్–సిటి పనుల భూసేకరణకు రూ.350కోట్లు ఇవ్వాలని సర్కారును బల్దియా కోరింది.

**అప్పులకు కిస్తీలు చెల్లించాలంటే..**

ఎస్సార్డీపీ పనుల కోసం గడిచిన ఐదేళ్లలో జీహెచ్‌ఎంసీ రూ.7వేల కోట్ల అప్పు చేసింది. అందుకుగాను ప్రస్తుతం నెలకు రూ.100కోట్ల కిస్తీ చెల్లిస్తోంది. ప్రస్తుతమున్న ఆదాయ వనరులతో కిస్తీలు చెల్లించడం బల్దియాకు సాధ్యపడట్లేదు. ఉద్యోగుల జీతాలకే నిధులు సరిపోని పరిస్థితి ఉంది. ఆ విషయం తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. రాబోయే ఏడాది పాటు కిస్తీలు చెల్లించేందుకు రూ.1,200కోట్లు అవసరమని, ఆ నిధులను ఆర్థిక సాయంగా ఇవ్వాలంటూ బల్దియా సర్కారుకు విన్నవించింది.

## టీడీఆర్.. ఏమవుతోంది?

హైదరాబాద్ : జీహెచ్‌ఎంసీ జారీ చేసిన టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్) ధ్రువపత్రాల చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. భవిష్యత్తులో ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో దళారులు, కన్సల్టెన్సీలు, పలు నిర్మాణ సంస్థలు టీడీఆర్ సర్టిఫికెట్లను భారీగా కొన్నాయనే విమర్శలొస్తున్నాయి. గతేడాదిలో జీహెచ్‌ఎంసీ పది శాతం సర్టిఫికెట్లను కూడా జారీ చేయకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

**నగదుకు బదులు..**

రోడ్డు అభివృద్ధి పనులకు భూసేకరణ అవసరం. ప్రైవేటు వ్యక్తుల నుంచి భూమి తీసుకుంటే.. వారికి నష్టపరిహారం ఇవ్వాలి. నగరంలో భూమి విలువ భారీగా ఉంటుంది. నష్టపరిహారం ఇవ్వాల్సి వస్తే.. జీహెచ్‌ఎంసీ ఖజానా సరిపోదు. దీంతో నగదుకు బదులు టీడీఆర్ సర్టిఫికెట్లను ఇచ్చే ప్రక్రియను జీహెచ్‌ఎంసీ డిసెంబరు, 2017లో ప్రవేశపెట్టింది. అప్పట్నుంచి దాదాపు రూ.10వేల కోట్ల విలువైన నగదు పరిహారానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లను జారీ చేసింది.

**ఎలా ఉపయోగించుకుంటారు..**

జీహెచ్‌ఎంసీతోపాటు హెచ్‌ఎండీఏ పరిధిలో.. పరిమితికి మించి ఒకటి లేదా రెండు అదనపు అంతస్తులను కట్టుకునేందుకు టీడీఆర్ ఉ



పయోగపడుతుంది. అనుమతి లేకుండా.. ఎత్తు, సెట్‌బ్యాక్ నిబంధనలను పాటిస్తూ చేపట్టిన నిర్మాణాన్ని జీహెచ్‌ఎంసీ చట్టంలోని 455ఏ సెక్షన్ ఉపయోగించి క్రమబద్ధీకరించుకోవచ్చు. అందుకుగాను నిర్మాణ అనుమతి రుసుముపై 33శాతం జరిమానా చెల్లించాలి. ఆ జరిమానాను కూడా ఈ సర్టిఫికెట్ల ద్వారా చెల్లించవచ్చు.

**పెట్టుబడి వస్తువుగా..**

ఏడాదిగా టీడీఆర్ సర్టిఫికెట్ల జారీ లేకపోవడం, ప్రభుత్వం భూముల ధరలు పెంచనుందనే ప్రచారం, ఆకాశహర్మ్యాల అనుమతులపై పరిమితులు రాబోతున్నాయనే ఊహాగానాలు.. మార్కెట్లో ఉన్న టీడీఆర్‌కు డిమాండ్ తెచ్చాయి. ఏడాదిలో ఆ ధర 35 శాతానికి పెరిగింది. దాంతో.. వందలాది మంది కోట్లాది రూపాయల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లను కొనుగోలు చేశారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో భూములు కోల్పోయిన అసలైన యజమానులు నష్టపోయారన్న వాదన వినిపిస్తోంది.

చురకలు



# సింహభాగం వరి సాగుకే సై

కరీంనగర్ : ప్రస్తుత యాసంగిలోనూ జిల్లా రైతులు అధికశాతం వరి సాగు వైపే మొగ్గు చూపారు. గతేడాది యాసంగిలో నీరందక వేలాది ఎకరాల్లో పంట దిగుబడి తగ్గి నష్టపోయారు. నీరందిన చోట పొట్టదశలో ఈదురు గాలులు, వడగళ్ల వానతో కొన్ని ఎకరాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మొక్కజొన్న సైతం దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్నేళ్లకు ముందు సరిపడా నీరు అందుబాటులో లేక యాసంగిలో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపేవారు. అయిదారేళ్లుగా సాగునీరు సమృద్ధిగా ఉండటం, పంట కూలీల ఖర్చు, కోతులు, పక్షుల బెడద లేకపోవడంతోపాటు వరి సాగు వైపు అధిక శాతం మంది మొగ్గు చూపారు. ఈనెల మూడో వారం తర్వాత యాసంగి పంట సాగు సమయం ముగిసినట్లుగానే భావించవ



చ్చని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

**నీటి సరఫరాపై సతమతం**

గతంతో పోల్చితే ఈ యాసంగిలో ఇప్పటివరకు సాగుచేసిన పంటలకు నీటి లభ్యత ఉండే అవకాశముంది. ఎస్సారెస్పీలో 40, మధ్య మానేరులో 20, లోయర్ మానేర్‌లో 15 టీఎంసీల వరకు అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉష్ణోగ్రతల తీవ్రత గత వేసవికన్నా అధికంగానే ఉండనున్నట్లు సమాచారం. ఆయకట్టు చివరి పంటలకు మినహా మిగిలినవాటికి నీటి సమస్య తలెత్తకపోవచ్చంటున్నారు. గతేడాది మార్చిలో ప్రకృతి ప్రళయానికి గురైన రైతులు పంట నష్టపోయారు. ఈసారి అలాంటి ఘటనలు పునరావృతమైతే వరిసాగు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**సరిపడా నిల్వలున్నాయి**

జిల్లాలోని ప్రాజెక్టుల్లో యాసంగి పంట పూర్తి నాటికి సరిపడా నీటి నిల్వలున్నాయి. ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# ఘాట్‌రోడ్డుకు మోక్షమెప్పుడో..?

మల్లాపూర్: సముద్ర మట్టానికి 800 మీటర్ల ఎత్తులో ప్రకృతి రమణీయతతో అలరారుతున్న శ్రీకనక సోమేశ్వరకొండను పర్యాటకప్రాంతంగా గుర్తించడంతో పాటు కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మిస్తామన్న నేతల హామీ నేటికి కార్యరూపం దాల్చడం లేదు. దీంతో ఏటా కొండపై కొలువైన స్వామివారిని దర్శించుకొనే భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. కొండపై వెలసిన సోమేశ్వరస్వామిని దర్శించుకొనేందుకు ఏటా లక్షల్లో భక్తులు కొండపైకి వెళ్తుంటారు. సోమవారం, శివరాత్రి, శ్రావణమాసాల్లో వేలాదిగా వస్తున్న భక్తులు మెట్లమార్గంలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు ఒక్కొక్కరు 5 నుంచి 10 మెట్లవరకు విరాళాలతో నిర్మించారు.



**రూ.10 కోట్లు మంజూరు..** గత ప్రభుత్వం కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేసినప్పటికీ పనుల్లో పురోగతి కనిపించకపోవడం భక్తులను విస్మయానికి గురిచేస్తోంది. ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది. శివరాత్రి సమయంలో మండల దీక్షాపరులు నిత్యం కొండపైకి వెళ్లిరావడం ఇబ్బందిగా పరిణమిస్తోంది. మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఘాట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఘాట్‌రోడ్డు నిర్మించాలని భక్తులు కోరుతు న్నారు.

**కలగానే రోప్‌వే నిర్మాణం** సోమేశ్వరకొండతో పాటు పురాతన వాల్గొండ రామలింగేశ్వర ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి అవసరం ఉంది. గతంలో ఆలయాన్ని పరిశీలించిన పర్యాటక శాఖ అధికారులు సోమేశ్వర కొండకు రోప్‌వే నిర్మాణం చేపట్టి, హరిత హొటల్ నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో రోప్‌వే ఏర్పాటు కలగానే మిగిలింది.

# విలీన గ్రామాలు.. చెప్పలేని ఇక్కట్లు

నిర్మల్ : నిర్మల్ మండలం మంజులాపూర్ గ్రామాన్ని పురపాలికలో ఆరేళ్ల క్రితం విలీనం చేసి రెండు వార్డులుగా విభజించారు. ఇందులో 19వ వార్డు అంబేడ్కర్ కాలనీలో కొత్త ప్లాట్లుగా పిలుచుకునే ఈ ప్రాంతం ఏర్పడి 30 ఏళ్లకుపైగా అవుతోంది. పంచాయతీగా ఉన్నప్పుడు రోడ్లు, మురుగుకాలువలు కొన్నింటిని అభివృద్ధి చేశారు. బల్దియాలో చేరి తర్వాత అయిదేళ్ల కాలంలో ఇక్కడ రూ.6 లక్షలతో ఒక్క డ్రైనేజీ మాత్రమే నిర్మించారు. ఆ తర్వాత ఎలాంటి పనులు చేపట్టలేదు. విలీనమైన రెండు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.

అధిక జనాభా, భూముల ధరలు ఎక్కువగా ఉండి ఆర్థిక వనరు లభించే సమీపంలోని గ్రామాలను గత ప్రభుత్వం మున్సిపాలిటీల్లో విలీనం చేసింది. అందులో భాగంగా మంజులాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో నిర్మల్ పురపాలికలో చేర్చి మూడు వార్డులుగా విభజించారు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో ఏదో ఒక పథకం కింద అంతోఇంతో లబ్ధి చేకూరేది. బల్దియాలో కలిసినప్పటి నుంచి ఒక్కో వార్డులో దాదాపు రూ.6-10 లక్షల వరకు మాత్రమే పనులు చేసిన దాఖలాలు ఉన్నాయి. ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు అలాగే ఉండటంతో ప్రజలు వాటి మధ్యే జీవనం సాగించాల్సి వస్తోంది.

**ఇబ్బందుల మధ్య..**

ఇంటిపన్నులు, ఇంటి నిర్మాణ అనుమతులు వంటి వాటితో బల్దియాకు ఆదాయం సమకూరుతున్నా స్థానికులకు కనీస మౌలిక వసతులు కరవయ్యాయి. రోడ్లు, మురుగుకాలువలు అభివృద్ధికి నోచుకోలేక పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వీరు ఎదుర్కొనే సమస్యలు చెప్పలేనివి. బురదమయంగా మారే మార్గాలు, ఎక్కడికక్కడ నిలిచే మురుగుతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమల ఉద్ధృతితో వ్యాధుల బారినపడే పరిస్థితి. పంచాయతీలుగా ఉన్న సమయంలో కార్యదర్శులకు, తమకు తెలిసిన వారికి చెప్పి వాటిని పరిష్కరించుకునేవారు. ప్రస్తుతం ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. అధికారులే విలీన గ్రామాల సమస్యలపై స్పందించి పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' పుర కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. టీయూఎఫ్ఐడీసీలో విలీన గ్రామాల వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపించామని చెప్పారు. నిధుల మంజూరు, ఆమోదం వచ్చిన వెంటనే వాటిని చేపట్టి స్థానికుల ఇబ్బందులు పరిష్కరిస్తామని వెల్లడించారు.

# ఆదిలో జోరు.. తుది దశలో జాగు



కరీంనగర్ : దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వంద స్మార్ట్‌సిటీల్లో కరీంనగర్ ఒకటి. అలాంటి నగరంలో అభివృద్ధి పనులు మొదట్లో ఊపందుకోగా.. ఆ తర్వాత నెమ్మదించాయి. భవన నిర్మాణాలతోపాటు సాంకేతికపరంగా చేపట్టాల్సిన పనుల్లో జాప్యం జరుగుతుండటంతో వీటన్నింటిని ఎప్పటిలోగా అందుబాటులోకి తీసుకొస్తారనేది స్పష్టతలేదు. రూ.937.10 కోట్లతో మొత్తం 48 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టగా.. ఇందులో 33 ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయి.

**14 ప్రాజెక్టులు నిర్మాణ దశలోనే..**

మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. ఇంకా 14 ప్రాజెక్టుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరొకటి టెండర్ల దశలోనే ఉంది. కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణంలో డిజైన్లు ఇవ్వకపోవడంతో ఆలస్యమైంది. మొదటి దశలో రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, వీధిదీపాలు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటివి పూర్తి చేశారు. రెండో దశలో పార్కులు, అంబేడ్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఉచిత వైఫై, డిజిటల్ తెరలు, స్మార్ట్ క్లాసులు వంటివి చేపట్టారు.

**నెలలు గడుస్తున్నా..**

నగరంలోని గణేశ్‌నగర్ బైపాసు రోడ్డులో ఓ మాజీ ఎమ్మెల్సీ ఇంటి ఎదురుగా ప్రధాన వరదకాలువ, ఎన్టీఆర్ విగ్రహం ఎదుటనున్న డ్రైనేజీ నిర్మాణం, కట్టరాంపూర్ నుంచి డ్యాంకు వెళ్లే రహదారి మధ్యలో రోడ్డు పనులు, అహ్మద్‌పురలో డ్రైనేజీ నిర్మాణం వంటి పనులు పెండింగ్‌లో ఉంచారు. నెలలు గడుస్తుండగా.. కనీసం ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. పద్మనగర్, సదాశివపల్లి జంక్షన్ల పనులు నేటికి మొదలుకాలేదు. బాలసదనం, అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణాలు ఆరంభించి వదిలేశారు.

**అధికారులు మారినా పట్టింపేది?**

నగరపాలికలో ఇంజినీరింగ్ అధికారులు మారుతుండగా.. పూర్తయిన స్మార్ట్ పనుల విషయంలో పట్టింపు లేకుండా పోతుంది. నిర్మాణం పూర్తయ్యాక నిర్ణీత గడువులోగా నిర్వహణ పనులు చూసుకోవాల్సి ఉండగా.. అధికారులు ఆ దిశగా ఆలోచించడంలేదు. వీధిదీపాలు కొత్తవి బిగించడం లేదు.

# నర్సరీ మొక్కలకు నీడ కరవు



జూలూరుపాడు : నర్సరీల్లో మొక్కలకు నీడ కరవైంది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అధికమవుతుండగా మొలక శాతం తగ్గిపోతోంది. ఈ కారణంగా మొక్కల పెంపకం ఇబ్బందికరంగా మారింది. జూలూరుపాడు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 24 నర్సరీలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 2.47 లక్షల మొక్కలను పెంచాలని నిర్ణయించారు. 2025-26 సంవత్సరంలో వన మహోత్సవంలో భాగంగా పచ్చదనం పెంచేందుకు గతంలో కంటే భిన్నమైన మొక్కల రకాలను పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. అందుకే నర్సరీల్లో పండ్ల మొక్కలు, ఔషధ మొక్కల పెంపకానికి అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్నీ నర్సరీల్లో విత్తనాలు నాటారు. వీటిల్లో కొన్ని రకాలు అసలు మొలకెత్తనేలేదు. మరోవైపు నీటి తడులు కల్పిస్తున్నప్పటికీ మొక్కల బెడ్లు తేమ ఆరిపోతున్నాయి. కొన్ని చోట్ల మొక్కలు వడబడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 35డిగ్రీలకు పైనే నమోదవుతున్న నేపథ్యంలో వీటిని కాపాడుకోవడానికి షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

**33 రకాల మొక్కల ఎంపిక**

ఈ ఏడాది మొక్కల పెంపకానికి సంబంధించి 33 రకాల జాబితాను ప్రకటించారు. వీటిలో ఏది అనుకూలంగా ఉంటుందో వాటినే నాటాలని సూచించారు. ఈ మేరకు నర్సరీల్లో కరక్కాయ, గోరింటాకు, మందారం, మునగ, తులసి, మునగ, ఉసిరి వంటి ఔషధ రకాలతో పాటు, సీతాఫలం, వెలగ, టెకోమా, షిషు వంటి రకాలను నర్సరీల్లో అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా నర్సరీల్లో ఇంకా అడవి జాతుల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు కనిపిస్తున్నాయి. వీటిని అనంతపురం నుంచి నర్సరీలకు తెప్పిస్తున్నారు. చిన్న నర్సరీల్లో 11 వేల మొక్కలు, పాపకొల్లు, కాకర్ల వంటి పెద్ద నర్సరీల్లో 13 వేల చొప్పున మొక్కలు పెంచుతున్నారు.

**నీడకు పరదాలు**

ప్రస్తుతం ఏ నర్సరీల్లోనూ నీడకు పరదాలు వినియోగించడం లేదు. గతంలో వేసిన షేడ్‌నెట్స్ అన్నీ చిరిగిపోయాయి. కొన్నిచోట్ల అసలు ఆనవాళ్లే లేవు. ఎండలు అధికమవుతున్న ఇలాంటి పరిస్థితుల్లో పరదాలు కొనుగోలు చేయాల్సి ఉంది. వీటిని గ్రామ పంచాయతీల నుంచి గతంలో కొనుగోలు చేశారు. అటు ఉపాధి హామీ సిబ్బంది, మరోవైపు గ్రామ పంచాయతీ కార్యదర్శులు నర్సరీలను పర్యవేక్షిస్తున్నా అక్కడక్కడ సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం, మోటార్లు మొరాయించడం వంటి సమస్యలతో నీటి తడులు కల్పించేందుకు అవస్థలు తప్పటం లేదు.

ఈ ఏడాది కలెక్టర్ సూచించిన మొక్కల జాబితాకే ప్రాధాన్యం. వాటిల్లో రకాలను మాత్రమే నర్సరీల్లో పెంచుతున్నాం. ప్రస్తుతం ఎండల తీవ్రత సమస్యగా మారింది. మొక్కలు చనిపోకుండా నీటి తడులు కల్పిస్తున్నప్పటికీ కొన్నిచోట్ల మొలక శాతం తక్కువగా ఉంది. నీడకు పరదా(షేడ్‌నెట్స్)లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రవికుమార్, ఏపీఓ

# ఆమోదం లేకుండానే టెండర్లా!




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హెచ్-సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టులను జీహెచ్ఎంసీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. ఇంజినీర్లు ఇప్పటి వరకు డీపీఆర్‌లను ఆమోదించలేదు. దాదాపు రూ.6వేల కోట్లతో రూపుదిద్దుకున్న పనులపై అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తుండటంతో.. ప్రాజెక్టులు పూర్తవుతాయా అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**నిలిచిన డీపీఆర్‌లు..**

కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లను రెండు దశల్లో రూ.1090కోట్లతో అభివృద్ధి చేసేందుకు అక్టోబరు, 2024లో జీహెచ్ఎంసీ టెండరు నోటీసు ఇచ్చింది. మూడు నెలలవుతున్నా టెండరు నోటిఫికేషన్ మాత్రం విడుదల కాలేదు. డీపీఆర్ లేకుండా టెండరు నోటీసు విడుదలపై అధికారుల నుంచి సమాధానం లేదు.

రూ.459కోట్లతో గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ కూడలిని అభివృద్ధి చేయాలన్నది ప్రణాళిక. డీఎల్ఎఫ్ రోడ్డు నుంచి ఐఎస్‌బీ రోడ్డు, ఐఎస్‌బీ రోడ్డు నుంచి గచ్చిబౌలి కూడలి వైపు, డీఎల్ఎఫ్ రోడ్డు నుంచి గచ్చిబౌలి స్టేడియం దిశలో పైవంతెనలు, గచ్చిబౌలి కూడలి-గచ్చిబౌలి స్టేడియం మధ్య కూడలిలో ఆరు లైన్ల అండర్‌పాస్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సైతం అటకెక్కింది. రూ.158కోట్లతో విప్రో చౌరస్తాపై ఐఎస్‌బీ రోడ్డు-ఓఆర్ఆర్ మధ్య రాకపోకల కోసం నాలుగు లైన్ల పైవంతెన, ఐసీఐసీఐ చౌరస్తాలో విప్రో జంక్షన్-ఓఆర్ఆర్ మధ్య నాలుగు లైన్ల అండర్‌పాస్ నిర్మించాలన్న ప్రణాళిక నిలిచిపోయింది.

రూ.220కోట్లతో ఖాజాగూడ చౌరస్తాలో టోలిచౌకి నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనాల కోసం అండర్‌పాస్, నానక్‌రామ్‌గూడ నుంచి టోలిచౌకి వైపు వెళ్లే వారికి పైవంతెన నిర్మాణ పనుల ప్రాజెక్టులోనూ జాప్యం చోటు చేసుకుంది.

హెచ్-సిటీపైనే ఆశలు.. కొత్త ప్రభుత్వం వచ్చాక ఎస్సార్డీపీ కింద చేపట్టాల్సిన కొత్త పనులు నిలిచిపోయాయి. హెచ్-సిటీ తెరపైకి వచ్చింది. అందులో భాగంగా డిసెంబరు 3న 23 ప్రాంతాల్లో రూ.5,942కోట్ల విలువైన పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కేబీఆర్ పార్కు కూడళ్ల అభివృద్ధి పనులు కూడా హెచ్-సిటీలో భాగమే.

# వరద బెడద తప్పేలా..

ఖమ్మం: మున్నేరు రక్షణ గోడల నిర్మాణ పనులు గాడినపడ్డాయి. రక్షణ గోడలకు ఆనుకుని ప్రత్యేకంగా రహదారి, దీనిపక్కనే మురుగుకాల్వ నిర్మించనున్నారు. ఖమ్మం నగరం నుంచి వెలువడే మురుగునీరు మున్నేరులో కలిసేలా రక్షణ గోడల పొడవునా పది మీటర్ల వెడల్పుతో మురుగుకాల్వ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రభుత్వ భూమి ఉన్నచోట ప్రస్తుతం రక్షణ గోడల పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే పనుల్లో మరింత వేగం పెరగనుంది.

**రక్షణ గోడల నిర్మాణమిలా..**

మున్నేరు వరద ఉద్ధృతికి ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం గ్రామీణం మండలంలోని పదుల సంఖ్యలో కాలనీలు అతలాకుతలమవుతున్నాయి. మున్నేరు వరదల నుంచి ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు రూ.690కోట్లతో రక్షణ గోడల నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. నిధుల లేమితో ప్రాధామ్యాల ప్రకారం పనులు చేపట్టాలని కాంగ్రెస్ సర్కారు సంకల్పించింది. రూ.690కోట్లతో రక్షణ గోడల నిర్మాణం ఆవశ్యకతపై తర్జనభర్జన పడింది. ఖమ్మం, పాలేరు శాసనసభ నియోజకవర్గాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ చూపారు. వేలాది మందికి కవచంలా నిలిచే రక్షణ గోడలు నిర్మించాల్సిందేనని పట్టుబట్టడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.501 కోట్లతో మున్నేరుకు రెండువైపులా రక్షణ గోడల నిర్మాణానికి ముందడుగు పడింది. 2024 మార్చిలో టెండర్లు పూర్తవగా ఏప్రిల్‌లో



పనులు మొదలయ్యాయి. ఖమ్మం గ్రామీణం మండలం పోలెపల్లి నుంచి ప్రకాశ్‌నగర్ వరకు 8.50 కి.మీ., రామన్నపేట నుంచి ప్రకాశ్‌నగర్ వైపు 8.50 కి.మీ. మేర పొడవు, 40 అడుగుల ఎత్తుతో కాంక్రీట్‌తో రక్షణ గోడలు నిర్మించనున్నారు.

**భూసేకరణ ప్రక్రియ పూర్తయితే పనులు చకచకా**

రక్షణ గోడల నిర్మాణానికి 200 ఎకరాల భూమి సేకరించాలని అధికారులు నిర్ణయించారు. మున్నేరుకు రెండువైపులా 300 మీటర్ల మేర భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకోసం రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. 25 గృహాలను తొలగించాలని గుర్తించారు. రక్షణ గోడల నిర్మాణం కోసం నిర్వాసితులు తమ భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అయితే.. ఇందుకోసం భూములు, ఇళ్లకు పరిహారం ఖరారు కావాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే పనుల్లో మరింత వేగం పుంజుకోనుంది. ప్రస్తుతం ప్రభుత్వ భూములు ఉన్నచోట రక్షణ గోడలు నిర్మిస్తున్నారు. సుమారు 700 మంది కార్మికులు పనులు చేస్తున్నారు. గుత్తేదారు సంస్థకు 2026 మార్చి నాటికి రక్షణ గోడల నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి రక్షణ గోడల నిర్మాణ పనులు పూర్తవుతాయని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

# తప్పొకరిది.. శిక్ష ఇంకొకరికి..

ఆదిలాబాద్ : ఇది నిర్మల్ గ్రామీణ మండలంలోని చిట్యాల వంతెన వద్ద ప్రవహిస్తున్న స్వర్ణవాగు. దిలావర్‌పూర్ మండలం మాటేగాం నుంచి నిర్మల్ పట్టణానికి పైప్‌లైన్ ఈ వాగులోంచే వేశారు. నీటి ప్రవాహానికి పైప్‌లైన్ పగిలిపోయింది. మరమ్మతులు చేయక నిర్మల్ పట్టణానికి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆదిలాబాద్‌కు వెళ్లే నీటిపైప్‌నకు ట్యాపింగ్ చేసి నిర్మల్ పట్టణానికి మళ్లిస్తున్నారే కానీ మూడేళ్లుగా పైప్‌లైన్ వేయడంపై దృష్టిపెట్టడం లేదు. నిర్మల్‌లో చెడిపోయిందని ఆదిలాబాద్ జిల్లాలో సక్రమంగా ఉన్న నీటి సరఫరాను చెడగొట్టి ప్రజలకు అవస్థలు తెచ్చిపెడుతున్నారు.

శ్రీరామసాగర్‌లోని గోదావరి నది నీళ్లను సరఫరా చేసేందుకు దిలావర్‌పూర్ మండలం మాటేగాంలో నిర్మించిన శుద్ధికేంద్రం నుంచి ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాల దాహార్తిని తీరుస్తున్నామంటున్నా అది చెప్పడానికే పరిమితమవుతోంది. శుద్ధికేంద్రం నుంచి నిర్మల్ మున్సిపాల్టీకి నేరుగా 16 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక పైప్‌లైన్ వేశారు. ఆదిలాబాద్‌కు వచ్చే పైప్‌లైన్‌ను ఆనుకొని 600 ఎంఎం మందంగల పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. 2018లో పథకం మొదలుకాగా



ఆరంభం నుంచి పైప్‌లైన్‌లో అవాంతరాలు ఎదురవుతున్నాయి. తరచూ లీకేజీలు ఏర్పడటంతో నిరంతర సరఫరా కావడంలేదు. నిర్మల్ మున్సిపాల్టీకి ప్రతిరోజు 24 ఎంఎల్‌డీల నీళ్లు ఇవ్వాల్సి ఉండటంతో నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తాలో ఉన్న ఆదిలాబాద్‌కు వచ్చేపైప్‌లైన్‌కు అక్రమ కనెక్షన్ బిగించారు. తొలుత కొన్ని గంటలే వాడగా ప్రస్తుతం నిరంతరంగా వాడుతుండటంతో ఆదిలాబాద్‌పై ఇది తీవ్ర ప్రభావం చూపెడుతోంది.

**రూ.4.50 కోట్లతో స్టీల్ వంతెనకు ప్రతిపాదించినా**

స్వర్ణవాగు ప్రవాహం నుంచి ఆటంకాలు లేకుండా నిర్మల్ పైప్‌లైన్ కోసం అక్కడ స్టీల్ వంతెన నిర్మించి పైనుంచి పైప్‌లైన్ వెళ్లేలా రూ.4.50కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిర్మాణానికి కంపెనీ ముందుకు రావడంలేదు. వాస్తవానికి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో ప్రధాన పైప్‌లైన్ నిర్వహణ అంతా మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనియే చూస్తుంది. ఎక్కడైనా చెడిపోతే మరమ్మతులు చేపట్టడమో, కొత్త పైప్‌లైన్ వేయడమో చేసి సమస్యకు పరిష్కారం చూపాలి. తొలుత అయిదు సంవత్సరాల వరకు నిర్వహణ బాధ్యత ఉండగా పలుచోట్ల ఇలాంటి అసంపూర్తి పనులు ఉండటంతో ఆరునెలల చొప్పున రెండు మార్లు పెంచారు. అయినా పైప్‌లైన్‌పై దృష్టిపెట్టకుండా ఆదిలాబాద్ నీళ్లు నిర్మల్‌కు మళ్లిస్తూనే ఉండటంతో ఇక్కడ అవస్థలు తప్పడం లేదు.

**నెలన్నరలో పరిష్కరిస్తాం - జ్ఞానకుమార్, మిషన్‌భగీరథ సీఈ**

పైప్‌లైన్ సమస్యపై నిర్మల్ ఎమ్మెల్యే సైతం పలుమార్లు మాట్లాడారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టిపెట్టాం. నెలన్నర రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.

# గృహోపకారం

కర్నూలు : ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తామని ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా గొప్పలు చెప్పింది.. పట్టణాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు ఇచ్చింది. అరకొరగా సాయం అందించడంతో చాలామంది నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. పునాదులు వేసి వదిలేశారు. అసంపూర్తిగా నిలిచిన పనులు పూర్తి చేసేందుకు 'కూటమి' ప్రభుత్వం అదనపు సాయం ఇవ్వాలని నిర్ణయించింది.

**వీరికి రిక్తహస్తమే**

ఆప్షన్-3 కింద గుత్తేదారులు నిర్మించే ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఈ అదనపు సాయం వర్తింపజేయలేదు. అప్పట్లో నిర్ణయించిన ప్రకారం ఒక్కో ఇంటికి రూ. 1.80 లక్షలతోపాటు లబ్ధిదారు సొంతంగా రూ. 35 వేలు కలిపి మొత్తం రూ. 2.15 లక్షలను గుత్తేదారులకు చెల్లించాల్సి ఉంది. గతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన మేరకే గుత్తేదారులు ఇళ్లు నిర్మించాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో 1,622 మంది, నంద్యాల జిల్లాలో 18 మంది కలిపి ఉమ్మడి జిల్లాలో 1,640 మందికి ప్రభుత్వం ప్రకటించిన ఈ అదనపు సాయం వర్తింపజేయడం లేదని గృహ నిర్మాణశాఖ ఇంజినీర్లు తెలిపారు.

**సాయానికి కోత పెట్టిన వైకాపా**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99,969 ఇళ్లు నిర్మిస్తున్నట్లు వైకాపా ప్రకటించింది. జగనన్న కాలనీల్లోనే 52,149 గృహాలు మంజూరు చేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఒక్కో ఇంటికి కేంద్రం రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ తన వాటా రూ. లక్ష కలిపి రూ. 2.50



లక్షలు అందించాల్సి ఉంది. కానీ వైకాపా ప్రభుత్వం కేంద్రం వాటాకు అదనంగా రూ. 30 వేల చొప్పున ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలే మంజూరు చేసింది.

**దృష్టి సారించిన 'కూటమి' ప్రభుత్వం**

నివాసయోగ్యం కాని చోట్ల స్థలాలు ఇవ్వడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మౌలిక వసతులు కల్పించడంలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయా సమస్యలపై దృష్టి సారించింది. ముందుగా ఆయా కాలనీల పేరును పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌లుగా మార్చడంతోపాటు గృహ నిర్మాణానికి అదనపు సాయం అందించేలా నిర్ణయించింది.


ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అసంపూర్తిగా మిగిలిపోయిన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. అర్హులను ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలుగా విడగొట్టింది. ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలు రూ. 75 వేలు, ఆదివాసీ గిరిజనులు రూ. లక్ష, చేనేత కార్మికులు రూ. 50 వేలు, ఇతర బీసీ వర్గాలకు రూ. 50 వేల చొప్పున అందించనుంది.

# ఖాతా తెరుచుకో.. కమీషన్ తీసుకో

ఉంగుటూరు : గతంలో పెద్ద టోర్నీలకు పరిమితమైన క్రికెట్ బెట్టింగ్‌లు క్రమేపీ గల్లీ క్రికెట్ టోర్నీల వరకు పాకాయి. పోలీసులకు కంటపడకుండా ఉండేందుకు నగదు లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారు. ఈ క్రమంలో క్రికెట్ బుకీలకు ఆన్‌లైన్ లావాదేవీలు జరిపేందుకు బ్యాంకు ఖాతాలు అనివార్యమయ్యాయి. దీనిని కొందరు వ్యాపారంగా మలుచుకుని రూ. లక్షలు సంపాదిస్తున్నారు. క్రికెట్ బుకీలకు ఇచ్చేందుకు కమీషన్ ఎర చూపి సామాన్యులతో కరెంట్ బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. బెట్టింగ్‌ల ద్వారా ఆయా ఖాతాల్లో రోజుకు రూ. లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నాయి. కమీషన్‌కు ఆశ పడి యువత, గృహిణులు కరెంట్ బ్యాంకు ఖాతాలు తెరిచి బెట్టింగ్‌లో భాగస్వాములవుతున్నారు. ఇలాంటి ఖాతాలు ఉంగుటూరు మండలం నారాయణపురంలో వందకు పైగానే ఉన్నట్లు తెలిసింది.

**ఆశ చూపి.. ఖాతాలు తెరిపించి..**

నారాయణపురానికి చెందిన పలువురు యువకులు హైదరాబాదు వెళ్లి క్రికెట్ బుకీ వద్ద పని చేశారు. అక్కడ బుకీలు లావాదేవీలు అన్నీ ఆన్‌లైన్ చేయడం, అందుకు కరెంట్ బ్యాంకు ఖాతాలు అవసరమని గుర్తించారు. స్వగ్రామంలో ఉండి డబ్బు సంపాదించుకోవచ్చని నారాయణపురం వచ్చేశారు. టూరింగ్‌పేట, ఎన్టీఆర్, వైఎస్ఆర్




కాలనీల్లో తమకు తెలిపిన వాళ్లకి కరెంట్ ఖాతాలు తెరిచి ఆ వివరాలు తమకిస్తే వారం వారం ఒక్కో ఖాతాకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు కమీషన్ ఇస్తామన్నారు. దీంతో కష్టపడకుండానే వారం వారం నగదు తమ ఖాతాలో వచ్చి పడుతుందని చాలా మంది ఆశ పడ్డారు. ఖాతాలు తెరవడం ప్రారంభించారు. కొందరికి కమీషన్లు వస్తున్నాయి.

**వెలుగులోకి ఇలా..**

నారాయణపురంలో జాతీయ రహదారి పక్కన ఓంకారేశ్వరి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ అండ్ కూల్ డ్రింక్స్ పేరిట దుకాణం ఉంది. ఇటీవల ఉండి మండలం కోలమూరులోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో కరెంట్ ఖాతాకి సంబంధించి చెక్‌బుక్, ఏటీఎం కార్డు పోస్టులో వచ్చాయి. తాము ఖాతా తెరవకుండా ఇది ఎలా సాధ్యమని దుకాణం నిర్వాహకులు అవాక్కయ్యారు. పోస్టు కవర్‌పై ఉన్న చరవాణి నంబరుకు ఫోన్ చేసి గట్టిగా అడిగితే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దుకాణం పేరిట వారికి తెలియకుండా తాను కరెంట్ ఖాతా తెరిచినట్లు అవతలి వ్యక్తి ఒప్పుకొన్నాడు. ఈ వ్యవహారాన్ని చేబ్రోలు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విధంగా గ్రామంలో యజమానులకు తెలియకుండా వారి దుకాణాలు, హోటళ్లు పేరిట తాడేపల్లిగూడెం, ఏలూరు, కోలమూరు తదితర ప్రాంతాల్లోని బ్యాంకుల్లో వందకు పైగా కరెంట్ ఖాతాలు తెరిచారు. పోలీసులు విచారణ ప్రారంభించడంతో ఇద్దరు యువకులు గ్రామం విడిచి వెళ్లిపోయినట్లు సమాచారం.

# గ్లకోమా.. జాగ్రత్త సుమా!



అనంతపురం : కంటి చూపును హరించే అదృశ్య శత్రువు గ్లకోమా (నీటికాసులు వ్యాధి). దీన్ని ఏమాత్రం నిర్లక్ష్యం వహిస్తే అంధకారమే అని కంటి వైద్యులు హెచ్చరికలు చేస్తున్నారు. ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే నియంత్రించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ నెల 12వ తేదీ గ్లకోమా డేను పురస్కరించుకుని.. నీటికాసుల వ్యాధి ఎందుకు వస్తుంది.. నివారణకు ఎలాంటి వైద్య చికిత్సలు పొందాలి..? వ్యాధి నిర్ధారణకు ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి..? జిల్లాలో దాని తీవ్రత ఎలా ఉందో వివరిస్తూ కథనం.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్లకోమా వ్యాధి బారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో ప్రస్తుత ఏడాది నమోదైన కేసులను గత ఏడాది కేసులతో పోలిస్తే అధికంగా ఉంది. సకాలంలో నీటికాసుల వ్యాధిని గుర్తించకపోవడంతో పలువురు కంటిచూపును కోల్పోతున్నారు. తమకు వ్యాధి సోకిందనే విషయాన్ని బాధితులు గుర్తించలేకపోతున్నారు. కంటి నొప్పి, కళ్లు ఎర్రబడడం లాంటి లక్షణాలు ఉండవు. లోలోపలే చూపు తగ్గడం మొదలై కంటి చుట్టు పక్కల నుంచి చూపు తగ్గుతూ వచ్చిన తరువాత బాధితులు తమను సంప్రదిస్తున్నారని సర్వజన ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి, పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గుర్తించిన కేసులను అనంతపురం సర్వజన ఆసుపత్రికి పంపుతున్నారు. ఇక్కడ వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

**ఈ లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాల్సిందే..**

40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలి. తరచూ కంటి అద్దాలు మార్చాల్సి రావటం.. ఏదైనా లైట్ చుట్టూ వలయాలుగా కనపడటం.. చూపు మసకబారటం.. తలనొప్పి వంటి లక్షణాలుంటే తప్పక నీటికాసుల వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వంశపారంపర్యంగా ఈ వ్యాధితో బాధపడే వారి కుటుంబ సభ్యులు కచ్చితంగా పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. అధిక మోతాదులో స్టెరాయిడ్స్ వాడటం వల్ల ఈ వ్యాధి వస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు.

**ఆధునిక చికిత్సలు**

గ్లకోమా వ్యాధికి సంబంధించి గోనియోస్కోపి, ఐవోపీమెజర్‌మెంట్, విజువల్ ఫీల్స్ తదితర నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉచితంగా చేస్తున్నాం. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ఆధునిక లేజర్ చికిత్సలు అందించటంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నాం. డాక్టర్ వె.ఎం.ఎస్.ప్రసాద్, కంటి వైద్య విభాగం, ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, అనంతపురం

**ప్రజల్లో అవగాహన లేకనే..**

గ్లకోమాపై ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల అంధత్వం బారిన పడుతున్నారు. 40 ఏళ్లు పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకోవడం మంచిది. కంటిచూపు తగ్గినప్పుడు వెంటనే కంటి పరీక్షలు చేయించుకుంటే నీటికాసుల వ్యాధిని గుర్తించి చికిత్సలు అందించవచ్చు. గ్లకోమాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నా వంతుగా ఏటా వారం రోజులపాటు అవగాహన సదస్సులు నిర్వహించి ఉచితంగా చికిత్సలు అందిస్తున్నాను. డాక్టర్ నరసింహులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ విశ్రాంత అధికారి, ధర్మవరం

# శాశ్వత తాగునీటి పథకానికి గ్రహణం



మడకశిర : మడకశిర నగరపంచాయతీలో శాశ్వత తాగునీటి పథకం పనులు ముందుకు సాగడం లేదు. మడకశిర చెరువు నుంచి తాగునీటిని పంపింగ్ చేసే కేంద్రం ఏర్పాటు చేసి ట్యాంకుల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో 2018లో ప్రభుత్వం రూ. 64.18 కోట్లు విడుదల చేసింది. (ఏషియన్ ఇన్‌ఫ్రా ఇన్వెస్టిమెంట్ బ్యాంకు) 70శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 30శాతం నిధులు విడుదల చేశాయి. అయితే 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేయడంతో ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి చేయలేదు. ఈ పథకం పూర్తయి ఉంటే నగర పంచాయతీ పరిధిలోని 20వార్డుల్లో 6వేల ఇళ్లకు తాగునీరు సరఫరా చేసేందుకు అవకాశం ఉండేది. చెరువులో శుద్ధనీరు తయారు చేసే కేంద్రం, పక్కనే కొండ పై పంపింగ్ కేంద్రం పనులు 35శాతం చేసి ఆపేశారు. ప్రజలు ఈ పథకం ఎపుడు పూర్తి చేస్తారా అని ఆశతో ఎదురుచూస్తున్నారు.

**ఆరేళ్లవుతున్నా 20 శాతమే..**

గుత్తేదారులకు గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిపివేశారు. ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అందించడానికి 24 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా పట్టణంలో 26వేల జనాభా ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా 50లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసే విధంగా ట్యాంకుల నిర్మాణం చేయాల్సి ఉంది. ఆరేళ్లు అవుతున్నా 20శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. 2024 మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉండగా పూర్తి చేయలేకపోయారు.

**పూర్తి కాని ట్యాంకుల నిర్మాణం..**

మడకశిర చెరువు కట్టపై నీటి శుద్ధి చేసేందుకు 6ఎంఎల్‌డీ సామర్థ్యం గల ట్యాంకు నిర్మించి అక్కడి నుంచి పక్కనే ఉన్న కొండపై ఎత్తు ప్రాంతంలో పంప్‌హౌస్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి ట్యాంకుల ద్వారా కుళాయిలకు నీరు సరఫరా చేసేలా పనులు చేపట్టాల్సి ఉంది. నీటి సరఫరా కోసం 7 పెద్ద ట్యాంకులు నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో 5 లక్షల లీటర్లు ఒకటి, 3 లక్షల లీటర్లు 3, ఒకటిన్నర లక్షల లీటర్ల సామర్థ్యం గల 3 ట్యాంకులు పూర్తికావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పనులు 50శాతంకూడా పూర్తి కాలేదు.

ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందిమురళీధర్, ఏఈ, మడకశిర గతంలో ఉన్న రూ. 64కోట్ల నిధులు ప్రస్తుత ధరలకు అనుగుణంగా సరిపోవడం లేదు. ప్రస్తుతం రూ. 81కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం.

నీటి సరఫరా లక్ష్యం : 40లక్షల లీటర్లు

కుళాయిల ఏర్పాటు : 7వేలు

నిధుల మంజూరు : రూ. 64.18 కోట్లు

5ఏళ్లలో ఖర్చు : రూ. 10 కోట్లు

# బాలికా విద్యకు భరోసా




అనకాపల్లి : కస్తూర్బా విద్యాలయాలను జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించారు. విద్యార్థుల వసతి సమస్యను మాత్రం పట్టించుకోలేదు. నాడు నేడులో కొన్ని భవనాలు మంజూరు చేసినా నిధులివ్వక మధ్యలోనే నిలిచిపోయాయి. తాజాగా వాటిని పూర్తిచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. కేజీబీవీల్లో అదనపు భవనాలకు భారీగా నిధులు మంజూరు చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించి బాలికా విద్యకు భరోసానిస్తోంది.

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 39 కస్తూర్బా బాలిక విద్యాలయాలున్నాయి. దశల వారీగా వీటన్నింటినీ జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఒక్కో తరగతిలో సగటున 40 మంది విద్యార్థినులున్నారు. వీరందరికీ తగిన వసతి లేక ఇరుకు గదుల్లోనే సర్దుబాటు చేసుకునే పరిస్థితి నెలకొంది. గత అయిదేళ్లలో అదనపు భవనాలు కాదుకదా అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు కూడా చేయలేకపోయారు. ఈ పరిస్థితిని గుర్తించిన కూటమి ప్రభుత్వం బాలికల ఇబ్బందులను గట్టెక్కించేలా చర్యలు చేపట్టింది. అనకాపల్లి, అల్లూరి జిల్లాలోని 29 కేజీబీవీల్లో అదనపు భవనాల కోసం రూ. 46.4 కోట్లకు పైగా కేటాయించింది. ఒక్కో విద్యాలయానికి సగటున రూ. 1.6 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం టెండర్లు జరుగుతున్నాయి. ప్రతి పాఠశాలలో 6 డార్మెటరీ గదులు, రెండేసి మరుగుదొడ్ల బ్లాక్‌లను నిర్మాణం చేయనున్నారు.

**ఏయే కేజీబీవీలకు**

అనకాపల్లి: మాకవరపాలెం, కశింకోట, కోటవురట్ల, నాతవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, అచ్యుతాపురం, మాడుగుల, ఎస్.రాయవరం, రావికమతం, రోలుగుంట, దేవరాపల్లి, నర్సీపట్నం.

అల్లూరి: గంగవరం, ఎటపాక, కూనవరం, మారేడుమిల్లి, కొయ్యూరు, జి.కె.వీధి, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, డుంబ్రిగుడ, పెదబయలు, చింతపల్లి, అడ్డతీగల, హుకుంపేట

**రూ. 9.5 కోట్లతో మౌలిక సదుపాయాలు**

అదనపు భవనాలు నిర్మిస్తూనే ఇతర మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం నిధులు ఖర్చుచేస్తున్నారు. ఒక్కో కేజీబీవీలో రూ. 18.5 లక్షలతో కంప్యూటర్ గది, రూ. 23.10 లక్షలతో గ్రంథాలయం, రూ. 18.5 లక్షలతో ఆర్ట్, క్రాఫ్ట్ రూమ్‌తో పాటు మేజర్, మైనర్ రిపేర్లు, రక్షణ గోడలను నిర్మిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో రూ. 7.75 కోట్లు, అల్లూరి జిల్లాలో 1.5 కోట్లు వీటి కోసం వెచ్చిస్తున్నారు.

**సమస్యలన్నీ పరిష్కారం..**

కస్తూర్బా పాఠశాలలకు ప్రభుత్వం భారీగా నిధులిచ్చింది. వీటితో వచ్చే విద్యాసంవత్సరంలోగా అదనపు భవనాలు అందుబాటులోకి తెచ్చి వసతి సమస్య పరిష్కరించేలా చూస్తాం. కంప్యూటర్, లైబ్రరీలకు డబ్బులు ఇచ్చారు. వీటితో నాణ్యమైన విద్యను అందించడానికి అవకాశం ఉంటుంది. డా. స్వామినాయుడు, ఏపీసీ, సమగ్ర శిక్ష, అల్లూరి జిల్లా

# ప్రకాశానికి సౌరశక్తి

తాళ్లూరు : ప్రకాశం.. ఓ వెనుకబడిన ప్రాంతం. ప్రభుత్వ భూములు విస్తారం. సద్వినియోగం చేసుకుంటే వనరులూ పుష్కలం. పాలకుల దూరదృష్టి లోపమే ఓ శాపం. ఈ పరిస్థితులను అధిగమించేలా 2014-19 కాలంలో తెదేపా ప్రభుత్వం పరిశ్రమలు, సౌర పార్కుల ఏర్పాటుకు కొన్ని అడుగులేసింది. ఆ తర్వాత అధికారంలోకి వైకాపా వాటన్నింటినీ అయిదేళ్లపాటు మూలకు నెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిరిగి వనరుల సద్వినియోగం.. అభివృద్ధి మరింత ఊపందుకునేందుకు అవసరమైన చర్యలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా జిల్లా ప్రకాశానికి మరింత సౌర శక్తిని ఇవ్వాలనే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. దొనకొండ మండలంలోని రుద్రసముద్రం, కనిగిరి నియోజకవర్గం సీఎస్‌పురం ప్రాంతాల్లో సౌర పార్కులను ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విద్యుత్తు శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం శాసనసభలో ఈ మేరకు ప్రకటించారు. వంద గిగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తికి వీలుగా నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. దీంతో జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**అవకాశాలకు తెరుచుకుంటున్న తలుపులు:** ఒక్కో సోలార్ పార్క్ ఏర్పాటుకు సుమారు 5,500 ఎకరాల వరకు భూములు అవసరం. దొనకొండ మండలంలో ప్రభుత్వ భూములు సుమారు 25,063 ఎకరాలున్నాయి. రుద్రసుముద్రం పరిసర ప్రాంతాల్లోనే సుమారు 5,700 ఎకరాల వరకు లభ్యమవుతాయి. సీఎస్‌పురం మండలం



పెదగోగులపల్లి, ముసునూరు పరిసరాల్లోనూ అయిదు వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములున్నాయి. సాధారణంగా ఒక పరిశ్రమ ఏర్పాటైతే చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలొస్తాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో చిన్నాచితకా వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. అభివృద్ధి వేగవంతమవుతుంది. ఆయా చోట్ల భారీ పెట్టుబడులతో సోలార్ పార్కులు ఏర్పాటైతే జిల్లాకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ దిశగా మంత్రి అసెంబ్లీలో ప్రకటన చేయడంపై జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**అల్లినగరంలో భూముల పరిశీలన**

సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం అల్లినగరం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను తహసీల్దార్ డి.భాగ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 523లోని 6.70 ఎకరాల ప్రభుత్వ భూములను మండల సర్వేయర్ సిలార్ ఖాన్, వీఆర్వో రమణయ్య, సర్వేయర్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి ఆమె సందర్శించారు. దస్త్రాలు పరిశీలించారు. నివేదికను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

# ఎత్తిపోతల రాగి ఎత్తుకెళ్లారు..!

ఆమదాలవలస : జిల్లాలో ఎత్తిపోతల పథకాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు ఉపకేంద్రాల్లోని నియంత్రికలకు సంబంధించిన రాగి, ఇతర పరికరాలు చోరీకి గురవుతున్నాయి. వరుస ఘటనల నేపథ్యంలో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారుతోంది. సబ్‌స్టేషన్లు పని చేయకపోవడంతో పథకాల ద్వారా సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ కాపలా ఉండదని తెలిసి చోరీలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అచ్చెన్న చొరవతో ఏర్పాటు..**

టెక్కలి, కోటబొమ్మాళి, చిన్నసాన, మదనగోపాలపురం, సుభద్రాపురం, తొగిరి, టెక్కలిపాడు ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాల ఉపకేంద్రాల నియంత్రికల్లోని కాపర్, ఆయిల్ గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఖరీఫ్ సాగుకు ఇబ్బంది లేకుండా సాగునీరు సరఫరా చేయడానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ తీసుకుని సుమారు రూ. 80 లక్షలు మంజూరు చేయించారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు కొత్త



సామగ్రి ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ ఈసర్లపేట వద్ద బొడ్డేపల్లి రాజగోపాలరావు అక్కులపేట ఎత్తిపోతల పథకం సబ్‌స్టేషన్‌లోని నియంత్రికలో గుర్తు తెలియని వ్యక్తులు కాపర్, ఆయిల్ కాజేశారు. మంగళవారం సర్పంచి బొడ్డేపల్లి గౌరీపతిరావు, రైతులు పథకాన్ని పరిశీలించడానికి వెళ్లారు. ఉపకేంద్రం చుట్టూ కంచె తొలగించి ఉండటంతో విద్యుత్తు శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి తనిఖీ చేశారు. చోరీకి గురైన సామగ్రి విలువ రూ. 10 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. సర్పంచి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బాలరాజు చెప్పారు. కోటబొమ్మాళి మండలం నారాయణపురం, జలుమూరు మండలం రామచంద్రాపురం, నౌతళ ఎత్తిపోతల పథకాల ఉపకేంద్రాల్లోనూ గతంలో ఈ తరహా చోరీలు జరిగాయి. పథకాలు పని చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**నిధులు మంజూరు చేయిస్తాం..**

– కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

ఆమదాలవలస మండలం అక్కులపేట బొడ్డేపల్లి రాజగోపాలరావు ఎత్తిపోతల పథకం గత ఐదేళ్లు సక్రమంగా పని చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. రూ. 5 లక్షలు మంజూరు చేయడంతో మరమ్మతులు చేపట్టి ఖరీఫ్‌లో సాగునీరు అందించాం. ఉపకేంద్రం నియంత్రికలో సామగ్రి చోరీకి గురవడంతో ఖరీఫ్‌లో నీరందించాలంటే రూ. 10 లక్షలు అవసరమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తాం.

**చోరులను పట్టుకుంటాం..**

– వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల నియంత్రికల్లో సామగ్రి చోరీలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. చోరులను పట్టుకునేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. గతంలో పలువురిని అరెస్టు చేశాం. చోరీలు జరగకుండా నిఘా పెడతాం.

# 'బైబై' జూస్

చిత్తూరు : మేనమామని.. అన్నీ చూసుకుంటా అంటూ నాటి వైకాపా ప్రభుత్వ అధినేత జగన్ పలికిన బీరాలు నేతిబీర చందం లా మారాయి.. నాటి పాలకుల అనాలోచిత నిర్ణయాలు, అంతకుమించి నిర్లక్ష్యం విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సింది పోయి కొందరిని వ్యసనాలకు లోనయ్యేలా చేసింది.. నానా హడావుడి చేసి బైజూస్ సాంకేతిక పరిజ్ఞానం పేరిట అందించిన ట్యాబులకు నేడు బైబై చెప్పాల్సి వచ్చింది.. ఆ సాంకేతికత నేడు పూర్తిగా కనుమరుగైంది. వైకాపా హయాంలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు బైజూస్ ట్యాబ్‌లను ఉచితంగా అందజేశారు. అరకొర



పాఠ్యాంశాలను అర్థాంతరంగా అందులో అప్‌లోడ్ చేశారు.

**అరకొర కంటెంట్..** బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నా అన్ని సబ్జెక్టులను ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయకపోవడం, చేసిన సబ్జెక్టుల్లో కొన్ని పాఠ్యాంశాలను పొందుపరచక పోవడం, నమోదు చేసిన పాఠ్యాంశం పూర్తి స్థాయిలో లేకపోవడం విద్యార్థులకు అశనిపాతంగా పరిణమించింది. ఫలితంగా అరకొర బోధనే సాగింది. పాఠ్యాంశాలు కూడా విపులంగా వివరించకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉన్న కంటెంట్ కూడా ఓ దశలో ఓపెన్ కాకపోవడంతో నానా తిప్పలు పడ్డారు.

**ట్యాబ్‌తో ఆటలు..**

పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థులు పుస్తకాలను పక్కన పడేసి వీటితో ఆడుకోవడం అలవాటుగా మారింది. ఆన్‌లైన్ గేమ్స్ డౌన్‌లోడ్ చేసుకుని ఆడటమే కాక డబ్బులు పెట్టి ఆడటం.. ఇలా ఎంతో విలువైన సమయాన్ని వీటితో దుర్వినియోగం చేసుకుంటున్నారు. నాడు మొదలుగా వీటిని పొందిన విద్యార్థులే ఈ నెల 17 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు.

# విలీనం..సేవలు ఘనం

చిత్తూరు : సచివాలయాల సేవల్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హేతుబద్ధీకరణకు నిర్ణయించింది. ఇందులో భాగంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించనున్నారు. ఈ మేరకు విధివిధానాలు రూపొందించాలని పాలనా విభాగం, మండల పరిషత్తులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది.

గ్రామ సచివాలయాల్లో 11 మంది, పురపాలక/నగర పాలక పరిధిలో తొమ్మిది మంది చొప్పున సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం వీరిని పలు విభాగాలుగా విభజించనున్నారు. బహుళార్థక విభాగంలో నాలుగు కేటగిరీల ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ సహాయకులు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఉంటారు. సర్వే పనులు వీరు నిర్వహిస్తారు. ఇతర సేవలు క్లస్టర్ స్థాయిలో అందిస్తారు. సాంకేతిక విభాగంలో వ్యవసాయ, ఉద్యాన, ఇంజినీరింగ్, ఆరోగ్య, పశు సంవర్ధక, విద్యుత్తు సహాయకులు సర్వేయర్లు ఉంటారు. ఆస్పిరేషన్, ఇన్స్పిరేషన్ టెక్నాలజీలో ప్రవేశం ఉన్న ఉద్యోగులను




గుర్తించి ఈ విభాగంలో చేర్చనున్నారు. వీరిని ఐటీ అవసరాలకు వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రెవెన్యూ విభాగంలో వీఆర్‌వోలు, సర్వేయర్లు ఉంటారు. మహిళా పోలీసులను ఐసీడీఎస్, పోలీస్ స్టేషన్లలో నియమిస్తారు.

సచివాలయాలు :612

ప్రతిపాదిత క్లస్టర్లు: 310

ఉద్యోగులు : 4,432 మంది

**మండల అధికారుల పర్యవేక్షణలో..**

ప్రతి మండలంలో సమీపంలోని సచివాలయాలను క్లస్టర్లుగా పరిగణిస్తారు. సచివాలయాలు సరి సంఖ్యలో ఉంటే సగం క్లస్టర్లు ఏర్పాటవుతాయి. బేసి సంఖ్యలో ఉంటే ఒక క్లస్టరు పరిధిలోకి మూడు సచివాలయాలు తీసుకొస్తారు. బహుళార్థక విభాగంలో జనాభా ప్రాతిపదికన, సాంకేతిక విభాగంలో క్లస్టరు పరిధిలో ఉద్యోగులను గుర్తిస్తారు. వీరు రెండేసి సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంటుంది.

# యువతకు 'సౌర'భం

నాయుడుపేట : ప్రీమియర్ ఎనర్జీ సంస్థ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆహ్వానం మేరకు మేనకూరు పారిశ్రామికవాడలో రూ.1,700 కోట్లతో సౌర ప్లాంటు ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. ఇందుకు 169 ఎకరాలు కేటాయించారు. ఈ ప్లాంటు ద్వారా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు వేల మంది ఇంజినీరింగ్ యువతకు ఉపాధి లభించనుంది.

నాలుగు గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమలో సౌర సెల్, మాడ్యూల్ తయారీకి అవసరమైన సిలికా ఇసుక, కార్బన్ వంటి ముడి సరకులు కూడా దగ్గరగా ఉండటం మేనకూరు ప్రాంతంలో ప్రీమియర్ ఎనర్జీ ప్లాంటుకు అనుకూలంగా మారింది.సౌర ప్లాంటు పరిశ్రమలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, మెకానిక్ ఇంజినీరింగ్ విభాగాల్లో బీటెక్, డిప్లొమా, ఐఐటీ కోర్సులు పూర్తి చేసిన యువతకు రెండు వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది.గృహ, వాణిజ్య పరిశ్రమల్లో 60 శాతం వరకు సౌర విద్యుత్తును వినియోగించి.. మిగిలిన 40 శాతం థర్మల్ పవర్ వినియోగించే సంకల్పంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతులకు చెందిన బీడు భూములు, ఇతర భవనాలు పరిశ్రమల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల ద్వారా సౌర పలకలు ఏర్పాటుకు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లోనూ సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచాలని ప్రభుత్వం యత్నిస్తోంది.

వచ్చే ఏడాది జూన్ నాటికి ఉత్పత్తులు ప్రారంభించే అవకాశం ఉంది. మేనకూరు పారిశ్రామిక వాడలో గ్రీన్‌టెక్, టీవీఎస్ ఆటో మొబైల్స్ కంపెనీలు ఉండగా ఎలక్ట్రికల్ రంగంలో ప్రైమ్ ఎలక్ట్రికల్ కంపెనీ ఉంది. తాజాగా సౌర ప్లాంటు ద్వారా ఎలక్ట్రానిక్ పరిశ్రమ కూడా ఏర్పాటు కానుంది.

# చదువు సంతకెళ్తోంది..!



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వం బైజూస్ కంటెంట్ పేరుతో పంపిణీ చేసిన ట్యాబులు దుర్వినియోగం కారణంగా విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన యాప్‌లతోపాటు సినిమాలు, ఆన్‌లైన్ గేమ్స్ ఆడే అప్లికేషన్లను వాడుతూ కొందరు విద్యార్థులు చదువును పూర్తిగా పక్కనపెట్టి రోజంతా ట్యాబుల్లోనే మునిగిపోతున్నారు. పాఠశాలల్లో విరామ సమయాల్లో, ఇంటి వద్ద సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల మధ్యలో వినోద కార్యక్రమాలు చూస్తూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. రెండేళ్ల కిందట ట్యాబులు తీసుకున్న 8వ తరగతి విద్యార్థులు ప్రస్తుతం 10వ తరగతిలో ఉన్నారు. వాటి కారణంగా పరీక్షలపై దృష్టి పెట్టకుండా కాలక్షేపం చేస్తుండటంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అలవాటు పడిపోతున్నారు**

గత వైకాపా ప్రభుత్వం 2022లో ఉమ్మడి జిల్లాలోని 8, 9, 10 తరగతులకు చెందిన 82 వేల మంది విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఒక్కో ట్యాబుకు రూ.12,800తోపాటు బైజూస్ కంటెంట్‌కు రూ.20వేల వరకు వెచ్చించారు. ట్యాబులో 'ఏపీ ఈ-పాఠశాల', బైజూస్ ప్రీమియం, డ్యూలింగో, థింక్ అండ్ లెర్న్ వంటి యాప్‌ల ద్వారా విద్యార్థులకు కంటెంట్ అందించేవారు. మిగతా యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకుండా రక్షణ కల్పించినట్లు అప్పట్లో ప్రభుత్వం పేర్కొంది. సాఫ్ట్‌వేర్‌లో లోపాల కారణంగా సాంకేతిక పరిజ్ఞానం ఉన్న విద్యార్థులు స్వయంగా ట్యాబ్‌లో రీసెట్ చేసుకున్నారు. మరికొందరు మొబైల్ సెంటర్ల వద్దకు వెళ్లి రక్షణ వ్యవస్థను తొలగించుకున్నారు. ఇంటి వద్ద తల్లిదండుల వైఫైతో అనుసంధానం చేసుకుని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తోపాటు వివిధ రకాల ఆటలను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకుంటున్నారు. కొంతమంది అంతర్జాలంలోని అశ్లీల కంటెంట్‌కు ఆకర్షితులైనట్లు ఉపాధ్యాయులు గుర్తించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల నుంచి ట్యాబులు తీసుకుని వినోద యాప్‌లను తొలగించి తిరిగి ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి.

**రీల్స్ చూస్తూ సమయం వృథా..**

లాకింగ్ వ్యవస్థలో లోపాల కారణంగా విద్యార్థులు ట్యాబుల్లో వినోద యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని చూస్తున్నారు. తమ పిల్లలు ఎక్కువగా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తూ సమయాన్ని వృథా చేసుకుంటున్నట్లు కొందరు తల్లిదండ్రులు పేర్కొన్నారు. పాఠశాలల్లోనూ విరామ సమయాల్లో ఆటలు ఆడుకోకుండా గుంపులుగా చేరి ట్యాబుల్లో వినోద కార్యక్రమాలను వీక్షిస్తున్నారు. వీటి ద్వారా తెలివితేటలు పెంచుకోవడం మాట అటుంచితే.. చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ట్యాబ్‌ల వల్ల విద్యార్థులు పెడదోవ పట్టకుండా కట్టడి చేసే బాధ్యతను ఉపాధ్యాయులతోపాటు ప్రభుత్వం కూడా తీసుకోవాలని కోరుతున్నారు. లాకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఇవ్వాలని సూచిస్తున్నారు. లేదంటే మంచి కంటే చెడే ఎక్కువ జరిగే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**దుర్వినియోగం చేస్తున్నారు** దబ్బల శ్రీరాములు, విద్యార్థి తండ్రి, దామాజిపల్లి ట్యాబ్‌లు విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న సమయంలో చాటుగా వాటితో కాలక్షేపం చేస్తున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, జనరల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు ప్రభుత్వం వీటిని అందిస్తే దుర్వినియోగం చేస్తున్నారు. ఇతర విద్యార్థులు సైతం వాటికి ఆకర్షితులవుతూ చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి.

# డీసీఎంఎస్ దుకాణాల్లో బినామీల దందా




అనంతపురం : సొమ్ము ఒకరిది....సోకు మరొకరిది.. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)కి అతికినట్లు సరిపోతుంది. సొసైటీ ప్రధాన కార్యాలయం ముందు నిబంధనలకు విరుద్ధంగా బినామీ పేర్లపై నిర్మించిన దుకాణ సముదాయంపై జిల్లా సహకార శాఖ అధికారుల ఆరా తీస్తున్నారు. వైకాపా హయాంలోనే వాటిని నిర్మించారు. డీసీఎంఎస్ గత పాలకవర్గ హయాంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేయడానికి ఏ అధికారి సాహసం చేయలేకపోయారు. గతంలో ఓ అధికారి ప్రయత్నం చేయగానే వెంటనే బదిలీ చేయించడంతో తర్వాత వచ్చిన వారూ కాలయాపన చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 8 నెలలు గడిచినా బినామీల దందాను బయటపెట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. లక్షలాది రూపాయలు సొసైటీ ఆదాయానికి గండిపడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దుకాణాల నిర్మాణం, అద్దె నిర్ణయం అంతా నిబంధనలు తుంగలో తొక్కేశారు. అసలు నిర్మాణాలే చేపట్టరాదని సహకార శాఖ అధికారులు ఆదేశాలిచ్చినా బేఖాతరు చేశారు. అనంత నగరం నడిబొడ్డున ప్రైవేటు వ్యక్తులు సొంత పెట్టుబడితో నిర్మించి అద్దెకు ఇచ్చుకున్నారు. డీసీఎంఎస్‌కు రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారు.

**నిబంధనలకు పాతర...**

సహకార సొసైటీలో ఏ నిర్మాణం చేపట్టాలన్నా ఆ శాఖ రిజిస్ట్రార్ అనుమతి తప్పనిసరి. డీసీఎంఎస్‌లో నిర్మించిన 14 దుకాణాలకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ప్రైవేటు వ్యక్తుల ద్వారా డిపాజిట్లు సేకరించి నిర్మాణాలు చేపట్టారు. సహకార చట్టానికి పూర్తిగా విరుద్ధమని అప్పట్లో అధికారులే అన్నారు. నిర్మాణం పూర్తి చేయడం ఒక ఎత్తయితే.....అద్దె నిర్ణయంలోనూ ప్రైవేటు వ్యక్తులే పెత్తనం చెలాయించారు. నిర్మాణానికి వారు ఖర్చు పెట్టిన మొత్తం అడ్వాన్సు రూపంలో లాగేసుకున్నారు. ఇదంతా లోగుట్టుగానే సాగిపోతోంది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన దుకాణాలు: 14

అద్దెకు ఇచ్చింది: ఏప్రిల్, 2021

డీసీఎంఎస్‌కు చెల్లిస్తున్న (ఒక్కో దుకాణానికి)అద్దె : రూ.4,500

గుత్తేదారు రాబట్టేది: రూ.10వేలు

అడ్వాన్సుగా వసూలు చేసింది: రూ.15 లక్షలు

**విచారణ చేయిస్తాం..**

అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారిణి

డీసీఎంఎస్ ఆవరణలో అక్రమంగా నిర్మించిన దుకాణాలపై ఆరా తీస్తున్నాం. ఆరోపణలు రాయడంతో సమగ్ర విచారణ చేయాలని నిర్ణయించాం. నిర్మాణ అనుమతులు, అద్దె, గుత్తేదారులు ఎవరన్న దానిపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం.

# ఎట్టకేలకు హుద్‌హుద్ గృహాలకు మోక్షం



కొమ్మాది : హుద్‌హుద్ తుపానులో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకొనేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం 'ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం' పేరిట ప్రత్యేక నిధులు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకొంది. గత వైకాపా పాలనలో అవేవీ పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. టెండర్లు పిలిచి రూ.8 కోట్లు నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది.

'ప్రీ-ఫ్యాబ్రికేటెడ్' సాంకేతిక పరిజ్ఞానంతో గ్రౌండ్+3 తరహాలో కొమ్మాది సర్వే సంఖ్య 83లో 19 బ్లాకుల్లో 608 గృహాలు, పరదేశిపాలెం సర్వే సంఖ్య 21లో 6 బ్లాకుల్లో 192 గృహాలను హుద్‌హుద్ బాధితులకు పునరావాసం కింద తెదేపా ప్రభుత్వం ప్రారంభించింది. ఆపై వైకాపా హయాంలో ఆయా గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టలేదు. కొన్ని బ్లాకులకు కిటికీలు, గుమ్మాలు అమర్చినా అవి తుప్పుపట్టిపోయాయి. తలుపులు సైతం చెదపట్టాయి. సింటెక్స్ ట్యాంక్‌లు ఎగిరిపోయాయి. మెట్ల మార్గాలు ధ్వంసమయ్యాయి. స్విచ్ బోర్డులు, పైపులు తస్కరణకు గురయ్యాయి.

ఈ ప్రాజెక్టులను తొలుత పొందే ఇన్‌ఫ్రాకాన్ సంస్థకు కేటాయించగా నిబంధనల మేరకు అన్ని పనులు పూర్తిచేయక పోవడంతో ఆ కాంట్రాక్టును ప్రభుత్వం రద్దు చేసింది. మరో సంస్థ సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్‌కు పనులు అప్పగించింది. ఆ సంస్థ సైతం తాత్సారం చేయడంతో రద్దు చేసింది. తాజాగా మరోసారి టెండర్లు పిలిచి టి.వై.నాయుడు అండ్ కో సంస్థకు పనులు కేటాయించింది.

ఒక్కోటి చక్కదిద్దుతూ.. ఆయా గృహ సముదాయాల్లో కిటికీలు, గుమ్మాలు అమర్చుతున్నారు. ధ్వంసమైన మెట్ల మార్గాల్ని చక్కదిద్దుతున్నారు. రంగులు వేస్తూ ప్లంబింగ్, యూజీడీ పనులు చేపడుతున్నారు. అంతర్గత రహదారులతో పాటు కాలువలు నిర్మిస్తున్నారు. లబ్ధిదారుల సొంతింటి కల నెరవేర్చేందుకు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

# అప్రమత్తం కాకుంటే అంతే!

తిరుపతి : ఎండల ప్రభావం పెరగడంతో విద్యుత్తు డిమాండ్ అధికమై సరఫరాలో అంతరాయాలు హెచ్చుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆసుపత్రుల్లో అత్యవసర ఏర్పాట్లు చేసుకోవాలి.. వాటి నిర్వహణపై శ్రద్ధ పెట్టాలి. తిరుపతి రుయా ప్రభుత్వాసుపత్రిలో ఈ విషయం నిర్లక్ష్యం వెంటాడుతోంది. తరచూ జనరేటర్ మొరాయించడం పరిపాటిగా మారింది. వెంటిలేటర్‌పై ఉన్న విలువైన ప్రాణాలను సంరక్షించుకోవాలంటే యూపీఎస్ బ్యాకప్ సామర్థ్యం మరింతగా పెంచుకోవాల్సి ఉంది. రుయాకు ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. 500 కేవీ మూడు, 350 కేవీ సామర్థ్యం ఉన్న విద్యుత్తు నియంత్రికలున్నాయి. వాటి ద్వారా 1,260 పడకల సామర్థ్యం ఉన్న ఐపీ వార్డులు.. ఓపీ, వైద్య పరికరాలకు విద్యుత్తు సరఫరా అందిస్తున్నారు. ఇటీవల అక్యూట్ కేర్ సెంటర్, జీరియాట్రిక్ వార్డు, సిటీ డయాగ్నోస్టిక్ భవనం అందుబాటులోకి విద్యుత్తు అవసరాలు పెరిగాయి. ఈ క్రమంలో వేసవిలో విద్యుత్తు అంతరాయాలు పెరిగే అవకాశం ఉండటంతో మరో వెయ్యి కేవీ సామర్థ్య విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేయాలి. అకస్మాత్తుగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే జనరేటర్లు వెంటనే స్టార్ట్ అయ్యేలా నిర్వహణ పనులు చేయాలి. బాధ్యత లేనట్లుగా ప్రవర్తించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.



**నిత్యం వెంటిలేటర్‌పై వంద మంది**

రుయాలో సుమారు వంద మంది రోగులు వెంటిలేటర్‌పై ఉంటారు. అత్యవసర విభాగంలోని ఆర్ఐసీయూ, ఐడీహెచ్, ప్రధాన భవనంలో సుమారు 50 వెంటిలేటర్ పడకలు ఉన్నాయి. చిన్నపిల్లల విభాగంలో పీఐఎస్‌యూ, ఎన్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ వార్డులో సుమారు 60 వెంటిలేటర్ పడకల్లో రోగులు ఉన్నారు. ఆక్సిజన్ సరఫరాకు అవసరమైన విద్యుత్తు అకస్మాత్తుగా ఆగిపోతే.. యూపీఎస్‌ల ద్వారా విద్యుత్తు సరఫరా అవుతుంది. 20 కేవీ యూపీఎస్‌లు క్యాజువాలిటీ, పీడియాట్రిక్ విభాగాల్లో ఉన్నా బ్యాకప్ సామర్థ్యం తక్కువగా ఉంది. ప్రస్తుత బ్యాకప్‌ల సామర్థ్యం గంటపాటు సరఫరాకు సరిపోదని సమాచారం.అధికారులు మాత్రం రెండు గంటలు బ్యాకప్ వస్తోందని చెబుతున్నారు. పెరిగిన పడకలకు తగ్గట్టుగా బ్యాకప్ సామర్థ్యం పెంచాల్సి ఉంది.

# 'అమృత్'ధారలు

డోన్ : డోన్ పురపాలికలో మంచినీటి కష్టాలు తీరనున్నాయి.. పట్టణానికి అమృత్ 2.0 పథకం కింద ఎంపిక చేశారు. మున్సిపల్ అధికారులు నివేదిక రూపొందించారు. ఇందుకు ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ విభాగం ఆమోద ముద్ర వేసింది. సాంకేతిక అనుమతులు రాగానే ప్రజారోగ్యశాఖ టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

**తీరనున్న కష్టాలు**

రైతుమిత్ర కాలనీ, కృష్ణానగర్, పాతపేట శివారు వీధులు, శ్రీనివాసనగర్, ఆటోనగర్, కొత్త ఇందిరానగర్, సుజాతమ్మనగర్, విజయభాస్కరరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు నోచుకోలేదు. ఈ ప్రాంతాల్లో త్వరితగతిన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



**చేపట్టనున్న పనులు**

అమృత్ 2.0 పథకం కింద రూ.23.56 కోట్లు మంజూరయ్యాయి. పాతపేటలో రూ.1.90 కోట్లతో నీటి ట్యాంకు, కొండపేటలో రూ.2.25కోట్లతో నీటి ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అవసరమున్న ప్రాంతాల్లో రూ.9.94 కోట్లతో 40కి.మీ. మేర పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. రూ.1.50 కోట్లతో నీటి పంపింగ్ లైన్, 600 కుళాయి కనెక్షన్ల కోసం రూ.12 లక్షలు, పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న శుద్ధినీటి ప్లాంటు ప్రాంగణంలో రూ.1.22కోట్లతో 4.80 కేఎల్ సామర్థ్యమున్న రెండు ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

**త్వరలోనే పనులు ప్రారంభం - సురేష్, మున్సిపల్ ఏఈ, డోన్**

అమృత్ పథకం నిధులతో నీటి ట్యాంకులు, నీటి గొట్టాలు లేని ప్రాంతాలతో పాటు విస్తరించిన కాలనీల్లోనూ నీటి గొట్టాలను ఏర్పాటు చేయనున్నారు. డీపీఆర్ అనుమతులు వచ్చిన నేపథ్యంలో సాంకేతిక అనుమతులకు నివేదించాం. అనుమతులు రాగేనే ప్రజారోగ్యశాఖ వారికి అప్పగిస్తాం. వారు టెండర్లు పిలిచి అభివృద్ధి పనులు చేపడతారు.

# వందేళ్ల భవంతికి పూర్వ వైభవం

ఏలూరు : కన్నతల్లిని, జన్మభూమిని మర్చిపోకూడదని..ఏలూరు గ్రామీణ పరిధిలోని స్వగ్రామం చాటపర్రులో తన వందేళ్ల ఇంటిని ఆధునికీకరించి పూర్వీకుల జ్ఞాపకాలను పదిలం చేశారు సినీ నటుడు మురళీమోహన్. మంగళవారం కుటుంబ సమేతంగా గృహ ప్రవేశం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అద్భుత నిర్మాణం.. ఇందిరా విలాసం.. 1925లో మురళీమోహన్ తాతయ్య, నానమ్మ చాటపర్రులో 18 అంగుళాల మందం గోడలతో కేవలం సున్నంతో ఇంటి నిర్మాణం చేపట్టారు. కిటికీలు, తలుపులు, సింహద్వారం తలుపులు ప్రత్యేకమైన కలపతో ఏర్పాటు చేశారు. వందేళ్లయినా ఇంటి గోడలు చెక్కు చెదరలేదంటే నిర్మాణ నాణ్యత స్పష్టమవుతోంది. నిర్మాణానికి వినియోగించిన ఇనుము మొదలు ఇతర వస్తువులను విదేశాల నుంచి రప్పించారు. అప్పట్లో దీనికి ఇందిరా విలాసం అని పేరుపెట్టారు. ఈ గృహంలోనే మురళీమోహన్ పుట్టి పెరిగారు. దీంతో ఆయనతో పాటు పూర్వీకుల అనుభూతులు భద్రపరిచేందుకు పాత నిర్మాణ ఛాయలు..ఆకృతులు ఏమీ మార్చకుండా ఖర్చుకు వెనుకాడకుండా మూడేళ్ల పాటు నిర్మాణం చేశారు.ప్రజాసేవ కోసమే.. మురళీమోహన్ తన తల్లిదండ్రుల మరణానంతరం..పరిసర ప్రజల అవసరాల కోసం ఆసుపత్రి నిర్వహణ కోసం ఇచ్చారు. కొంత కాలానికి భవనం శిథిలావస్థకు చేరడంతో ఆసుపత్రిని మరోచోటికి మార్చారు. ప్రస్తుతం ఇంటి పనులు పూర్తి అయిన నేపథ్యంలో ప్రజలకు ఉపయోగపడేందుకు ఇంటిని కేటాయిస్తానంటూ మురళీమోహన్ ప్రకటించారు. ఏఐ వంటి కొత్త సాంకేతికతను విద్యార్థులకు చేరువ చేసేందుకు భవనంలో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

చురకలు



# పారిశ్రామిక శిక్ష

డోన్ : కిక్కిరిసిన గదుల్లో శిక్షణ.. పాతకాలపు యంత్రాలు.. సరిపడా శిక్షణాధికారుల్లేరు.. పేదవర్గాల వారి ఉపాధికి భరోసాగా నిలిచిన పారిశ్రామిక శిక్షణ సంస్థల (ఐటీఐ)లో అసౌకర్యాలు యువతకు 'శిక్ష'లా మారాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలెక్కువ.. వాటిలో కొలువుదీరాలంటే ఐటీఐ పూర్తి చేయాలి. పదో తరగతి పూర్తి చేసిన కొందరు విద్యార్థులు అటువైపు అడుగులేస్తున్నారు. నంద్యాల, ఆలూరు, అవుకు పట్టణాల్లో ఐటీఐలకు సొంత భవనాలు లేవు. ప్రైవేట్ షెడ్డులో 176 మందికి శిక్షణ కల్పిస్తున్నారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ఐటీఐలను పట్టించుకోలేదు.. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.

**వీటిని ప్రారంభించాలి మరి**

బేతంచెర్లలో 150 మంది శిక్షణ పొందుతున్నారు. గోరుమానుకొండలో 5.50 ఎకరాల విస్తీర్ణంలో రూ.4.50 కోట్లు వెచ్చించి కొత్త భవనం నిర్మిస్తున్నారు. విద్యుత్తు, నీటి సరఫరా, మరుగుదొడ్లు, ల్యాబొరేటరీ, పెయింటింగ్ తదితర పనులు నిధుల్లేక ఆగిపోయాయి. డోన్ ప్రభుత్వ ఐటీఐలో 480 మంది చదువుకుంటున్నారు. రూ.2.40 కోట్లతో సొంతభవనం నిర్మిస్తున్నారు. మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, పెయింటింగ్, తలుపులు, నీటి ట్యాంకు పనులు పూర్తి చేయాల్సి ఉంది.



**ఐదేళ్లు పట్టించుకోని వైకాపా**

ఆలూరులో 2008లో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 240 మంది శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. రూ.7 కోట్లు వెచ్చించి సొంత భవన నిర్మాణానికి నాలుగేళ్ల కిందట రెండున్నర ఎకరాలు కేటాయించారు. నిధులు మాత్రం విడుదల కాలేదు.

అవుకు ఐటీఐ కళాశాలకు సొంత భవనం లేక బ్రిటిష్ కాలంలో సబ్‌జైలుగా వినియోగించుకున్న గదుల్లో పాఠాలు బోధిస్తున్నారు. 2008లో ఏర్పాటైన కళాశాలకు తెదేపా హయాంలో పదెకరాలు కేటాయించారు. రూ.6 కోట్లు మంజూరు చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్ విధానంతో నిధులు వెనక్కి వెళ్లాయి.ఆదోని శివారు ఆరేకల్ శివారులో తెదేపా హయాంలో 2019లో రూ.3.91 కోట్లు వెచ్చించి మైనారిటీ విద్యార్థులకు ఐటీఐ కళాశాల నిర్మించారు. తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి పట్టించుకోలేదు. ఐదేళ్లు పట్టించుకోలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించాం.. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రారంభించే అవకాశం ఉందని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సూరప్ప తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులు.. ఉపాధి కూలీలు!

నంద్యాల: ఉపాధి హామీ నిధులను పలువురు క్షేత్ర సహాయకులు బరితెగించి అక్రమంగా కాజేస్తున్నారు. నందికొట్కూరు మండలం కోళ్లబావాపురంలో క్షేత్రసహాయకురాలు భారతి ఉపాధి హామీ నిధులు పక్కదారి పట్టించారు.ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను, మరణించిన వారిని, ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని కూలీలుగా చూపి డబ్బులు తినేసినట్లు వెలుగులోకి వచ్చింది. రూ.1,49,242 పక్కదారి పట్టినట్లు తేలడంతో తాత్కాలికంగా తొలగించారు.. రూ.32,699 రికవరీ చేసి మళ్లీ పోస్టింగు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తి మొత్తాన్ని రికవరీ చేయకుండా పోస్టింగు ఇవ్వడంపై కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.కె.రాముడు ఎక్సైజ్‌శాఖలో సీఐగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన ఖాతాలో రూ.947 జమ చేశారు. ఆయన భార్య సుంకమ్మ 2023లో మృతిచెందారు. ఆమె ఖాతాలో ఉపాధి హామీ కూలీ జమచేశారు.

జి.వరలక్ష్మి ఆశా కార్యకర్తగా విధులు నిర్వరిస్తున్నారు. ఆమె ఖాతాకు రూ.3,507 చెల్లించినట్లు రాశారు. అధికారులు విచారణ చేయగా ఆశా ఉద్యోగినిగా ఉంటూనే ఉపాధిహామీ పనులకు వెళ్లినట్లు ఆమె పేర్కొన్నారు.కె.పార్థసారథి అటవీశాఖలో అతని తండ్రి స్థానంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఖాతాలో రూ.11,297 వేశారు.

కర్నూలులోని ఓ ప్రముఖ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న రామాంజనేయులు ఖాతాలో రూ.1,743, ఎరువుల సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఎం.మధుసూదన్ ఖాతాలో రూ.10,510లు, ఎం.ప్రసాద్ అనే వ్యక్తి ఖాతాలో కూడా రూ.11,323 డిపాజిట్ చేశారు.పి.కవిత మహిళ భర్త వి.ఆర్.ఒ.గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె ఖాతాలో రూ.15,943 వేశారు.

కోళ్లబావాపురానికి చెందిన.మురళిని అధికారులు విచారించగా, తాను ఉపాధి పనులు చేయలేదని, ఖాతాలో డబ్బులు వేయడానికి అంగీకరిస్తే 50 శాతం మొత్తాన్ని ఇస్తానని చెప్పారని అంగీకరించారు.. అతని ఖాతాలో రూ.10,774 జమ చేశారు.హెచ్.ఎన్.ఎస్.ఎస్. ప్రాజెక్టు వాచ్‌మెన్ సంగిరెడ్డి రాముడు ఖాతాలో రూ.7,618లు, టయోటా షోరూంలో పనిచేసే ఎన్.మధుసూదన్ వ్యక్తి ఖాతాలో రూ.10,894 పంపించారు.బి.శివకుమార్ తిరుపతి ఏపీఎస్పీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఖాతాలో రూ.6,548 జమ చేశారు.

# అవ్వా తాతలకు ఆయుష్మాన్

ఆళ్లగడ్డ : 70 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపచేయాలని ఇప్పటికే కేంద్రం ప్రకటించింది.. లబ్ధిదారుడి సామాజిక, ఆర్థికస్థితితో సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించనున్నారు. వృద్ధులు ఆర్థిక ఇబ్బందులతో పాటు, రోగాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉంటారు. వారు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఉచిత వైద్య సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ వయోవందన కార్డు'లు ఇవ్వాలని నిర్ణయించింది.

గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు జారీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ కార్డులను వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన సమాచారాన్ని సేకరించే పనిలో ఆరోగ్య శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

ఇప్పటికే దాదాపు 95 శాతం మందికి ఆయుష్మాన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం 70 ఏళ్లు నిండిన వృద్ధులను గుర్తించి ప్రత్యేకంగా ఈకేవైసీ చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హెల్త్‌కార్డుల్లోని వివరాల ఆధారంగా వృద్ధులను గుర్తించి ఏఎన్‌ఎంలు నేరుగా వారి వద్దకే వెళ్లి ఈకేవైసీ తీసుకుంటున్నారు. మొత్తం ప్రక్రియ పూర్తయిన వెంటనే అక్కడికక్కడే వృద్ధుల పేరిట హెల్త్‌కార్డు జనరేట్ అవుతుంది.

# పట్టణ ప్రణాళిక.. అవినీతి మరక




విశాఖపట్నం : జీవీఎంసీ పట్టణ ప్రణాళికకు అవినీతి మరక అంటింది. వైకాపా హయాంలో చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇందులో పట్టణ ప్రణాళిక అధికారులే సూత్రధారులని అర్థమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై ఇప్పటికీ చర్యలకు వెనుకాడుతున్నారు. అంతేనా? అక్రమార్కుల నుంచి కాసులు తీసుకుని, సలహాలిచ్చి మరీ కొమ్ముకాస్తున్నారు.

**వైకాపా అక్రమాలకు వెన్నుదన్నుగా:** వైకాపాకు కొమ్ముకాసిన కొందరు అధికారులు జీవీఎంసీలో వివిధ హోదాల్లో పనిచేసి అక్రమాలకు వెన్నుదన్నుగా నిలిచారు. నగరంలో టీడీఆర్(ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట రైట), నాలా పన్ను చెల్లింపు అక్రమాలు తాజాగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో వీరిలో కొందరు అధికారులు ప్రాధాన్యతలేని పోస్టుల్లో ఉన్నారు. ఐతే అక్రమాలకు కారణమైన బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. చిత్రమేమంటే ప్రభుత్వం మారినా, ఇంకా అదే స్థాయిలో అక్రమాలు జరుగుతుండటం, వైకాపా నాయకులకు మళ్లీ అధికారులు కొమ్ముకాస్తుండటం గమనార్హం.

**తాత్కాలికంగా నిలిపారే తప్ప రద్దు చేయరేం?:** నగరంలో వెంకటపతిరాజు నగర్‌కు రూ.30కోట్లు విలువైన టీడీఆర్‌ను గత ఏడాది జారీ చేశారు. 1926 డాక్యుమెంటు ఆధారంగా జారీ చేసిన ఆ టీడీఆర్‌ను ఏ దశలోనూ నిలిపివేయడానికి పట్టణ ప్రణాళికాధికారులు ప్రయత్నించకపోవడం విడ్డూరం. ఏఎస్ఆర్ నగర్, బిలాల్‌కాలనీ, జాలారిపేట మురికివాడలకూ యజమానులున్నారని, వారికీ టీడీఆర్‌లివ్వాలని దరఖాస్తు చేయగా, ఆయా దస్త్రాలను ఎలాంటి విచారణ లేకుండా ముందుకు ప్రణాళికాధికారులు నడిపించారు. ఆయా వ్యవహారాలను అప్పటి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ, జాలారిపేట టీడీఆర్‌లపై స్థానికంగా కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా నిలిపివేశారే తప్ప, పూర్తిగా రద్దు చేయకపోవడం విచిత్రం.

**పట్టణ ప్రణాళిక ఆదాయ వనరుగా:** నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధికి 19 సెంట్లకు టీడీఆర్ ఇవ్వడానికి ప్రణాళికాధికారులే దస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. ఆ భూమి గెడ్డకు చెందిందని, యూఎల్‌సీగా సర్వేయరు నివేదిక ఇవ్వగా, దానిని అధికారులు పక్కనపెట్టడానికి యత్నిస్తున్నారు. నగరంలో భారీ ప్రాజెక్టులు వీఎల్‌టీ లేకుండానే సాగిపోతున్నాయి. తాజాగా రూ.120కోట్ల నాలా పన్ను చెల్లించకపోయినా, ఓసీలు జారీ చేసిన విషయాలు విజిలెన్స్ విచారణలో వెలుగుచూస్తున్నాయి. ఇలాంటివాటితో జీవీఎంసీలో ప్లానింగ్ అధికారులుగా పనిచేసినవారంతా భారీగానే వెనుకేసుకుంటున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది.

**అధికారుల మద్దతు లేకుండా ఇవన్నీ జరిగాయా?:** కాకినాడలో జారీ చేసిన టీడీఆర్‌లపై ఆరోపణలుండగా, వాటిని సీబీసీఎన్‌సీ ప్రాజెక్టులో వాడిన ఉదంతంలో జీవీఎంసీలో ఓ ఉన్నతాధికారి పూర్తిగా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. వైకాపా హయాంలో రేవళ్లపాలెంలోని భూమికి రూ.209 కోట్ల టీడీఆర్ విడుదల చేసి, మళ్లీ దానిని పక్కనపెట్టగా, ప్రస్తుతం దాని విడుదలకు విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. డైమండ్‌పార్కు సమీపంలో నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణానికి ప్రణాళికాధికారులు ప్లాను మంజూరు చేయడమే కాకుండా రూ.5కోట్లు టీడీఆర్ జారీ చేయడంపై అనుమానాలున్నాయి. ఎన్‌సీసీ భూముల మీదుగా రహదారి నిర్మించి రూ.660 కోట్లు టీడీఆర్ ఇవ్వడానికి, దసపల్లా భూముల్లోనూ రహదారి వేసి టీడీఆర్ కొట్టేయడానికి జరిగిన ప్రయత్నాల వెనుక అప్పటి ప్రణాళికాధికారులు సహకరించారన్న విమర్శలున్నాయి. ఎలాంటి యాజమాన్య హక్కుల్లేని సింహాచలం బీఆర్‌టీఎస్ రహదారి బాధితులకు టీడీఆర్‌లు విడుదల చేయడంలోనూ అధికారులే కీలక పాత్ర పోషించారు. విజిలెన్స్ వెలికి తీస్తున్న అక్రమాలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే పట్టణ ప్రణాళిక గాడిలో పడుతుందన్న వాదన బలంగా వినిపిస్తోంది.

# రాయితీ మింగారు సాగు యంత్రం అమ్మారు



కర్నూలు : గత వైకాపా హయాంలో మూడేళ్ల కిందట గ్రామ స్థాయిలో వైకాపా నాయకులు, కార్యకర్తల పేర్లతో రైతు సమూహాలను నియమించారు.. నామమాత్రపు అద్దె ప్రాతిపదికన రైతులకు ఇచ్చేలా వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాలు (సీహెచ్‌సీ)లు ఏర్పాటు చేశారు. పేరుకే రైతు సమూహాలు.. పెత్తనమంతా వైకాపా నాయకులు, కార్యకర్తలదే. ప్రభుత్వం నుంచి రైతు సమూహానికి రాయితీ సొమ్ము జమకాగానే సీహెచ్‌సీ యూనిట్లలోని ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను ఇతరులకు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. సహకార బ్యాంకులకు రుణ చెల్లింపులు చేయకుండా మొండికేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో 21 సహకార బ్యాంకు శాఖల పరిధిలో 516 వైఎస్సార్ యంత్రసేవా రైతు సంఘాలు రూ.15.17 కోట్ల మేర రుణాలు చెల్లించకుండా మొండికేస్తున్నారు.

**అద్దె సొమ్ము ఆరగించారు**

యంత్రాలను ఆయా గ్రామాల్లో రైతులకు అద్దెకు ఇవ్వాలి. క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైకాపా నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరించారు.

ఉమ్మడి జిల్లాలో 2,717 మంది రైతులు అద్దె ప్రాతిపదికన యంత్రాలు తీసుకున్నారు. తీసుకున్నవారి వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా... అలా జరగలేదు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 877 యూనిట్లు మంజూరు చేయగా కర్నూలు జిల్లాలో 84 సీహెచ్‌సీలు, నంద్యాల జిల్లాలో 32 మాత్రమే వినియోగంలో ఉన్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ వెల్లడించిన నివేదికలు చెబుతున్నాయి.

**రాయితీ సొమ్ము కోసం నాటకం**

ఉమ్మడి జిల్లాలో 1,037 కస్టమ్‌హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సీహెచ్‌సీ యూనిట్ విలువ రూ.15 లక్షలు. ఐదుగురు రైతుల సమూహం వాటా 10 శాతం కాగా.. 40 శాతం అంటే రూ.6 లక్షల మేర రాయితీ పోనూ మిగిలిన రూ.7.50 లక్షలను సహకార బ్యాంకులో రుణం ఇప్పించారు.

కర్నూలు జిల్లాలో 539 సీహెచ్ సీలకు రూ.21.13 కోట్లు, నంద్యాల జిల్లాలో 498 సీహెచ్‌సీలకు రూ.22.36 కోట్లు మంజూరయ్యాయి. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ఉమ్మడి జిల్లాలో రైతు సమూహాలు కేవలం రాయితీ కోసమే యూనిట్లు మంజూరు చేయించుకున్నారన్న విమర్శలున్నాయి. 1,037 యూనిట్లకు కర్నూలు జిల్లాలో 84, నంద్యాలలో 32 యూనిట్లు వినియోగంలో తీసుకొచ్చారు.

**అడిగితే బెదిరింపులు**

కర్నూలులో రూ.7.23 కోట్లు, నంద్యాలలో రూ.7.93 కోట్ల మేర దీర్ఘకాలికంగా రుణ బకాయిలు ఉన్నాయి.

ఆదోని సహకార బ్యాంకు శాఖ పరిధిలో అత్యధికంగా 67 రైతు సమూహాలున్నాయి. గత రెండేళ్లకుపైగా రూ.2.17 కోట్ల వరకు రుణ చెల్లింపులు చేయకుండా మొండికేశాయి.

ఆలూరులో 57 రైతు సంఘాలు.. రూ.1.07 కోట్ల మేర రుణ చెల్లింపులు చేయలేదు.

డోన్ సహకార బ్యాంకు బ్రాంచి పరిధిలో 65 రైతు సంఘాలు గత రెండేళ్లకుపైగా రూ.2.37 కోట్ల మేర రుణ చెల్లింపులు చేయలేదు. చివరికి అధికారులనే బెదిరించే పరిస్థితికి చేరింది.

కోవెలకుంట్ల మండల పరిధిలో గత రెండేళ్లుగా 33 రైతు సమూహాలు రూ.1.07 కోట్ల మేర రుణాలు చెల్లించలేదు. సహకార బ్యాంకు అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదు.

**తాఖీదులు జారీ చేస్తాం**

వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద సహకార బ్యాంకు శాఖల నుంచి రుణాలు తీసుకున్న రైతు సమూహాలు రుణ చెల్లింపులు చేయడం లేదు. ఇదివరకే తాఖీదులిచ్చినా స్పందించలేదు. లీగల్ నోటీసులు జారీ చేస్తాం.. మొండి బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.విజయకుమార్, సీఈవో, జిల్లా సహకార బ్యాంకు

# 24 గంటల్లో ఇంటి నిర్మాణ అనుమతులు

ఆదోని : పురపాలికల్లో 18 మీటర్లలోపు నిర్మించే ఇళ్లకు 24 గంటల్లో అనుమతులు పొందేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్‌టీపీ (లైసెన్స్‌డ్ సర్వేయర్స్, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్)లు దరఖాస్తులను పోర్టల్‌లో నమోదు (అప్‌లోడ్) చేసి కొద్ది గంటల్లోనే అనుమతులు పొందే వీలు కల్పించింది. నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టి, ఆక్యుపెన్సీ ధ్రువీకరణ పత్రాన్ని పొందొచ్చు.

**పాత ఇంటికి కొత్త కష్టాలు**

పట్టణాల్లో పాతబస్తీలో అధికంగా 30-40 (1,200 చ.అ.) నివాసాలే ఉంటాయి.. అన్ని పాత ఇళ్లే.. కొత్త ఇల్లు నిర్మించుకోవాలంటే.. నాలుగు వైపులా ఐదు అడుగుల స్థలం వదలాలి. మిగిలేది సగం స్థలమే. ఈ విధానంలో పాతబస్తీలోని ఇళ్ల నిర్మాణాలకు కొత్త కష్టాలు వచ్చిపడినట్లైంది.

**ఏటా వేలల్లో దరఖాస్తులు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పది పురపాలక సంఘాలు, నగర పంచాయతీలున్నాయి. వీటిలో ఏటా సుమారు 3-4 వేల ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు వస్తుంటాయి. ఏటా సుమారు రూ.15-18 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

**ఇవి కచ్చితంగా పాటించాలి**

300 చ.మీ. ఇంటి నిర్మాణానికి ప్లాన్ ఆమోదం పొందాలంటే.. ముందు భాగంలో 2 మీటర్లు, చుట్టూ.. మూడు వైపులా చెరో 1.5 మీటర్ల మేర సెట్‌బ్యాక్ స్థలం వదలాలి. వాణిజ్య పరమైన అపార్ట్‌మెంట్ల విషయానికొస్తే 100 అడుగుల రహదారి ఉన్నచోట, మూడు వైపులా ఐదు మీటర్ల చొప్పున స్థలం వదలాలి.

**తప్పు చేస్తే చర్యలు తప్పవు**

అనుమతి పొందిన స్థిరాస్తి వెంచర్లలో నిర్మాణాలకే అనుమతి తీసుకోవాలి. వాటిపై యజమాని హక్కులు కలిగి ఉండాలి. సర్వే నివేదిక, స్థల విలువ ఆధారిత ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. ప్లాన్ ఆమోదం పొందిన ఏడు రోజుల్లోపే భవన నిర్మాణానికి సంబంధించి బేస్‌మెంట్ స్థాయి చిత్రాలు అంతర్జాలంలో అప్‌లోడ్



చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నిర్మాణ అనుమతులు రద్దు చేస్తారు. అనుమతుల ముసుగులో ఎల్టీపీలు తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకొనేలా మార్గదర్శకాల్లో రూపొందించారు. ఇందుకు సహకరించిన సాంకేతిక సిబ్బంది (టెక్నికల్ పర్సన్స్)పైనా చర్యలు తీసుకోవడానికి వీలుంది.

ఉమ్మడి జిల్లాలో 300 మంది వరకు ఎల్టీపీలున్నారు. వీరు తప్పులు చేసినట్లైతే, వారి లైసెన్సును ఐదేళ్లపాటు రద్దు చేయనున్నట్లు నిబంధనల్లో పొందుపరిచారు.

# అవసరమే ఆసరాగా దోపిడీ

భీమవరం : అన్నదాతల అవసరాన్ని ఆసరా చేసుకుని దళారులు దోచుకుంటున్నారు. రబీ సీజన్‌లో యూరియా వినియోగం ఎక్కువగా ఉండటంతో ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తూ రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జిల్లాలో రబీ 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని అంచనా. రబీలో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీనిలో అధిక భాగం యూరియాదే. ముందస్తుగా ఎరువుల కొరత లేకుండా నెలల వారీగా ఏఏ ఎరువులు ఎన్ని మెట్రిక్ టన్నులు అవసరమో వ్యవసాయ శాఖ లెక్కలు కట్టింది. కంపెనీ నుంచి హోల్‌సేల్ డీలర్ల ద్వారా రిటైల్ డీలర్లకు చేర్చడం, సొసైటీలు, ఆర్ఎస్‌కేలకు చేర్చి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. పీఏసీఎస్‌లకు లక్ష్యాలు విధించడంతో వచ్చిన స్టాకును వచ్చినట్లు దళారులకు విక్రయించేస్తున్నారు.



**రైతులపై భారం**

ఎరువుల అమ్మకాల్లో ప్రైవేటు డీలర్లదే ప్రధాన పాత్ర కావడంతో బస్తాకు రూ.50 నుంచి రూ.100 మధ్య వసూలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ లెక్క ప్రకారం యూరియా 45 కేజీల బస్తా ఎమ్మార్పీ ధర రూ.266.50. సొసైటీలు, ఆర్ఎస్‌కేల అమ్మకాలు చేస్తున్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద ధరలు ఇష్టానుసారంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఎరువులు దిగుమతి అయ్యే రైల్వే యార్డు నుంచి 100 కి.మీ. వరకు యూరియాను రూ.300 వరకు అమ్ముకోవచ్చని వ్యవసాయ శాఖ చెబుతోంది. ట్రాన్స్‌పోర్టు ఛార్జీలివ్వకపోవడంతో డీలర్లకు వెసులుబాటు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఇదే అదునుగా కొంత మంది రూ.320, ఆపై విక్రయిస్తున్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ జేడీ వెంకటేశ్వరరావు తెలిపారు. ములపర్రుకు చెందిన ఓ రైతు అయిదెకరాలు వరి సాగు చేస్తున్నారు. సొసైటీలో యూరియా లేకపోవడంతో ఓ ప్రైవేటు దుకాణంలో బస్తా రూ.320 చొప్పున కొనుగోలు చేశారు. ఇందుకు బిల్లు ఇవ్వలేదు. ఇదే పరిస్థితి జిల్లాలో చాలాచోట్ల ఉందని రైతులు వాపోతున్నారు.

# బిల్లులిచ్చేదెప్పుడు?

ఉంగుటూరు ": వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు నీడ, నీటి వసతి కల్పించడానికి 'మినీ గోకులాలు' పేరిట పేద రైతులకు షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మొన్నటివరకు షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగగా.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇటీవల నెమ్మదించాయి.

తొలుత జిల్లాకు 900 మినీ గోకులాల యూనిట్లు మంజూరు చేశారు. పాడి రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు పరిశీలించి కేటాయించారు. ఆసక్తి చూపని వారిని గుర్తించి రద్దు చేశారు. చివరకు 714 చోట్ల మొదలుపెట్టారు. 10 శాతం రైతుల భాగస్వామ్యంతో రెండు పశువులకు రూ.1.15 లక్షలు, నాలుగింటికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30 లక్షల చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తున్నారు. మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం రాయితీ ఇస్తున్నారు. సంక్రాంతి పండగ నాటికి పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్దేశించినా అన్నిచోట్ల పూర్తి చేయలేకపోయారు. మండలాల వారీగా అత్యధికంగా కుక్కునూరులో 10కి 10, ఏలూరు 5కి 5, వేలేరుపాడు 10కి 9, పోలవరం 14కి 13, ఉంగుటూరు 45కి 38, అగిరిపల్లి 38కి 31.. అత్యల్పంగా భీమడోలులో 37కి 15, పెదవేగి 60కి 35, నూజివీడు 41కి 21, ముసునూరులో 36కి 17 పూర్తయ్యాయి.

సొమ్ముల కోసం ఎదురుచూపులు.. పశు పోషకులు షెడ్లను నిర్మించుకున్నా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. తొలి విడతలో కొంతమంది ఖాతాల్లో మాత్రమే జమ చేశారు. చాలా మందికి నిరాశే మిగిలింది. పనులు పూర్తి చేసి గత నెల 10-12 తేదీల్లో చిత్రాలను యాప్‌లో నిక్షిప్తం చేశారు. అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం అంటూ ఊరిస్తూ వస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. 'రూ.4 కోట్లు నిధులు రావాల్సి ఉండగా రూ.కోటి మంజూరైంది. వారం పది రోజుల్లో నిధులు మంజూరవుతాయి' అని డ్వామా పీడీ సుబ్బారావు తెలిపారు.

# రూ. కోట్లు.. పొలాలకు నీళ్లిస్తాయా

బొబ్బిలి : జలాశయాల ఆధునికీకరణకు నిధులు ఉన్నా పనుల పూర్తి ప్రశ్నార్థకంగా మారింది. జైకా నిధులతో చేపట్టిన నిర్మాణాలకు నిర్దేశించిన గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగుస్తోంది.

**ప్రాజెక్టుల వారీగా పరిస్థితి..**

వెంగళరాయ అదనపు ఆయకట్టు పనులకు పదేళ్ల క్రితం రూ.9 కోట్ల ప్రత్యేక నిధులొచ్చాయి. బొబ్బిలి, సీతానగరం మండలాల్లోని 5,500 ఎకరాలకు సాగునీరు అందాలి. కానీ భూసేకరణ జరగక పనులు ప్రారంభించలేదు. తర్వాత జైకా ద్వారా రూ.63.50 కోట్లతో 2020లో ఆధునికీకరణ ప్రారంభించారు. నాలుగేళ్లలో 20 శాతం మాత్రమే జరిగాయి.

పాచిపెంట మండలంలోని పెద్దగెడ్డ జలాశయం ఆధునికీకరణను రూ.28.18 కోట్లతో 2020లో ప్రారంభించి ఇప్పటి వరకు 10 శాతం పనులు మాత్రమే చేశారు.

జియ్యమ్మవలస మండలంలోని వట్టిగెడ్డ జలాశయానికి రూ.44.85 కోట్లు వచ్చాయి. 15 శాతం మాత్రమే పనులు జరగడంతో శివారు ఆయకట్టుకు నేటికీ సాగునీరు అందడం లేదు.

బలిజిపేట మండలంలోని పెదంకలాం ఆనకట్ట నుంచి 8,253 ఎకరాలకు నీరందాలి. రూ.17.30 కోట్లతో పనులు చేపట్టగా కేవలం 5 శాతం అయ్యాయి.

**బిల్లులు రాలేదు..**

జైకా పనులు ప్రారంభించి సుమారు అయిదేళ్లవుతోంది. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేశారు. ముఖ్యంగా గత వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వాటా చెల్లించలేదు. 2025 మార్చి 31 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా కొలిక్కిరాలేదు. పూర్తి కావాలంటే మరోసారి ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది.

**బాగు చేయడం లేదు - జి.సింహాచలం, రైతు, మర్రివలస, రామభద్రపురం**

పెద్దగెడ్డ జలాశయానికి శివారున ఉన్నాం. కాలువ తుప్పలతో నిండిపోయింది. గత ఖరీఫ్‌లో నీరు రాలేదు. అధికారులు బాగు చేయడం లేదు.

**ప్రత్యేక దృష్టి పెడతాం- అప్పారావు, ఎస్ఈ, బొబ్బిలి, ఆర్.అప్పలనాయుడు, ఈఈ, పార్వతీపురం మన్యం** జైకాతో ఒప్పందంపై ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది చేపట్టనున్న పనులు వివరాలు వారికి తెలియజేస్తాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు ముందుకు వెళ్తాం.

చురకలు



# నిధులకు కోతల్లేవ్!

అనంతపురం : గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను గత వైకాపా ప్రభుత్వ హయాంలో అనేక విధాలుగా కోతలు విధించారు. ఆర్థిక సంఘం నిధులే కాదు.... రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయతీలకు స్టాంపు డ్యూటీ సర్‌ఛార్జీలను రెండేళ్ల పాటు ఒక్క పైసా జమ చేయని ఘనత వైకాపా సర్కారుదే. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థల పాత్ర చాలా కీలకం. వాటిని నిర్వీర్యం చేసిన చరిత్ర కూడా గత ప్రభుత్వానిదే. రాత్రిపూట అంతర్జాలంలో నిధులు కనిపించేవి. ఉదయం లోపు పైసా లేకుండా మాయమయ్యేవి. ఇలా ఒకటి కాదు రెండు కాదు...ఎన్నోసార్లు పంచాయతీ సర్పంచులను జగన్ సర్కారు మోసం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో పంచాయతీలు అందుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు, వృత్తిపన్ను, తలసరి ఆదాయం, సర్పంచుల గౌరవ వేతనం, సీనరేజ్ ఛార్జీలు చకచకా జమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం లేకుండా నేరుగా పంచాయతీల ఖాతాలకే జమకావడం పట్ల రాజకీయాలకు అతీతంగా సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్టాంపుడ్యూటీ



సర్‌ఛార్జి కూడా రెండు నెలలది పంచాయతీలకు జమచేసే ప్రక్రియ ఆరంభమైంది.

**అనంత జిల్లాకు రూ. 37.55 కోట్లు**

వైకాపా ప్రభుత్వం కేంద్రం విడుదల చేసే నిధులే కాకుండా సాధారణ నిధులను సైతం విద్యుత్తు బిల్లుల పేరిట ఖాతాల్లో జమకాకుండానే వాడేసుకుంది. పంచాయతీరాజ్ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు చేపట్టాక నిధులన్నీ పంచాయతీ ఖాతాలకే జమ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోని పంచాయతీలకు రూ. 37.55 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లో పనులు ఊపందుకున్నాయి. అప్పులు చేసి విద్యుత్తు మోటర్లు, బ్లీచింగ్ పౌడరు కొనుగోలు చేసిన సర్పంచులకు ఊరట లభించింది.

**జోరుగా అభివృద్ధి పనులు - దేగల కృష్ణమూర్తి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల అవుతున్నాయి. మున్సిపాల్టీలకు కూడా జమ అయ్యాయి. ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుండా స్థానిక సంస్థల ఖాతాలకు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# 205 రోజులు.. 33.378టీఎంసీలు

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తున్న తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ(టీబీ హెచ్చెల్సీ) నీటి సీజన్ ముగిసింది. మంగళవారమే ప్రధాన కాలువలో నీటి ప్రవాహం అడుగంటినా.. బుధవారంతో పూర్తిగా హెచ్చెల్సీకి నీటి సరఫరా ఆగిపోనుంది. ఈమేరకు టీబీ బోర్డు ఇక్కడి అధికారులకు వర్తమానం పంపింది. ప్రస్తుత నీటి సీజన్‌లో హెచ్చెల్సీ వాటా 30.354 టీఎంసీలు, కేసీ కాలువ మళ్లింపు కింద మరో మూడు టీఎంసీలు కలిపి మొత్తం 33.354 టీఎంసీలు రావాల్సి ఉండగా.. తుంగభద్ర ప్రాజెక్టు వద్దే మంగళవారం నాటికి 33.378 టీఎంసీలు విడుదల చేశారు. జిల్లా సరిహద్దుకు 29.265 టీఎంసీలు చేరాయి. కర్ణాటక పరిధిలో 4.113 టీఎంసీలు వృథా కింద లెక్క కట్టడం విశేషం. గతేడాది జులై 22న హెచ్చెల్సీకి నీరు విడుదల చేశారు. ఇప్పటి దాకా నిర్విఘ్నంగా ప్రవాహం కొనసాగింది. మొత్తంగా 205 రోజుల్లో డ్యాం వద్ద 33.378 టీఎంసీలను విడుదల చేయడం ప్రస్తావనార్హం.

**ఆయకట్టుకే 13.052 టీఎంసీలు**

ప్రస్తుత 2024-25 నీటి సీజన్‌లో జిల్లాకు చేరిన 29.265 టీఎంసీలల్లో.. ఆయకట్టుకే అధికంగా 13.052 టీఎంసీలు కేటాయించారు. ఎమ్పీఆర్, కణేకల్లు, పీఏబీఆర్, ముచ్చుకోట, సుబ్బరాయసాగర్ జలాశయాల్లో 5.287 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. మరోవైపు హెచ్చెల్సీ పరిధిలో 90,355 ఎకరాలు సాగు చేశారు.




హెచ్చెల్సీపై ఆధారపడి 14 తాగునీటి పథకాలు కొనసాగుతున్నాయి. అనంతపురం నగరంతోపాటు హిందూపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, రాయదుర్గం, ఉరవకొండ, వంటి ప్రాంతాలకే కాకుండా వందలాది గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది.

**గతేడాది కంటే రెట్టింపు**

గతేడాది వైకాపా ప్రభుత్వ హయాంలో హెచ్చెల్సీ వాటాగా 16.071 టీఎంసీలు, కేసీ మళ్లింపు వాటా కింద ఒక టీఎంసీ కలిపి మొత్తం 17.071 టీఎంసీలే వచ్చాయి. ఇందులోనూ తాగునీటి అవసరాలకు ఎక్కువ కేటాయించారు. సింహభాగం ఆయకట్టు బీడుగా మారిపోయింది. గతేడాదితో పోల్చితే ఈదఫా రెట్టింపు స్థాయిలో హెచ్చెల్సీ జలాలు జిల్లాకు చేరడం విశేషం. వచ్చే వేసవిలోనూ నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉండకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పేదల పుట్టల్లోని వైకా'పాముల్ని' తరిమేస్తారు!



చిత్తూరు : నగరం తేనెబండలోని జగనన్న కాలనీ. చిత్తూరు- తిరుపతి జాతీయ రహదారి పక్కనే ఉన్న లే అవుట్‌లో పేదలకే పట్టాలు ఇవ్వాలి. అది కూడా ఒక సెంటు మాత్రమే పంపిణీ చేయాలి. ఇందుకు భిన్నంగా ఇక్కడ భవంతులు నిర్మించారు. ఇంత స్థలం గత వైకాపా ప్రభుత్వం వీరికి ఎలా ఇచ్చిందన్నదే అసలైన ప్రశ్న. అధికార పార్టీ నాయకులు కావడమే ఏకైక అర్హతగా స్థలాలు పొంది భవనాలు కట్టుకున్నారన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

రేణిగుంట మండలం తారకరామానగర్, కుర్రకాల్వ గ్రామాల్లో స్థానిక వైకాపా నేతలు ఒక్కో ఇంటి పట్టాను రూ.2 లక్షలకు అమ్మేశారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలు కొంత ఖాళీగా ఉండగా వాటినే వారు విక్రయించేశారు. ఇలా దాదాపు 200 పట్టాలను అమ్మి సొమ్ము చేసుకున్నారు. మండలంలోని మిగతా గ్రామాల్లో కూడా ఫ్యాను పార్టీ నాయకులు గద్దల్లా వాలిపోయారు. శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్‌నగర్, ఏర్పేడు మండలం చిందేపల్లి వద్ద సైతం ఇదే పరిస్థితి. ఈనాడు, తిరుపతి- న్యూస్‌టుడే, రేణిగుంట, శ్రీకాళహస్తి: చీమలు పెట్టిన పుట్టల్లోకి చేరిన వైకా'పాముల'ను తరిమేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైకాపా హయాంలో అనేక చోట్ల పేదల స్థానంలో అనర్హులకు ఇంటి పట్టాలు కట్టబెట్టారు. ప్రధానంగా జగనన్న కాలనీల్లో పైసలిచ్చిన వ్యక్తులకే పట్టాలు కట్టబెట్టారు. కొందరు నాయకులు పేదల పేరిట పట్టాలు పొంది భారీ భవంతులు నిర్మించారు. పలుచోట్ల ఇల్లు కట్టలేక లబ్ధిదారే స్థలాన్ని అమ్మేశారు. ఈ అక్రమాలను నిగ్గు తేల్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపి అనర్హుల ఏరివేసే పనిలో పడింది. 'నవ రత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం కింద 2020 డిసెంబరులో ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. పట్టణాల్లో ఒక సెంటు, గ్రామాల్లో ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వ్యక్తులకే వీటిని ఇవ్వాలని అప్పట్లో పేర్కొంది. గతంలో ప్రభుత్వం స్థలం ఇచ్చినా, గృహ నిర్మాణానికి సాయమందించినా అనర్హులేనని తెలిపింది. పకడ్బందీగా చేపట్టాలని భావించిన కార్యక్రమం గాడి తప్పింది. వైకాపా నేతలు, దళారులు ఇందులోకి ప్రవేశించడంతో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది నామమాత్రంగా మిగిలిపోయారు.

**15 రోజుల్లోగా పునఃపరిశీలించాలని ఆదేశం**

తాజాగా అక్రమాల లెక్క తేల్చేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ నెల 5న సీసీఎల్ఏ నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు వచ్చాయి. ఇందుకోసం తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. 15 రోజుల్లోగా ఇంటి పట్టాలను పునః పరిశీలించాలని స్పష్టంగా పేర్కొన్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. లబ్ధిదారు ప్లాట్ నంబరు, పేరుతోపాటు వారు అర్హులా? కాదా? ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉందా? లేదంటే ఇల్లు కట్టుకున్నారా? అనే సమాచారం పొందుపరచాలని తెలిపారు. అనర్హుల జాబితా తేలితే ఆ పట్టాను తహసీల్దారు రద్దు చేస్తారు.

**రూ.20 వేలు - రూ.7 లక్షల వరకు**

శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, చిత్తూరు, గంగాధరనెల్లూరు, పలమనేరు, కుప్పం తదితర నియోజకవర్గాల్లో అధికారులను కేవలం కాగితాలపై సంతకం చేయించుకోవడానికే వినియోగించుకున్నారు. పెద్దగా డిమాండ్ లేనిచోట రూ.20 వేలకు పట్టా అమ్మేయగా.. ఎక్కువమంది ఆసక్తి చూపిన ప్రాంతాల్లో రూ.7 లక్షలకు కూడా విక్రయించారు. అప్పట్లో ఈ వ్యవహారంపై వైకాపా నేతల తీరుపై తీవ్ర విమర్శలు వచ్చినా యంత్రాంగం కనీస చర్యలకు ఉపక్రమించలేదు.

# క్రీడా హబ్‌కు అడుగులు



తిరుపతి : కూటమి ప్రభుత్వం క్రీడాభివృద్ధిపై దృష్టిసారించింది. 'ఖేలో ఇండియా పథకం' కింద క్రీడాకారులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి దేశవ్యాప్తంగా స్టేట్ ట్రైనింగ్ సెంటర్ (ఎస్‌టీసీ)లను కేంద్రం ఇప్పటికే నిర్వహిస్తోంది. వీటిద్వారా ఎంపిక చేసిన 10 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

కూటమి ప్రభుత్వం అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలను క్రీడా హబ్‌లుగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించింది. తిరుపతి సమీపంలోని తూకివాకం వద్ద 35 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్టేడియం నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. తాజాగా తిరుపతిలో ఎస్‌టీసీ ఏర్పాటు చేయాలని సాయ్‌కు ప్రతిపాదనలు పంపారు. క్రీడాకారులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, క్రీడాపరికరాలు, దుస్తులు సాయ్ నిధులతో సమకూరుతాయి.

**ఎస్వీయూతో ఒప్పందం**

తిరుపతిలో ఎస్‌టీసీ ఏర్పాటు చేయాలంటే అన్ని సౌకర్యాలు, సదుపాయాలతో కూడిన భవనాన్ని శాప్ తరఫున సాయ్‌కు కేటాయించాల్సింది. ఇందుకోసం ఎస్వీయూలో నిరుపయోగంగా ఉన్న ఈ-మెస్ (డార్మిరీ)ని కేటాయించాలని ఛైర్మన్ రవినాయుడు కోరారు. స్పందించిన ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్‌లు గతనెలలో ఒప్పందం చేసుకున్నారు. ఎస్‌టీసీ కోసం ఎస్వీయూలో కేటాయించిన భవనాన్ని సాయ్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.కె.నరేష్ కుమార్ ఇటీవల పరిశీలించారు. భవన నిర్మాణం, చుట్టుపక్కల పచ్చదనం, క్రీడాకారుల సాధనకు అనువైన ఎస్వీయూ స్టేడియం, శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు అందించే నివేదిక ఆధారంగా తుదపరి చర్యలు తీసుకోనున్నారు.

**ఉమ్మడి జిల్లాలో క్రీడాకారుల వివరాలు**

తైక్వాండో: 150- 200 మంది

హ్యాండ్‌బాల్: 50- 100 మంది

**కలిసొస్తే సంబరమే**

ఎస్‌టీసీ ఏర్పాటుతో తైక్వాండో, హ్యాండ్‌బాల్ క్రీడాంశాల్లో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ క్రీడాకారులకు నిష్ణాతులైన సాయ్ బృందం ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్వీయూలోని ఈ- మెస్ భవనంలో వసతి, భోజనం సదుపాయం కల్పించనున్నారు. మలిదశలో మరిన్ని క్రీడాంశాలను పరిచయం చేయనున్నారు.

# కరెంటు కష్టాల కట్టడి

పాడేరు : ఏటా వేసవిలో కరెంటు కోతలు, లోవోల్టేజీ వెతలు కనిపిస్తుంటాయి. ఈ ఏడాది ఆ సమస్య తలెత్తకుండా ముందుగానే విద్యుత్తు సంస్థ అధికారులు మేల్కొన్నారు. కరెంటు సరఫరాలో అంతరాయాలు లేకుండా చేయడానికి అదనపు సబ్ స్టేషన్లను అందుబాటులోకి తెస్తున్నారు. ఉన్న విద్యుత్తు ఉపకేంద్రాల సామర్థ్యాలను పెంచుతున్నారు. వ్యవసాయ, గృహ విద్యుత్తు ఫీడర్లను విభజిస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చుతున్నారు. వేసవి డిమాండ్‌ను అంచనా వేసి ఆ మేరకు విద్యుత్తు సరఫరాను మెరుగుపర్చేలా ప్రత్యేక బృందాలతో పనిచేయిస్తున్నారు. విశాఖ నగరంలో కొత్తగా నాలుగు 33//11 కిలోవాట్ల విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాలు మొదలుపెడుతున్నారు. కూర్మన్నపాలెం, తెన్నేటినగర్, సుద్దగెడ్డ (మధురవాడ), చిల్లపేట (భీమిలి) వద్ద ఒక్కో సబ్‌స్టేషన్ రూ.3 కోట్లతో నిర్మించేందుకు గుత్తేదారులకు అప్పగించారు. 300 గజాల్లో ఇండోర్‌లో వీటిని నిర్మిస్తారు. ఇవి కాకుండా ఎన్ఎస్టీఎల్, కాపులుప్పాడల్లో 132 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటితో సింహాచలం, మురళీనగర్, కంచరపాలెం, విమాననగర్, గోపాలపట్నం, మధురవాడ, ఐటీ హిల్స్, రుషికొండ, ఆనందపురం సబ్‌స్టేషన్లపై ఒత్తిడి తగ్గి కరెంటు సరఫరా మెరుగవనుంది. ఆశీల్‌మెట్ట, ద్వారకానగర్‌లో విద్యుత్తు ఉపకేంద్రాలకు స్థలాలు చూపాలని జీవీఎంసీని కోరుతున్నారు. అలాగే కచరపాలెం, ఆటోనగర్, రుషికొండ వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు ఈపీడీసీఎల్ విశాఖ ఎస్ఈ శ్యామ్‌బాబు తెలిపారు.

**వ్యవసాయ ఫీడర్లు వేరుగా..** అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు, గృహ, వాణిజ్య కనెక్షన్లు ఒకే ఫీడర్‌పై ఉంటున్నాయి. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్)లో వ్యవసాయ ఫీడర్లను వేరు చేసి గ్రామాలన్నింటికీ



త్రీఫేజ్ విద్యుత్తు 24 గంటలూ అందించే ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో విద్యుత్తు ఆధారంగా పనిచేసే చిన్న చిన్న యూనిట్లకు కోతలు లేకుండా సరఫరా చేయొచ్చు. దీనివల్ల కొంతమందికి ఉపాధి దెబ్బతినకుండా చూడాలని ప్రయత్నిస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 60 బృందాలు వీటికోసం పనిచేస్తున్నాయి. వేసవి నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేసి కరెంటు కోతలు అన్నమాటే లేకుండా చేస్తామని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. అనకాపల్లి పట్టణంతో పాటు నక్కపల్లి దగ్గర వేంపాడు, వాడచీపురుపల్లి, మంగళపాలెం సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి విద్యుత్తు లోడు పెరగకుండా చూస్తున్నట్లు ఈపీడీసీఎల్ అనకాపల్లి ఎస్ఈ గొప్పు ప్రసాద్ తెలిపారు.

# మార్కెట్ యార్డులకు.. పూర్వ వైభవం వచ్చేనా?

గోరంట్ల : మార్కెట్ యార్డులు వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన రైతులకు ఉపయోగపడాలి. వ్యవసాయ ఉత్పత్తులను యార్డులో ఉన్న ఫ్లాట్‌ఫారాలపై ఆరబెట్టుకోవడం, గిట్టుబాటు ధరలు లభించని నేపథ్యంలో అక్కడి గోదాముల్లో నిల్వ చేసుకోవడం, అన్నిరకాల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేసుకోవడం జరగాలి. అంతేకాదు మార్కెట్ యార్డులకు వచ్చే ఆదాయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. రైతులకు, పశువులకు వైద్యశిబిరాలు నిర్వహించాలి. అవకాశమున్నచోట స్థిరాస్తులను అభివృద్ధి చేసి ఆదాయం పెంచుకునే దిశగా అడుగులు వేయాలి. గడిచిన అయిదేళ్లలో ఏం జరిగిందంటే శూన్యం అన్న సమాధానం వినిపిస్తోంది. గోరంట్ల, కొత్తచెరువు యార్డులు ప్రధార రహదారులకు ఆనుకుని ఉండడంతో దుకాణ సముదాయం, పెట్రోల్‌బంక్ నిర్మాణాలకు పంపిన



ప్రతిపాదనల స్థాయి దాటలేదు.

**హిందూపురం మినహా ఎక్కడా క్రయవిక్రయాలు లేవు**

జిల్లాలో ఎనిమిది మార్కెట్ యార్డులు ఉండగా హిందూపురంలో మాత్రం మిర్చి, చింతపండు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన వాటిలో కొత్తచెరువు, గోరంట్ల, కదిరిలో పశువుల సంతల నిర్వహణతో వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలకు వినియోగిస్తున్నారు. ఆదాయం విషయంలో ప్రతిఏటా లక్ష్యానికి చేరుతున్న అభివృద్ధి మాత్రం జరగలేదు. అన్ని మార్కెట్ యార్డులకు నూతన కమిటీలను ఏర్పాటు చేయడానికి ఇటీవలే రిజర్వేషన్లు ఖరారు చేశారు. కనీసం నూతన కమిటీల ద్వారా అయినా యార్డుల పరిస్థితిలో మార్పు వస్తుందా అని రైతుల నుంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**పొరుగుసేవల సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు** మార్కెట్‌యార్డులలో రెగ్యులర్ సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారు. 50 శాతానికి పైగా పొరుగుసేవల ఉద్యోగులతోనే నెట్టుకొస్తున్నారు. కొన్నిచోట్ల కార్యాదర్శులు ఇన్‌ఛార్జీలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఖజానాలో నిధులు ఉన్నా నేరుగా ఖర్చు చేయడానికి అవకాశం లేదంటున్నారు.

# తీరగ్రామాల అభివృద్ధికి శ్రీకారం

గూడూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీర గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. కేంద్ర నిధులు రూ.2 కోట్లు కేటాయించి మౌలిక వసతులతో పాటు మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కల్పించేలా నిర్మాణాత్మక పనులు చేపట్టనున్నారు. మొదటి విడతలో వాకాడు మండలం తూపిలిపాలెం, రాయదొరువు తీర ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. సీఆర్‌సీఎఫ్‌వీ (కోస్టల్ రిలెవెంట్ క్లైమేట్ ఫిషరీస్ విలేజ్) ప్రాజెక్టు కింద రూ.2 కోట్లు విడుదల చేసింది. 70% నిధులతో చేపలు ఎండబెట్టుకునే నాలుగు ప్లాట్‌ఫాంలు, బహుళ



ప్రయోజక రక్షిత తుపాను భవనం వంటి పనులు, మిగిలిన 30 శాతం నిధులతో మత్స్యకారుల జీవనోపాధికి ఉపయోగపడే పడవల ఇంజిన్లు, వలలు వంటి వాటికి వినియోగిస్తారు. ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు 2.50 ఎకరాల భూమి కేటాయించారు. రెండో విడతలో కోట మండలం గోవిందపల్లి పట్టపుపాలెంను ఎంపిక చేశారు.

**రూ.23 కోట్లతో మినీ హార్బర్**

రాయదొరువు సముద్ర ప్రాంతంలో రూ.23 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోర్ అండ్ ఫిష్ ల్యాండింగ్ కేంద్రం (మినీ హార్బర్) ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం 60% నిధులు ఇవ్వగా మిగిలిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. మత్స్యకార గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం శుభపరిణామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. టెండర్లు పూర్తయ్యాక పనులు చేపడతా మని మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు తెలిపారు.

# వంతెన శిథిలమై.. రాకపోకలు కష్టమై

సోమల : మండలంలోని పెద్దఉప్పరపల్లెలో భారీ వర్షం పడితే చాలు గార్గేయనది, సీతమ్మచెరువు వంక, బోనమంద చెరువు వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తాయి. పెద్దఉప్పరపల్లె-రెడ్డివారిపల్లెబీ చిన్నకమ్మపల్లెబీ బసవపల్లె, గార్గేయనదిబీ చౌడేపల్లె మార్గంలో దేవలకుప్పం వద్ద సీతమ్మచెరువు వంక, పేటూరు ఇర్లపల్లె వద్ద బోనమంద చెరువు వంక మార్గాల్లోని వంతెనలు ధ్వంసమై రాకపోకలు ఆగిపోతాయి. ఇక్కడ వంతెనలు నిర్మించాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ ప్రజలు తిరుగుతున్నా ఫలితం శూన్యం. నాలుగేళ్ల ముందు బసవపల్లె మార్గంలోని గార్గేయనది దాటే ప్రయత్నంలో చిన్నకమ్మపల్లె ఎస్సీకాలనీకి చెందిన తండ్రి, కూతురు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెడ్డివారిపల్లె, చిన్నకమ్మపల్లె, బోనమంద, బసవపల్లె, పేటూరు, పేటూరు ఇర్లపల్లె, పొలికిమాకులపల్లె, దేవలకుప్ప తదితర ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు స్తంభించి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులు తర్వాత పెద్దఉప్పరపల్లె-బసవపల్లె వద్ద గార్గేయనదిపై తాత్కాలిక వంతెన నిర్మించడంతో రాకపోకలు కొనసాగాయి. కూటమి ప్రభుత్వంలోనైనా వంతెనలు నిర్మాణాలు పూర్తిచేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై చౌడేపల్లె పీఐయూ ఇన్‌ఛార్జి డీఈఈ కరుణాకర్‌ను వివరణ కోరగా.. పెద్దఉప్పరపల్లె సమీపంలో గార్గేయనదిపై రెడ్డివారిపల్లె, బసవపల్లె మార్గంలో వంతెనలు నిర్మించేందుకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయని ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

## లావణ్య అందాల మాయ.. వావ్ అనాల్సిందే!

టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్న లావణ్య త్రిపాఠి, ఇప్పుడు గ్లామర్‌తో మరోసారి నెట్టింట్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోషూట్‌లో లావణ్య తన రేంజ్‌ను మరోసారి ప్రూవ్ చేసుకుంది. బంగారు వర్ణంలో మెరిసిపోయే శరీర సొగసుతో ఆమె స్టన్నింగ్ లుక్ ఫ్యాన్స్‌ను ముగ్ధులను చేస్తోంది. ఈ ఫోటోషూట్‌లో లావణ్య ధరించిన అవుట్‌ఫిట్ నిజంగా క్లాస్ ఎలిగెన్స్‌కి కలయికగా ఉంది. గోల్డ్ షిమ్మరీ గౌన్‌లో ఆమె క్యూట్ లుక్స్ తో కూడిన కాన్ఫిడెంట్ పోజులు అసలైన హైలైట్. వెవ్స్ లాగా ఆమె జుట్టు, రెడ్ లిప్‌స్టిక్‌తో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా



మారింది. 'రాజెల్ డ్యాజెల్' అంటూ క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ ఫోటోలు ఒక్కరోజులోనే జెట్ స్పీడ్ లో వైరల్ అయ్యాయి. లావణ్య తన కెరీర్‌ను 'అందాల రాక్షసి' సినిమాతో ప్రారంభించి, ఎన్నో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులకు చేరువైంది. కానీ గత కొంత కాలంగా ఆమె సినిమాల పరంగా పెద్దగా హైలెట్ కాలేదు. ఇక వరుణ్ తేజ్ ను వివాహం చేసుకున్న తరువాత డిఫరెంట్ కంటెంట్ ఉన్న సినిమాలను సెలెక్ట్ చేసుకుంటోంది. అయితే తన స్టన్నింగ్ ఫొటోషూట్లతో మాత్రం ఎప్పటికప్పుడు హాట్ టాపిక్‌గా మారుతూ ఉంటోంది. ఈ ఫోటోషూట్ కూడా అదే రేంజ్‌లో నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ప్రతి అప్డేట్‌ను ఫ్యాన్స్‌తో పంచుకునే లావణ్య, ఫ్యాషన్ స్టేట్‌మెంట్ పెట్టడంలో ఎప్పుడూ ముందుంటుంది. ఈ లుక్‌కి సంబంధించిన స్టైలింగ్ టీమ్, జ్యుయలరీ బ్రాండ్ డీటైల్స్‌ను కూడా తన పోస్ట్‌లో ట్యాగ్ చేస్తూ, తనను మేకోవర్ చేసిన క్రెడిట్‌ను కూడా అందించడంలో కచ్చితంగా ముందుంటుంది. సినిమాల్లో బిజీగా లేకపోయినా లావణ్య తన క్రేజ్‌ను అలాగే కొనసాగిస్తోంది.

## వీరమల్లు హీరోయిన్ ఐటెం సాంగ్‌తో సర్‌ప్రైజ్..!

పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందుతున్న 'హరి హర వీరమల్లు' సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. వీరమల్లు సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. సినిమాను ఈ నెల చివర్లో విడుదల చేయాలని భావించినా కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. మే నెలలో సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజాసాబ్' సినిమాలోనూ నిధి అగర్వాల్ ఒక హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కావాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల వాయిదాలు పడుతూ వస్తోంది. దాంతో నిధి అగర్వాల్ నటించిన రెండు పెద్ద సినిమాలు వాయిదాల



మీద వాయిదాలు పడుతూ ఉండటంతో ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండు పెద్ద సినిమాల్లో నటిస్తున్న కారణంగా ఆ సినిమాల తర్వాత కొత్త సినిమాలు చేయాలని నిధి అగర్వాల్ భావిస్తుందట. అందుకే వచ్చిన చిన్నా చితకా ఆఫర్లను సున్నితంగా నిధి తిరస్కరిస్తుందని వార్తలు వస్తున్నాయి. సినిమాల్లో హీరోయిన్‌గా నటించే అవకాశాలను వద్దు అంటున్న నిధి అగర్వాల్ ఇటీవల ఒక సీనియర్ స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్‌ను చేసేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. ఆ సీనియర్ హీరో మరెవ్వరో కాదు బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్. ఈ మధ్య కాలంలో సన్నీ డియోల్‌కి గదర్ 2 తో భారీ విజయం దక్కింది. అందుకే ఆయన నటిస్తున్న జాట్ సినిమాపై అంచనాలు భారీగా ఉన్న విషయం తెల్సిందే. తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న జాట్ సినిమాలో నిధి అగర్వాల్ ఐటెం సాంగ్ చేయబోతున్నట్లు సమాచారం అందుతోంది. టాలీవుడ్ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం మార్చి 17 నుంచి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో ప్రత్యేక పాట చిత్రీకరించబోతున్నారు. అందులో సన్నీ డియోల్‌తో పాటు నిధి అగర్వాల్ కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు మాస్ ఎలిమెంట్స్‌ను జోడించేందుకు నిధి అగర్వాల్‌తో అందమైన ఐటెం సాంగ్‌ను గోపీచంద్ మలినేని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. జాట్ సినిమాలో రెజీనా, సయామి ఖేర్‌లు హీరోయిన్స్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. మూడో హీరోయిన్‌గా ప్రత్యేక పాటలో నిధి అగర్వాల్ కనిపించబోతున్న నేపథ్యంలో సినిమాకు మరింత గ్లామర్ అద్దినట్లు కానుంది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.





## సప్తగిరి పెళ్లికాని ప్రసాద్.. ట్రైలర్ ఎలా ఉందంటే..




టాలీవుడ్‌లో కామెడీ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన సినిమాలకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఇక అలాంటి జానర్‌లో మంచి కామెడీ టైమింగ్ ఉన్న సప్తగిరి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం పెళ్లికాని ప్రసాద్. ఎప్పుడూ వెండితెరపై నవ్వులు పూయించే అతను, ఈసారి హీరోగా తనదైన స్టైల్‌లో ఫుల్ ఎంటర్టైన్మెంట్ అందించేందుకు సిద్ధమవుతున్నాడు. మార్చి 21న థియేటర్లలో ప్రేక్షకులను అలరించబోతున్న ఈ సినిమాకు అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించారు. ఇక లేటెస్ట్ గా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ట్రైలర్ చూస్తే సినిమా ప్రధానంగా హీరోకు పెళ్లి కావట్లేదు అనే సున్నితమైన అంశాన్ని కామెడీగా చూపించబోతున్నట్లు కనిపిస్తోంది. 36 ఏళ్ల వయసులోనూ పెళ్లి కాకుండా మిగిలిపోయిన ఓ వ్యక్తి జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ఎంటర్టైన్మెంట్ గా రూపొందించారని అనిపిస్తోంది. పెళ్లి ఆలస్యం అవుతున్నప్పుడు కుటుంబ సభ్యులు చెప్పే మాటలు, సమాజం చూపే ప్రెజర్, పెళ్లి విషయంలో వచ్చే ఆశలు, భయాలు అన్నీ ట్రైలర్‌లోనే చూపించారు. ముఖ్యంగా సప్తగిరి నటన ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. సినిమాలో కామెడీ మాత్రమే కాదు, కొంతవరకు సోషల్ సబ్జెక్ట్‌ను కూడా టచ్ చేశారు. పెళ్లి అనే అంశాన్ని చాలా మందిని ప్రభావితం చేసేలా కథను మలిచిన విధానం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే, వధువు కుటుంబం వారి అంచనాలు, పెళ్లి సంబంధంలో తీసుకునే డిమాండ్లు వంటి అంశాలను చాలా హాస్యంగా ప్రెజెంట్ చేశారు. టెక్నికల్‌గా కూడా సినిమా ఆకట్టుకునేలా ఉంది. సుజాత సిద్ధార్థ్ సినిమాటోగ్రఫీ సినిమా టోన్‌కి బాగా నప్పింది. కామెడీ సినిమాలకు ముఖ్యంగా బ్యాగ్రౌండ్ స్కోర్ చాలా ముఖ్యం. ఈ విషయాన్ని గమనించి, శేఖర్ చంద్ర అదిరిపోయే సంగీతాన్ని అందించినట్లు ట్రైలర్‌లోనే అనిపిస్తోంది. ఎడిటింగ్ కూడా చాలా క్రిస్పీగా ఉండేలా అనిపిస్తోంది. సినిమాకు సంబంధించిన విజువల్స్, నేపథ్య సంగీతం, డైలాగ్స్ అన్నీ కలిసి హిట్ గ్యారంటీ అనేలా ఉన్నాయి. కాస్టింగ్ విషయానికి వస్తే, సప్తగిరి మరోసారి తన టైమింగ్‌తో ప్రేక్షకులను గిలిగింతలు పెట్టేలా ఉన్నాడు. ఆయన పాత్రలోని కామెడీ, ఎమోషన్ ట్రైలర్‌లోనే హైలైట్ అయ్యాయి.

కథానాయిక ప్రియాంకా శర్మకూ మంచి ప్రాముఖ్యత ఉన్న పాత్ర దక్కినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మురళీధర్ గౌడ్, లక్ష్మణ్ వంటి సహాయ నటీనటుల పర్ఫార్మెన్స్ సినిమాకి మరింత బలం చేకూర్చేలా ఉంది. మొత్తానికి పెళ్లికాని ప్రసాద్ ట్రైలర్ సినిమాపై మంచి అంచనాలు ఏర్పరిచింది. ట్రైలర్ ద్వారా వచ్చిన హైప్ సినిమా రిలీజ్ వరకు కొనసాగితే, కామెడీ సినిమాల్ని ఆదరించే ప్రేక్షకులకు మరో మంచి ఫన్ ఎంటర్టైనర్‌గా నిలిచే అవకాశం ఉంది. మార్చి 21న ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులను నవ్వించేందుకు సిద్ధంగా ఉంది. మరి సినిమా బిగ్ స్క్రీన్ పై ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

## బెల్లంకొండ మల్టీస్టారర్ డేట్ మారిందా?




బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా విజయ్ కనకమేడల దర్శకత్వంలో రూపొందిన 'భైరవం' సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. బెల్లంకొండతో పాటు ఈ సినిమాలో మంచు మనోజ్, నారా రోహిత్ ముఖ్య పాత్రల్లో నటించిన కారణంగా అంచనాలు భారీగా పెరిగాయి. ఇది ఒక మల్టీస్టారర్ మూవీగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఏకంగా ముగ్గురు హీరోలు ఈ సినిమాలో ఉండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అందుకే ఏమాత్రం అంచనాలకు తగ్గకుండా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా దర్శకుడు విజయ్ ప్లాన్ చేస్తున్నాడు. తన గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాలోనూ విభిన్నమైన స్టోరీ పాయింట్‌ను టచ్ చేసినట్లు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు 'భైరవం' సినిమాను ఏప్రిల్ 4న ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మేకర్స్ చెబుతూ వచ్చారు. ఏప్రిల్ 4న సినిమా విడుదల దాదాపు కన్ఫర్మ్ అని అంతా అనుకుంటున్నారు. ఇలాంటి సమయంలో సినిమాను మరింత క్వాలిటీతో, ఎక్కువ శాతం మంది ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు గాను వాయిదా వేయాలని నిర్ణయించారట. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం భైరవం సినిమాను ఏప్రిల్ 18న విడుదల చేయాలని నిర్ణయించారు. ఆ సమయంలో అనుష్క నటించిన 'ఘాటీ' సినిమా విడుదల కాబోతుంది. అనుష్క ఘాటీ సినిమాను ఏప్రిల్ 18న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. ఘాటీ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. దాంతో ఆ తేదీని భైరవం సినిమాకి వినియోగించాలని మేకర్స్ భావిస్తున్నారట. అందుకే భైరవం సినిమాను ఏప్రిల్ 4 నుంచి ఏప్రిల్ 18కి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన అతి త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే మేకర్స్ సినిమా పబ్లిసిటీ కార్యక్రమాలు మొదలు పెట్టారు. త్వరలోనే సినిమా నుంచి పాటను విడుదల చేయబోతున్నట్లు సమాచారం అందుతోంది. రెండు వారాల ఆలస్యంగా సినిమా విడుదల కాబోతున్న కారణంగా ప్రమోషన్‌కి మరింత సమయం లభిస్తుంది. కనుక ఎక్కువ పబ్లిసిటీ చేసే అవకాశాలు ఉన్నాయి. మంచు మనోజ్ చాలా కాలం తర్వాత నటిస్తున్న సినిమా కావడంతో పాటు నారా రోహిత్ సైతం ఈ సినిమాలో నటించడం వల్ల అంచనాలు పెరిగాయి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సినిమాలు వరుసగా నిరాశ పరిచిన ఆయన నుంచి సినిమా వస్తుంది అంటే ఒక వర్గం ప్రేక్షకుల్లో అంచనాలు, ఆసక్తి ఉంటుంది. కనుక ఈ సినిమా కంటెంట్ బాగుంటే తప్పకుండా భారీ వసూళ్లు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాలో అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్స్‌గా నటించారు. శ్రీ చరణ్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు ఉన్నాయి.

## శ్రీలీల మళ్లీ పుంజుకుంటుందిగా..!

పెళ్లిసందడి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన శ్రీలీల మాస్ మహరాజ్ రవితేజ ధమాకాతో సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమా తర్వాత అమ్మడు వరుస సినిమా ఛాన్స్ లు అందుకుంది. ఐతే చేయడానికి అరడజను సినిమాల దాకా చేసినా అందులో భగవంత్ కేసరి, గుంటూరు కారం తప్ప మిగతా సినిమాలన్నీ కూడా డిజప్పాయింట్ చేశాయి. కెరీర్ లో ఎంత తక్కువ టైం లో స్టార్ క్రేజ్ వచ్చిందో అంతే త్వరగా డౌన్ ఫాల్ అయ్యింది శ్రీలీల. కొద్దిపాటి గ్యాప్ తో మళ్లీ శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటుంది. ప్రస్తుతం రవితేజతో మాస్ జాతర సినిమా చేస్తున్న శ్రీలీల నితిన్ రాబిన్ హుడ్ తో ఈ మంత్ ఎండ్ రాబోతుంది. ఈ సినిమాలతో పాటుగా అమ్మడు లేటెస్ట్ గా మరో లక్కీ ఛాన్స్ కొట్టేసిందని తెలుస్తుంది. ఇప్పటికే తెలుగుతో పాటు హిందీలో కార్తీక్ ఆర్యన్ తో ఒక సినిమా చేస్తుంది అమ్మడు.



కోలీవుడ్ లో కూడా శివ కార్తికేయన్ తో పరాశక్తి సినిమాలో అవకాశం దక్కించుకుంది. వీటితో పాటు మళ్లీ తెలుగు స్టార్ ఛాన్స్ లు వరుస కడుతున్నాయి. ఈ సినిమాలతో మళ్లీ శ్రీలీల పుంజుకుంటుందని చెప్పొచ్చు. శ్రీలీల డ్యాన్స్ సినిమాలకు అడ్వాంటేజ్ అవుతుంది. ఆమె ఉంటే మ్యూజిక్ అదిరిపోతుంది. ఐతే శ్రీలీలతో కలిసి డ్యాన్స్ చేయాలంటే హీరోలు కాస్త కష్టపడాల్సి వస్తున్నా కూడా అమ్మడు మాత్రం తన ఫ్యాన్స్ ని అలరించేందుకు అదరగొట్టేస్తుంది. రాబిన్ హుడ్ వైబ్ చూస్తుంటే శ్రీలీల ఖాతాలో ఒక హిట్ పడేలా ఉంది. ఇక వీటితో పాటుగా పవర్ స్టార్ తో చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ ఉండనే ఉంది. సో అమ్మడు మళ్లీ తన స్టార్ మేనియా కొనసాగించాలని చూస్తుంది. శ్రీలీల తప్పకుండా మళ్లీ తిరిగి ఫాం లోకి వచ్చేలా ఉంది. స్టార్ సినిమాలే కాదు యువ హీరోల సినిమాలతో కూడా శ్రీలీల ఆకట్టుకుంటుంది. రాబిన్ హుడ్, మాస్ జాతర ఇలా టాలీవుడ్ లో మళ్లీ తన పంథా కొనసాగించాలని చూస్తుంది. బాలీవుడ్ లో శ్రీలీల చేస్తున్న సినిమా ఆషికి 2 సీక్వెల్ అనే టాక్ ఉంది. కార్తీక్ ఆర్యన్ తో అమ్మడు లిప్ లాక్స్ గట్రా కానిచ్చినట్టు చెప్పుకుంటున్నారు. మరి శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ ఆమెకు ఎలాంటి ఫలితాన్ని అందిస్తుంది అన్నది చూడాలి. ఐతే సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా అమ్మడు అదరగొట్టాలని చూస్తుంది.

## పవన్ కళ్యాణ్ హీరోయిన్ స్టైలిష్ అవతార్

కన్నడ మూవీ 'పోర్కి' తో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రణిత సుభాష్. రెండో సినిమానే తెలుగులో చేసింది. 'ఏమ్ పిల్లో ఏమ్ పిల్లాడో' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన అందంతో ఆకట్టుకుని గుర్తింపు సొంతం చేసుకుంది. ఆ వెంటనే సిద్దార్థ్ హీరోగా నటించిన 'బావ' సినిమాలోనూ పల్లెటూరు అమ్మాయిగా నటించి పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు నటనతో అలరించడం వల్ల హీరోయిన్‌గా మంచి పేరు సొంతం చేసుకుంది. అయితే లక్ కలిసి రాక పోవడంతో స్టార్ హీరోయిన్‌గా ఇమేజ్‌ను దక్కించుకోవడంలో విఫలం అయింది. పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించడం ద్వారా మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ప్రణిత ఆ వెంటనే ఎన్టీఆర్‌తో కలిసి ఒక సినిమాలో నటించింది. స్టార్ హీరోల సినిమాల్లోనూ నటించిన ప్రణితకి సరైన బ్రేక్ దక్కలేదు. దాదాపు పదేళ్ల పాటు ఇండస్ట్రీలో వరుసగా సినిమాలు చేస్తూ వచ్చిన ప్రణిత ఈమధ్య కాలంలో కాస్త స్లో అయింది. పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా సినిమాల్లో



నటించేందుకు ఈమె రెడీగా ఉంది. గత సంవత్సరం ఈమె నటించిన రెండు సినిమాలు ప్రేక్షకలు ముందుకు వచ్చాయి. ప్రస్తుతం కూడా ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి 15 ఏళ్లు దాటినప్పటికీ అందం విషయంలో ఇంకా కొత్త హీరోయిన్స్‌కి పోటీ అన్నట్లుగా ఉంటుంది. మూడు పదుల వయసులో పడ్డా కూడా ప్రణిత ఆకట్టుకుంటుంది. 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగానే ఇప్పటికీ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఈమె స్టైలిష్ డ్రెస్‌లో ట్రెండీ డ్రెస్‌ల్లో ఎక్కువగా అలరిస్తూ ఉంటుంది. ప్రతి సందర్భంలోనూ ప్రణీత సుభాష్ షేర్ చేసే ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా ఈమె మరోసారి స్టైలిష్ అవతార్‌లో కనిపించింది. విభిన్నమైన ఔట్ ఫిట్‌లో డిఫరెంట్ లుక్, స్టైల్‌తో అలరించిన ఈ అమ్మడు మరోసారి అలరించింది. క్యూట్ లుక్‌తో స్కిన్ షో చేయకుండానే ప్రణిత చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రణిత అందంకు స్టార్ హీరోలకు జోడీగా ఇప్పటికి వరుసగా సినిమాలు చేయాల్సి ఉంది. సమంత స్థాయిలో స్టార్‌డంను సొంతం చేసుకోవాలి. కానీ ఆ స్థాయిలో ప్రణితకు ఆఫర్లు రాలేదు. లక్ కలిసి రాకపోవడంతో ఈమెకు దక్కాల్సిన గౌరవం, గుర్తింపు దక్కలేదు అనేది కొందరి అభిప్రాయం. ముందు ముందు అయినా ప్రణిత తన అందంతో అలరించి సీనియర్ స్టార్ హీరోలకు జోడీగా అయినా నటించే అవకాశాలు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536